PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 246 | విజయవాడ, బుధవారం 9 ఏప్రిల్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 9 April 2025 | Rs

15 ఏళ్లుగా వెట్టిచాకిరీ

- ఒకరి తర్వాత మరొకరికి విక్రయం
- కలెక్టర్‌కు ఎస్‌టి దంపతుల ఫిర్యాదు

2

ఇండియా మహిళా క్రికెట్ జట్టుకు శ్రీచరణి ఎంపిక

ప్రజాశక్తి - కడప

భారత సీనియర్ మహిళా క్రికెట్ జట్టుకు కడప క్రీడాకారిణి ఎన్.శ్రీచరణి ఎంపికయ్యారు. శ్రీలంక, దక్షిణాఫ్రికాలతో ఈ నెల 27 నుంచి ప్రారంభమయ్యే మ్యాచ్‌లకు ఇండియా తరఫున ఆమె ఆడనున్నారు. శ్రీలంకలోని కొలంబియాలో ప్రారంభమయ్యే ట్రై నేషన్స్ వన్డే సిరీస్ కోసం భారత సీనియర్ మహిళా జట్టుకు ఎన్.శ్రీ చరణిని ఎంపిక చేశారు. ఆమె ఇండియా ఉమెన్ క్రికెట్ జట్టుకు ఎంపికవ్వడం పట్ల జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.భరత్‌రెడ్డి, కార్యదర్శి ఎ.రెడ్డి ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల ట్రై నేషన్స్ వన్డే సిరీస్ మ్యాచ్‌లలో శ్రీచరణి మంచి ప్రతిభ కనపరచాలని ఆకాంక్షించారు.

పి4 అమలుకు సొసైటీ

• రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు వ్యవస్థ • స్టేట్ చైర్మన్‌గా చంద్రబాబు, డిప్యూటీ చైర్మన్‌గా పవన్‌కల్యాణ్

- ఆగస్టు 15 కల్లా 15 లక్షల బంగారు కుటుంబాల దత్తత
- సమీక్షలో సిఎం చంద్రబాబు

సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జీరో పావర్టీ-పి4 అమలుకు రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ప్రభుత్వం సొసైటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. పి4పై మంగళవారం సచివాలయంలో సిఎం సమీక్ష నిర్వహించారు. ఈ వ్యవస్థ పటిష్టత కోసం స్టేట్ లెవెల్ సొసైటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. స్టేట్ లెవెల్ సొసైటీ ఛైర్మన్‌గా సిఎం, వైస్ ఛైర్మన్‌గా డిప్యూటీ సిఎం వ్యవహరించనున్నారు. సిఇఒ, డైరెక్టర్ వారికి అనుసంధానంగా కాల్‌సెంటర్, టెక్‌టీమ్, ప్రోగ్రాం టీమ్, వింగ్‌టీమ్ ఉండనున్నాయి. జిల్లా చాప్టర్‌కు జిల్లా మంత్రి ఛైర్మన్‌గా, గ్రామ, వార్డు స్థాయిలో సెక్రటేరియట్ చాప్టర్‌కు పంచాయతీ కార్యదర్శి, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు ఉంటారన్నారు.

బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రతి జిల్లా కలెక్టర్, మంత్రులు, ఎమ్మెల్యేలు మార్గదర్శులను గుర్తించాల్సిన బాధ్యత వీరిదేనన్నారు. దాతలు ఎవరెవరు? ఎంతెంత మొత్తం ఇచ్చారు? ఇంకెంత సాయం 'బంగారు కుటుంబాలకు' అవసరమవుతుంది అనే విషయాలన్నీ వెబ్‌సైట్‌లో పొందుపరచడంతో పాటు పారదర్శకంగా ఉంటుందని సిఎం పేర్కొన్నారు. దాతలు ముందుగా పి4 ప్లాట్‌ఫామ్ ద్వారా లాగిన్ అవ్వడంతో ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఆగస్టు నాటికి ఈ నమోదు ప్రక్రియ పూర్తి చేసి కార్యరూపం దాల్చేలా చూడాలని అధికారులకు సిఎం నిర్దేశించారు. వచ్చే ఉగాది నాటికల్లా పి4 కార్యక్రమం ద్వారా ఏడాది కాలంలో ఏం సాధించామనే దానిపై వార్షిక ప్రగతి నివేదిక విడుదల చేయాలని సిఎం తెలిపారు. ఇందుకోసం 'మిలాప్', 'డోనేట్‌కార్ట్,' 'రంగ్‌దే' సంస్థలు ప్లేయర్లుగా పి4లో భాగస్వాములు అవుతున్నాయని సిఎం తెలిపారు. ఆగస్టు 15 కల్లా 5 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మార్గదర్శి, బంగారు కుటుంబాల నమోదు చేడుతున్నట్లు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు.

15 నుంచి 'ఇంటింటికి మన మిత్ర'

రెవెన్యూ, పోలీస్, మున్సిపల్‌శాఖల్లోనే అత్యధిక ఫిర్యాదులు అందుతున్నాయని, మొత్తం ఫిర్యాదుల్లో 90 శాతం ఆ శాఖలకు సంబంధించినవేనని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఫిర్యాదుల పరిష్కారానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)ను వినియోగించుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. గ్రీవెన్స్‌లలో వస్తున్న ఫిర్యాదులు, పరిష్కారాలపై సచివాలయంలో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు ఫిర్యాదులకు సంబంధించిన స్థితిని తెలిపేలా సమాచారం అందించాలన్నారు. పరిష్కరించగలిగే వినతుల విషయంలో ఫిర్యాదుదారుకు ఎందుకు పరిష్కరించలేకపోతున్నామనే విషయాన్ని సమగ్రంగా తెలియజేయాలని సిఎం పేర్కొన్నారు. ఆధార్ నెంబర్, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబరు తప్పనిసరిగా తీసుకోవడం ద్వారా గ్రీవెన్స్ నమోదుచేయాలని, దీని ద్వారా నకిలీ ఫిర్యాదులు అరికట్టవచ్చని సిఎం అన్నారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని పక్కదారి పట్టించేలా వ్యవస్థను దుర్వినియోగం చేసేలా ఒకే విషయంపై అదే పనిగా ఎవరైనా ఫిర్యాదు చేస్తూ ఉంటే అటువంటి వారి వివరాలు సేకరించి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు.

వినతులు పరిష్కరించిన తర్వాత ఎవరైతే గ్రీవెన్స్ దరఖాస్తు చేశారో వారి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని అధికారులకు సూచించారు. తనకు నేరుగా వచ్చే గ్రీవెన్స్‌లను ఆయా జిల్లాల కలెక్టర్లు స్వయంగా ఫిర్యాదుదారునితో సంప్రదించి ఫాలో అప్ చేయడం ద్వారా సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. గత ప్రభుత్వం రీ సర్వేలో నిబంధనలు ఉల్లంఘించడంతో భూ సంబంధిత ఫిర్యాదులు పెరిగినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఫిర్యాదుల్లో ముఖ్యంగా రెవెన్యూ రికార్డుల్లో భూ యజమాని పేరు మారిపోవడం, పట్టాదారు పాస్ పుస్తకాల్లో పేర్లు సవరణ, రీసర్వేలో విస్తీర్ణంలో తేడాలు వంటివి ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. పోలీస్‌శాఖకు సంబంధించి ఆస్తి తగాదాలు, సైబర్‌క్రైమ్, వైవాహిక సమస్యలు, భూ సంబంధిత తగాదాలు, ఆర్థిక నేరాలతో ముడిపడిన ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని సిఎం దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. మున్సిపల్ శాఖలో ఎక్కువగా ఆస్తుల ఆక్రమణ, నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టడం, అనధికార నిర్మాణాలు, ఆస్తిపన్నులు వంటి వాటిపై ఫిర్యాదులు వస్తున్నట్లు అధికారులు వివరించారు.

ప్రతి ఒక్కరి ఫోన్‌లో మనమిత్ర నెంబరు 9552300009

వాట్సాప్ గవర్నెన్స్‌లో భాగంగా ప్రభుత్వం ఈ నెల 15 నుంచి ఇంటింటికీ మనమిత్ర కార్యక్రమం ప్రత్యేక డ్రైవ్ చేపట్టనుంది. ఈ కార్యక్రమం పర్యవేక్షణ బాధ్యతలను ఆయా జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం అప్పజెప్పింది. సచివాలయ సిబ్బందితో ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించడంతోపాటు ప్రతిఒక్కరి మొబైల్‌లో మనమిత్ర నెంబరు ఉండేలా చేయాల్సి ఉంది. మనమిత్ర నెంబరు 9552300009ను ప్రతిఒక్కరూ సేవ్ చేసుకోవాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే డిజిటల్ సర్టిఫికెట్లకు చట్టబద్ధత కూడా ఉందని ఐటి, ఆర్‌టిజిఎస్ శాఖలు వెల్లడించాయి.

చట్టవిరుద్ధం, ఏకపక్షం!

తమిళనాడు గవర్నర్ వైఖరిని తప్పుబట్టిన సుప్రీం

- ఆ 10 బిల్లులు ఆమోదం పొందినట్లేనని రూలింగ్
- చిత్తశుద్ధిలేదని వ్యాఖ్య
- బిల్లుల ఆమోదానికి కాలపరిమితి
- చారిత్రక తీర్పు: స్టాలిన్

న్యూఢిల్లీ : తమిళనాడు రాష్ట్రప్రభుత్వం పంపిన బిల్లులను ఆమోదించకుండా తనవద్దే తొక్కి పట్టి వుంచిన గవర్నర్ ఆర్.ఎన్.రవి వైఖరిని సుప్రీం కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. కీలకమైన 10 బిల్లులను ఆమోదించకుండా తన వద్దనే అట్టిపెట్టుకుంటూ ఆయన తీసుకున్న నిర్ణయం, వ్యవహరించిన తీరు చట్ట విరుద్ధమైనదని, ఏకపక్షమని రూలింగ్ ఇచ్చింది. గవర్నర్ ఆమోదించకుండా ఆపిన తర్వాత ఆ బిల్లులను మళ్లీ రాష్ట్రపతికి పంపలేరని కూడా స్పష్టం చేసింది. అందువల్ల గవర్నర్ తీసుకున్న చర్యను కొట్టివేస్తున్నామని జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన బెంచ్ పేర్కొంది. కీలకమైన ఆ పది బిల్లులకు సంబంధించి గవర్నర్ ఏ చర్యలైతే తీసుకున్నారో అవన్నీ కూడా రద్దవుతాయని పేర్కొంది. పైగా గవర్నర్‌కు తిరిగి పంపినప్పటి తేదీ నుండి ఈ బిల్లులన్నీ కూడా ఆమోదం పొందినట్లుగా పరిగణించబడతాయని స్పష్టం చేసింది. గవర్నర్ రవి చిత్తశుద్ధితో వ్యవహరించలేదని కోర్టు మిగతా 7లో

స్వాగతించిన సిపిఎం

తమిళనాడు శాసనసభ పంపిన బిల్లులకు ఆమోదం తెలపకుండా వాటిని తన వద్దే ఉంచుకున్న గవర్నర్ చర్యను తప్పుపడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సిపిఎం పొలిట్‌బ్యూరో స్వాగతించింది. గవర్నర్ పెండింగులో ఉంచిన పది బిల్లులకు చట్ట రూపం లభించిందని సుప్రీంకోర్టు ప్రకటించింది. 'గవర్నర్ చర్యలు చట్టవిరుద్ధం, ఏకపక్షం అని సుప్రీంకోర్టు అభివర్ణించింది. ఒకసారి శాసనసభ బిల్లులను ఆమోదించిన తర్వాత వాటిపై నిర్ణయం తీసుకోవడానికి న్యాయస్థానం కాలపరిమితిని కూడా నిర్దేశించింది. ఇది చారిత్రక తీర్పు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు చెందిన చాలా మంది గవర్నర్ల చర్యలను కూడా ఈ తీర్పు తప్పుపట్టింది. వారు రాజ్యాంగంలోని సమాఖ్య సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరించారు' అని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో సిపిఎం పొలిట్‌బ్యూరో తెలిపింది. సుప్రీంకోర్టు తీర్పు కేరళ సహా అన్ని రాష్ట్రాలకూ ఒక ప్రమాణాన్ని నిర్దేశించిందని తెలియజేసింది. కేరళసహా అనేక రాష్ట్రాల్లో శాసనసభలు ఆమోదించిన అనేక బిల్లులకు ఆమోదముద్ర వేయకుండా గవర్నర్లు వాటిని తమ వద్ద అట్టే పెట్టుకుంటున్నారని గుర్తు చేసింది. మన రాజ్యాంగంలోని సమాఖ్య సూత్రాలను బలోపేతం చేయడానికి ఈ తీర్పు దోహదపడుతుందని అభిప్రాయపడింది. సుప్రీం కోర్టు తీర్పు నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి ఊతమిచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కాపాడిందని తెలిపింది.

దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల దోషులకు ఉరిశిక్ష

- ఎన్ఐఎ కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ జంట బాంబు పేలుళ్ల కేసులో ఐదుగురికి ఉరిశిక్షను సమర్థిస్తూ తెలంగాణ హైకోర్టు మంగళవారం తీర్పు వెల్లడించింది. గతంలో ఎన్ఐఎ స్పెషల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఈ మేరకు జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ శ్రీసుధతో కూడిన డివిజన్ బెంచ్ 357 పేజీల తీర్పు చెప్పింది. 2013, ఫిబ్రవరి 21న రాత్రి ఏడు గంటలకు దిల్‌సుఖ్‌నగర్ 107 నంబర్ బస్‌స్టాప్ వద్ద, అక్కడే ఉన్న మిర్చి సెంటర్ వద్ద వెంటవెంటనే బాంబులను పేల్చిన దోషుల విషయంలో కనికరం అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ ఘటనలపై అప్పటి ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయగా, కేంద్ర హోంశాఖ ఎన్ఐఎను రంగంలోకి దింపింది. బాంబు పేలుళ్లకు 18 మంది చనిపోగా.. 131 మంది గాయపడ్డారు. దోషుల్లో ఒకడైన రియాజ్ భత్కల్ పాక్‌లో ఉన్నట్లు ఎన్ఐఎ చెబుతోంది. మిగిలిన ఐదుగురు అసదుల్లా అక్తర్, జియా ఉర్ రెహ్మాన్ (పాక్ పౌరుడు), తెహసీన్ అక్తర్, మొహమ్మద్ అహ్మద్ సిద్దిభాపా అలియాస్ యాసిన్ భత్కల్, ఎజాజ్ షేక్‌లకు ఎన్ఐఎ స్పెషల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు విధించిన ఉరిశిక్షను హైకోర్టు ఆమోదించింది. సుమారు రెండేళ్ల పాటు చర్లపల్లి కోర్టు ఆవరణలో కట్టుదిట్టమైన భద్రత మధ్య విచారణ ఎన్ఐఎ కోర్టు జరిపింది. 157 మంది సాక్షులను విచారించింది. 502 పత్రాలను, 201 ఆధారాలను పరిశీలించింది. అయిదుగురూ దోషులేనని 2016 డిసెంబర్ 13న ప్రకటించింది. వారం తర్వాత ఆ ఐదుగురికి ఉరి శిక్ష విధించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ ఐదుగురు హైకోర్టులో అప్పీల్ చేశారు. పేలుళ్ల ప్రధాన సూత్రధారి మహ్మద్ రియాజ్ అలియా రియాజ్ బక్తల్‌గా గుర్తించారు. కర్ణాటక బక్తల్‌కు చెందిన రియాజ్ బక్తల్ పాకిస్తాన్‌లో ఉన్నాడని తేల్చిన ఎన్ఐఎ రెడ్‌కార్నర్ నోటీసులిచ్చింది. దేశసమగ్రత, సమైక్యతను దెబ్బతీసే కుట్రలో భాగంగా పేలుళ్లకు పాల్పడ్డారని అందులో పేర్కొంది. ఎన్ఐఎ వాదనను కింది కోర్టు ఆమోదించగా, ఆ తీర్పును హైకోర్టు సైతం సమర్థించింది. దోషులు దాఖలు చేసిన అప్పీళ్లను డిస్మిస్ చేసింది. బాంబు దాడుల ఘటనల్లో అభం, శుభం తెలియని అమాయకులు మరణించారని, మారణహోమానికి ఒడిగట్టిన చర్యల ప్రభావం బాధితులపైనే కాదని సభ్య సమాజంపై ఉందని పేర్కొంది. దోషుల ప్రవర్తన, వాళ్ల గత చరిత్ర, నేర తీవ్రత, మృతుల కుటుంబసభ్యుల మనోవేదన, గాయపడిన వాళ్ల గోడు.. అన్నింటినీ పరిశీలిస్తే ఉరిని రద్దు చేయాలనే అప్పీళ్లను ఆమోదించలేమంది. దారుణ మారణహోమానికి పాల్పడిన వాళ్లలో మార్పు వస్తుందని, సంస్కరణల దిశ కోణంలో ఉరిని రద్దు చేయాలనే అప్పీల్‌దారుల వాదన తిరస్కరిస్తున్నామని ప్రకటించింది.

సింగపూర్‌లో అగ్ని ప్రమాదం పవన్ కల్యాణ్ చిన్న కుమారుడికి గాయాలు

సింగపూర్ : సింగపూర్‌లోని ఒక స్కూల్లో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ (7) గాయపడ్డాడు. సింగపూర్ సివిల్ డిఫెన్స్ ఫోర్స్ (ఎస్‌సిడిఎఫ్) అధికారిక ఫేస్‌బుక్ పేజ్ ప్రజలకు అందించిన సమాచారం మేరకు రివర్ వ్యాలీ రోడ్‌లోని స్కూల్లో కుకింగ్‌కు సంబంధించి సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తుండగా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మూడంతస్తుల ఈ భవనంలో చిక్కుకున్న నలుగురు పెద్దవారిని, 15మంది చిన్నారులను ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమదంలో మార్క్ శంకర్ కాళ్లకు, చేతులకు గాయాలవడంతోపాటు ఊపిరితిత్తుల్లోకి పొగ వెళ్లిపోవడంతో ఆస్పత్రిలో చేర్చారని, అక్కడ చికిత్స అందుతోందని జనసేన పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తున్న పవన్ కల్యాణ్ ఇక్కడ పర్యటన ముగించుకుని సింగపూర్ బయలుదేరారు. మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆకాంక్షించారు. ఈ మేరకు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు.

గ్యాస్ ధరపై ఆగ్రహ జ్వాలలు

రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు

విజయవాడ బీసెంట్ రోడ్డులో గ్యాస్ సిలిండర్‌లను మెడకు బిగించుకుని నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రజాశక్తి -యంత్రాంగం

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలపై ఆగ్రహజ్వాలలు వ్యక్తమయ్యాయి. సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. పలుచోట్ల గ్యాస్ సిలిండర్‌లను తాళ్లతో మెడకు బిగించుకుని మహిళలు నిరసనలు తెలుపగా.. మరికొన్ని చోట్ల తలపై గ్యాస్ బండను మోస్తూ ప్రదర్శన నిర్వహించారు. కట్టెల పొయ్యిపై వంట చేస్తూ నిరసన తెలిపారు. పెంచిన గ్యాస్ సిలిండర్ల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ధరలు తగ్గించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

విజయవాడ బీసెంట్ రోడ్డులోని అన్నారీపార్కు సెంటర్‌లో గ్యాస్ సిలిండర్లను తాళ్లతో మెడకు బిగించుకొని మహిళలు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ.. గ్యాస్ సిలిండర్‌తోపాటు ఇతర అన్ని రకాల ధరలు పెంచి ప్రజల నెత్తిన భారాలు మోపడమే సిఎం చంద్రబాబు చెపుతున్న పి-4 ఉద్దేశమని, ఇటువంటి భారాలకు వ్యతిరేకంగా సిపిఎం రాజీలేని పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ పోరాటాల్లో ప్రజలు కలిసి రావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలపై మోపిన గ్యాస్, ఇతర భారాలకు సిఎం చంద్రబాబు, మిగతా 7లో

సుంకం తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని రద్దు చేసి అంతర్జాతీయంగా ముడి చమురు ధరలకు అనుగుణంగా, స్థానికంగా ధరలను తగ్గించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.2 అదనపు సుంకాన్ని విధించినా, ధర పెంచలేదని ప్రజలను మభ్యపెట్టి, మోసపుచ్చుటాన్ని నిరసిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినందున అందుకు అనుగుణంగా దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించి ప్రజలపై భారం పడకుండా చేయాల్సింది పోయి సుంకాన్ని పెంచి కేంద్ర ప్రభుత్వం తన ఖజానాలో వేసుకోవడం గర్హనీయమన్నారు. మరోవైపు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచలేదని ప్రచారం చేసుకోవడం ప్రజలను మభ్యపెట్టడమేనని చెప్పారు. అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పుడు పెంచి, తగ్గినప్పుడు తగ్గించక పోవడం ప్రజలను వంచించడమేనని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎక్సైజ్ సుంకాన్ని రద్దు చేసి పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే లీటరుకు రూ.2 చొప్పున తగ్గించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

- తప్పు చేసిన ఏ పోలీసునూ వదిలిపెట్టం : జగన్
- లింగమయ్య కుటుంబానికి పరామర్శ

సత్యసాయి జిల్లా రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో లింగమయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జగన్

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

టిడిపి కూటమి పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామంలో పది రోజుల క్రితం హత్యకు గురైన కురుబ లింగమయ్య కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించారు. హెలికాప్టర్‌లో బెంగళూరు నుంచి నేరుగా పాపిరెడ్డిపల్లి గ్రామానికి జగన్ చేరుకున్నారు. లింగమయ్య ఇంటి వద్దకెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో జగన్ మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో టిడిపికి బలం లేకున్నా తమవైపు తిప్పుకునేందుకు అనేక అప్రజాస్వామిక విధానాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనుసరించారని విమర్శించారు. విశాఖపట్నం, తిరుపతి, రామకుప్పం, అత్తిలి తదితర ప్రాంతాల్లో ఇటువంటి ప్రయత్నాలు జరిగాయన్నారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలంలోనూ ఎంపిటిసి సభ్యులు ఎనిమిది మంది వైసిపి వాళ్లుంటే వారందరినీ భయపెట్టి టిడిపిలో చేర్చుకునేందుకు వివిధ రకాలుగా ఇక్కడి ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆయన కుమారుడు శ్రీరామ్ ప్రయత్నించారని, దీనికి స్థానిక ఎస్ఐ సుధాకర్ మద్దతుగా వ్యవహరించారని విమర్శించారు. వారి ప్రలోభాలకు లొంగకుండా వైసిపి ఎంపిటిసి సభ్యులు గట్టిగా నిలబడ్డారన్నారు. అందుకు వారిని పోలీసు స్టేషన్‌లో బైండోవర్ చేశారని, వారికి మద్దతుగా వెళ్లిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు ఉషశ్రీచరణ్‌పైనా కేసులు నమోదు చేశారని తెలిపారు. తమ పార్టీకి మద్దతుగా నిలిచిన కురుబ లింగమయ్యను 20 మంది టిడిపి మద్దతుదారులు హత్యగా కేసులు మాత్రం ఇద్దరిపైనే పెట్టారని విమర్శించారు. ఇదే రకంగా మిగతా 7లో

పోలవరంపై తెలంగాణ అభ్యంతరాలు

- ముంపు, బ్యాక్ వాటర్స్‌పై అధ్యయనం
- సంయుక్త సర్వేకు నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రాంతంలో ముంపు, బ్యాక్ వాటర్స్ ప్రభావం ఉండే ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై సంయుక్తంగా అధ్యయనం చేయాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పిపిఎ) నిర్ణయించింది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు చేసిన విజ్ఞప్తిని అంగీకరించింది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఉన్న అభ్యంతరాలను పిపిఎ ముందు తెలంగాణ అధికారులు స్పష్టంగా చెప్పారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ సమావేశం ఛైర్మన్ అతుల్‌జైన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కృష్ణా, గోదావరి భవన్‌లోని పిపిఎ కార్యాలయంలో జరిగింది. తెలంగాణ ఇఎన్‌సి జి అనిల్‌కుమార్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు చీఫ్ ఇంజనీర్లు సుగుణాకర్, నర్సింహ్మమూర్తి పాల్గొన్నారు. పోలవరం పనుల పురోగతి, అంచనా వ్యయం, నిధులు ఇతర అంశాలపై ఈ భేటీలో చర్చించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణకు ఉన్న అభ్యంతరాలను అధికారులు మరోసారి పిపిఎతో సవివరంగా మాట్లాడారు. పోలవరం పూర్తి నిల్వ సామర్థ్యం గురించి కూడా అధికారులు ప్రస్తావించారు. కిన్నెరసాని, ముర్రేడువాగు, ఇతర ప్రవాహాల చర్యల గురించి కూడా చర్చించినట్టు తెలిసింది. ఖమ్మంతోపాటు భద్రాచలం పట్టణాలపై పోలవరం బ్యాక్ వాటర్స్ ప్రభావం, రామాలయం వద్ద నీటిమట్టం, మణుగూరు భారజల ప్లాంట్ వద్ద వాటర్ లెవెల్స్ అంశంపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలని తెలంగాణ రాష్ట్ర అధికారులు మరోసారి అథారిటీని కోరారు. గత సంవత్సరం వరదల ప్రభావం మూలంగా ముంపునకు గురైన నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటిని నిల్వచేస్తే ఆ ప్రభావం తెలంగాణపై ఏ మేరకు ఉంటుందనే విషయాలపై అధ్యయనం చేయాలని తెలంగాణ కోరగా, అందుకు ఎపి అధికారులు అవసరం లేదని వాదించారు. గతంలో ఉన్న వివరాలే సరిపోతాయని అభిప్రాయపడ్డారు. కాగా సంయుక్త సర్వే చేయాలని పిపిఎ నిర్ణయం తీసుకుంది.

ప్రసవ మరణాల్లో భారత్‌కు రెండోస్థానం

న్యూఢిల్లీ : అత్యధిక ప్రసవ మరణాలతో ప్రపంచంలోనే భారత్ రెండో స్థానంలో నిలిచినట్లు ఐక్యరాజ్య సమితి నివేదిక తెలిపింది. '2000-2023లో ప్రసూతి మరణాల స్థితి'పై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ), యునిసెఫ్, ఐరాస పాపులేషన్ ఫండ్, ప్రపంచ బ్యాంక్, యుఎన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అండ్ సోషల్ అఫైర్స్ (జనాభా విభాగం) ఈ నివేదిక రూపొందించాయి. 2023లో మూడొంతుల కంటే ఎక్కువగా (28.7 శాతం), సుమారు 75,000 మరణాలతో నైజీరియా మొదటి స్థానంలో ఉంది. పది వేల కంటే అధిక ప్రసూతి మరణాలు నమోదైన మొదటి మూడు దేశాలు భారత్, కాంగో (19,000), పాకిస్థాన్ (11,000). ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రసూతి మరణాలలో భారత్, కాంగోలు 7.2 శాతం, పాకిస్థాన్ 4.1 శాతం వాటా కలిగి ఉన్నాయి. భారత్‌తో సమానమైన జనాభా కలిగిన చైనాలో 2023లో 1,400 ప్రసూతి మరణాలు నమోదయ్యాయని తెలిపింది.

వాటర్ వరల్డ్‌లో బాలుడు మృతిపై ఆగ్రహం

- విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ ఎదుట సిపిఎం ధర్నా

ప్రజాశక్తి- సీతమ్మధార, కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ పోర్టు కళావాణి ఆవరణలోని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ వాటర్ వరల్డ్‌లో సోమవారం రాత్రి ఎనిమిదేళ్ల బాలుడు రిషి మృతి చెందిన ఘటనపై ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. పోర్టు స్టేడియం ఎదుట సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కయ్యపాలెం జోన్ నాయకులు రాజు మాట్లాడుతూ.. వాటర్ వరల్డ్‌లో భద్రతా లోపాల కారణంగానే రిషి చనిపోయారన్నారు. సిసి కెమెరాలు, కోచ్, భద్రతా సిబ్బంది లేరని తెలిపారు. పోర్టు స్టేడియాన్ని పాత పద్ధతిలో ప్రభుత్వమే నడిపేలా చర్యలు చేపట్టాలని, విశ్వనాథం స్పోర్ట్స్ క్లబ్ యాజమాన్యాన్ని తక్షణమే అరెస్టు చేయాలని, రిషి కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌ను పోర్టు తక్షణమే స్వాధీనం చేసుకోవాలని, లీజు ఒప్పందాన్ని రద్దుచేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ వాటర్ వరల్డ్‌లో బాలుడు మృతి ఘటనపై సిబిఐ విచారణ జరిపించాలని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు డిమాండ్ చేశారు.

విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ మూసివేత

బాలుడు మృతి నేపథ్యంలో విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌ను మూసివేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఘటనపై విచారణకు డిప్యూటీ కలెక్టర్‌ను నియమించారు. టూరిజం అధికారులు కూడా తనిఖీలు చేపట్టారు. తనిఖీల సమయంలో విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ యాజమాన్యం అందుబాటులో లేరు.

ఎపిపిఎస్‌సి సెక్రటరీగా రాజబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) సెక్రటరీగా 2013 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి పి రాజబాబును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం జిఓ ఆర్‌టి నెంబరు 669ని విడుదల చేసింది. రాజబాబు గతేడాది జులై నుంచి ఎపిస్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ఆయనను అక్కడ నుంచి రిలీవ్ చేస్తూ ఎపిపిఎస్‌సి సెక్రటరీగా బదిలీ చేసింది. అయితే హౌసింగ్ కార్పొరేషన్‌కు నూతన ఎమ్‌డిని నియమించలేదు.

కాంతిరాణాను వేధించడం లేదు : సిఐడి

ప్రజాశక్తి-అమరావతి

సినీనటి కాదంబరి జత్వానీ ఫిర్యాదు మేరకు ఐపిఎస్ అధికారి కాంతిరాణాపై ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో ఇప్పుడేమీ చార్జిషీట్ దాఖలు చేయబోమని హైకోర్టుకు సిఐడి తెలిపింది. ప్రస్తుతానికి చార్జిషీట్ దాఖలు చేయబోమని సిఐడి తరపున రాష్ట్ర అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ చెప్పారు. విచారణ పేరుతో కాంతిరాణాను వేధించడం లేదన్నారు. నోటీసులు కూడా ఇవ్వలేదన్నారు. కౌంటర్ దాఖలు చేస్తామని చెప్పడంతో హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నూనెపల్లి హరినాథ్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

హోటల్స్, టెంట్‌హౌస్‌తో ఉపాధి

- ఐటిడిఎ, ప్రభుత్వం ద్వారా ప్రతిపాదనలు
- కురిడి రచ్చబండలో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

కురిడిలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి -డుంబ్రిగుడ (అల్లూరి సీతారామరాజు జిల్లా)

హోటల్స్, టెంట్ హౌస్ లాంటివి ఏర్పాటు చేసుకుని యువత ఉపాధి పొందాలని, దీని కోసం ఐటిడిఎ, ప్రభుత్వం ద్వారా ప్రతిపాదనలు తయారు చేస్తామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పారు. టూరిజం పరంగా ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందాలని అన్నారు. అడవితల్లి బాటలో భాగంగా రెండో రోజు డుంబ్రిగుడ మండలం కురిడి గ్రామంలో పవన్‌కల్యాణ్ పర్యటించారు. అనంతరం గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని సమస్యలనడిగి తెలుసుకున్నారు. వీధి కాలువలు, తాగునీరు కల్పించాలని, వయోవృద్ధులకు పింఛన్లు మంజూరు చేయాలని గ్రామస్తులు విన్నవించారు. వలంటరీ వ్యవస్థను కొనసాగించి ఉపాధి కల్పించాలని ఎపి గ్రామ వలంటీర్ సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన గ్రామంలోని వలంటీరు ఆర్.దివ్యభారతి, ఆనంద్ కోరారు. దీనిపై పవన్‌కల్యాణ్ స్పందిస్తూ గ్రామ వలంటీర్ల వ్యవస్థకు ప్రభుత్వంతో సంబంధం లేకుండా గత ప్రభుత్వం చేపట్టిందని, దానికి సంబంధించి ఏ విధమైన జిఒలు లేవని తెలిపారు. వలంటీర్లకు ఉపాధి కల్పించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి ఆలోచిస్తున్నామని చెప్పారు. కురిడి గ్రామంలో ఇంటి చుట్టూ స్థలాలు ఉన్న వారు కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీనివల్ల ఆర్థికంగా, ఆరోగ్యపరంగా లబ్ధి చేకూరుతుందన్నారు. వీటికి ఉపాధి హామీ, హార్టికల్చర్ ద్వారా ప్రతిపాదనలు తయారుచేసి ప్రత్యేక నిధులు కేటాయించడానికి కృషి చేస్తామని చెప్పారు. అరకు పర్యాటక ప్రాంతంలో చిన్నచిన్న సినీ అవుట్ డోర్ షూటింగ్‌లు వంటివి ఏర్పాటు చేసుకుంటే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నివారణకు ఆరోగ్య సిబ్బందితో గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటుచేసి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కురిడి పంచాయతీకి రూ.ఐదు లక్షలు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఎపిఎస్‌ఆర్‌టిసి విజయనగరం రీజనల్ జోనల్ చైర్మన్ ఎస్.దొన్నుదొర, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సుంకరమెట్టలో ఉడెన్ బ్రిడ్జ్ ప్రారంభం

ఎకో టూరిజం అభివృద్ధిలో భాగంగా అరకులోయ మండలం, సుంకరమెట్ట కాఫీ ఎస్టేట్‌లో ఏర్పాటు చేసిన చెక్క వంతెనను పవన్‌కల్యాణ్ ప్రారంభించారు. ముందుగా ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఆర్‌వి.సుజయకృష్ణ రంగారావుతో కలసి కాఫీ తోటల్లో ఉప ముఖ్యమంత్రి మొక్కలు నాటారు. అనంతరం కాఫీ తోటల మధ్య ఆ వంతెనపై కెనోపీ వాక్ ప్రారంభించారు. సిల్వర్ ఓక్ చెట్ల మధ్య వేసిన కాఫీ మొక్కలు, ఎత్తయిన మొక్కలపైకి పాకిన మిరియాల పంటల సాగుపై ఆరా తీశారు. కాఫీ తోటలు, ఎకో టూరిజం అభివృద్ధికి సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు.

15 ఏళ్లుగా వెట్టిచాకిరీ

- ఒకరి తర్వాత మరొకరికి విక్రయం
- కలెక్టర్‌కు ఎస్‌టి దంపతుల ఫిర్యాదు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

నేటి రాకెట్ యుగంలో కూడా వెట్టిచాకిరీ వంటి అమానుష సంఘటనలు సమాజంలో పొడచూపుతున్నాయి. ఎస్‌టి దంపతులతో15 సంవత్సరాలుగా వెట్టిచాకిరీ చేయించుకుని, ఒకరి తర్వాత మరొకరికి విక్రయిస్తూ అమానుషానికి పాల్పడిన సంఘటన బాపట్ల జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై ఎస్‌టి కమిషన్ చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కృష్ణాజిల్లా, ఎలిసేటిదిబ్బకు చెందిన వ్యక్తులు తమతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని బాపట్ల జిల్లా కలెక్టర్‌కు బాపట్ల జిల్లా రేపల్లె మండలం బొబ్బర్లంకకు చెందిన నంబూరు పద్మ, అగ్ని దంపతులు సోమవారం ఫిర్యాదు చేశారు. బాధితులు ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు.. చెన్ను కోటేశ్వరరావు అనే వ్యక్తి పీతల వేట కోసం ఎలిసేటిదిబ్బకు తమను పంపారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రెండేళ్ల తర్వాత చెన్ను వెంకటేశ్వరరావు అనే వ్యక్తికి తమను రూ.40 వేలకు విక్రయించారని చెప్పారు. తాము పడవల్లో మడ అడవుల్లోకి వెళ్లి పీతలు పట్టుకువస్తే కిలోకు రూ.వంద చొప్పున బియ్యం, పప్పు, కూరగాయలు ఇచ్చేవారని తెలిపారు. తమతో చెన్ను వెంకటేశ్వరరావు ఏడు సంవత్సరాలు పని చేయించుకుని చెన్ను ఏగేసు అనే వ్యక్తికి రూ.70 వేలకు విక్రయించాడని చెప్పారు. ఏగేసు రూ.1.20 లక్షలకు చెన్ను అశ్వేశ్వరరావుకు విక్రయించాడని పేర్కొన్నారు. మధ్యవర్తి నల్లబాబు అనే వ్యక్తి బొబ్బర్లంకకు చెందిన మిగతా ఎస్‌టిలను బయట వ్యక్తులకు అమ్మేస్తున్నారని ఆరోపించారు. రేపల్లె డిఎస్‌పికి ఫిర్యాదు చేశామని, బడా వ్యక్తుల నుంచి తమను కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు. బాధితుల ఫిర్యాదుపై రెవెన్యూ, పోలీసు, గిరిజన సంక్షేమ శాఖ, కార్మిక శాఖ అధికారులతో కమిటీ వేసి సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్ వెంకటమురళి ఆదేశించారు.

ఎస్‌టి కమిషన్ చైర్మన్ ఆగ్రహం

వెట్టిచాకిరీ ఘటనపై సమగ్ర నివేదిక పంపాలని ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి.శంకరరావు జిల్లా అధికారులను ఆదేశించారు. వెట్టిచాకిరీ చేయించడంతో పాటు దంపతులను అమ్మకానికి పెట్టడంపై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కాలంలో కూడా వెట్టిచాకిరీ చేయించడం దారుణమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఘటనపై పూర్తి నివేదికను వెంటనే కమిషన్‌కు సమర్పించాలని బాపట్ల జిల్లా అధికారులను ఆదేశించారు.

కోర్టు ఫీ స్టాంపుల కొరత

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలో 3 మాసాలుగా వివిధ కోర్టులు, రెవెన్యూ కోర్టులు, వేర్వేరు ట్రిబ్యునళ్లలో కోర్టు ఫీజుల స్టాంపుల కొరత ఉందని, ఈ సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) కోరుతూ లేఖ రాసింది. కోర్టుల్లో రోజువారీ కేసుల దాఖలులో కోర్టు ఫీజుల స్టాంపులు తప్పనిసరని ఐలూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు రాష్ట్ర ప్రభుత్వానికి మంగళవారం లేఖ రాశారు. రూపాయి, రెండు రూపాయలు, ఐదు రూపాయలు, పది రూపాయలు, ఇరవై రూపాయల స్టాంపుల కొరత తీవ్రంగా ఉందన్నారు. లాయర్లు, కక్షిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కోర్టుల్లో కేసుల దాఖలు సక్రమంగా సాగేందుకు కోర్టు ఫీజు స్టాంపులను అందుబాటులో ఉండేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

కుటుంబ వ్యవసాయాన్ని రక్షించాలి

- 'ప్రత్యామ్నాయ వ్యవసాయం ఎందుకు? ఎలా?' చర్చాగోష్టిలో ఆర్థికవేత్త నరసింహారెడ్డి

ప్రత్యామ్నాయ వ్యవసాయం ఎందుకు? ఎలా? అనే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ప్రజాశక్తి - తాడికొండ (గుంటూరు జిల్లా)

కుటుంబ వ్యవసాయాన్ని రక్షించాలని ఆర్థికవేత్త డి.నరసింహారెడ్డి అన్నారు. విచ్చలవిడి వనరుల వాడకంతో వ్యవసాయ నష్టకర అభివృద్ధికి దారితీస్తుందంటూ 1968లో జరిగిన సైన్స్ కాంగ్రెస్‌లో ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాథన్ హెచ్చరించారని గుర్తు చేశారు. 'ప్రత్యామ్నాయ వ్యవసాయం ఎందుకు? ఎలా?' అనే అంశంపై రైతు రక్షణ వేదిక ఆధ్వర్యంలో గుంటూరు సమీపంలోని లాం లో ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయంలో మంగళవారం విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాల్ అధ్యక్షతన చర్చాగోష్టి నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నరసింహారెడ్డి మాట్లాడుతూ.. 1990 దశకం నుంచి వ్యవసాయ రంగం సంక్షోభ దశకు చేరుకుని చిన్న, సన్నకారు రైతులను, భూమిలేని వ్యవసాయదారులను తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందని చెప్పారు. గత 25 ఏళ్లలో ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మనదేశంలోనే మూడున్నర లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, రైతులు వ్యవసాయాన్ని వదిలి ఇతర వృత్తుల్లోకి వెళ్లడంతో సంక్షోభం మరింత పెరగడానికి దారితీసిందని ఆవేదన వెలిబుచ్చారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన కమిషన్ల సిఫారసులను అమలు చేసి ఉంటే వ్యవసాయం ఈ దుస్థితిలో ఉండేది కాదన్నారు. మనదేశంలో వ్యవసాయం, విద్య, ఆరోగ్య రంగాలపై ప్రపంచీకరణ తీవ్ర ప్రభావం చూపిందని, విత్తనాల వ్యాపారంతో బహుళజాతి కంపెనీలు రూ.కోట్లు కొల్లగొడుతున్నాయని చెప్పారు. సంప్రదాయ విత్తనాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, కమ్యూనిటీ సీడ్ బ్యాంకులు ఏర్పాటు చేయాలని అన్నారు. పంటలకు మద్దతు ధర ప్రభుత్వాల బాధ్యతని గుర్తు చేశారు. విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ శారదా జయలక్ష్మి దేవి మాట్లాడుతూ.. రైతులు మితిమీరి వాడుతున్న ఎరువులు, పురుగు మందుల వల్ల సాగు ఖర్చు పెరుగుతోందన్నారు. సుస్థిర వ్యవసాయ విధానాలు, జీవనియంత్రణ పద్ధతులు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రత్యామ్నాయ వ్యవసాయంపై పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతురక్షణ వేదిక నాయకులు డాక్టర్ కొల్లా రామ్మోహన్‌రావు, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ జివి రామాంజనేయులు, డాక్టర్ బి.శరత్‌బాబు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, గుంటూరు జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఝాన్సీ, కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, కిసాన్ ఫౌండేషన్ సభ్యులు మురళీధర్, రైతు నాయకులు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఊరటనివ్వని ప్రభుత్వ భరోసా

- రొయ్య ధరలు బేజారు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం, ఏలూరు ప్రతినిధులు

మన దేశ ఆక్వా ఎగుమతులపై అమెరికా 26 శాతం సుంకం విధించడంతో రొయ్యల సాగు రైతులు బేజారవుతున్నారు. ఈ పన్ను బుధవారం నుంచి అమల్లోకి రానుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన భరోసా ధర రైతులకు ఊరటనివ్వడం లేదు. వంద కౌంట్‌ను రూ.220కు కొనుగోలు చేయాలని ఎగుమతి వ్యాపారులకు చంద్రబాబు సూచించారు. అయితే, ఈ ధర తమకు గిట్టుబాటు కాదని రైతులు అంటున్నారు. మిర్చి రైతుల పరిస్థితి మాదిరిగానే తమ పరిస్థితీ మారనుందని, భవిష్యత్తులో ఈ ధర పెరగకపోగా తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ ప్రతికూల పరిస్థితులు, విద్యుత్ కోతలను అధిగమించి రైతులు ఈ ఏడాది రొయ్యలను సాగు చేశారు. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో రొయ్యలకు మంచి ధర లభించింది. 30 కౌంట్‌కు రూ.610 చొప్పున అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడింది. అదే సమయంలో 100 కౌంట్ ధర రూ.260 నుంచి రూ.270 వరకూ పలికింది. దీంతో, వేసవిలో కూడా లాభాల పంట పండిస్తుందనే ఆశతో మార్చిలో రైతులు ఉత్సాహంగా సాగు ప్రారంభించారు. అయితే, అమెరికా ప్రతీకార సుంకం ప్రభావం ఆక్వా రంగంపై తీవ్రంగా పడింది. రొయ్యల ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. 100 కౌంట్ రూ.200కు పడిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ధరపై రైతులు పెదవి విరుస్తున్నారు. కౌంట్ ఒక్కంటికీ రూ.20 నష్టం ప్రస్తుతం వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పెద్ద రైతుల వద్ద రూ.10 వ్యత్యాసంలో ఆ ధరకు కొనుగోలు చేస్తున్నారు, చిన్న రైతులను దళారులు నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధరకు రూ.20 నుంచి రూ.30 వరకూ కోత విధిస్తున్నారు. చెరువు నుంచి పట్టిన తర్వాత నిల్వ చేసుకునే అవకాశాలు లేకపోవడంతో తెగనమ్ముకోవాల్సి వస్తోందని ఐ పోలవరానికి చెందిన జి. రాజు ఆవేదన వ్యక్తం చేశారు.

అమెరికా వైఖరిలో మార్పులేకపోతే భవిష్యత్తులో ధర మరింత తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 50 కౌంట్ రూ.320కు మించడంలేదు. 80 కౌంట్ రూ.240 మాత్రమే ఉంది. అత్యధిక మంది రైతుల వద్ద 100 కౌంట్ పంట ఉంది. ఎకరా విస్తీర్ణంలో రొయ్యల సాగుకు రూ.90 వేల నుంచి రూ.1.25 లక్షలకు వరకూ పెట్టుబడి అవుతోంది. ఎకరాకు 3 నుంచి 4 టన్నుల దిగుబడి వస్తుంది. పంట బాగా ఉంటే ఒక్కోసారి 5 టన్నుల వరకూ కూడా వచ్చే అవకాశం ఉంది. ఈ లెక్కన కేజీకి రూ.240 నుంచి రూ.250 వరకూ ధర పలికితేనే నష్టాల నుంచి గట్టెక్కి కనీసం పెట్టబడి అయినా దక్కుతుందని రైతులు అంటున్నారు. .ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన ధరకు ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకూ నష్టం వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1.10 లక్షలు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 80 వేల ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతోంది.

క్రాప్ హాలిడే దిశగా ఆక్వా రైతులు

సవాలక్ష సమస్యతో సతమతమవుతున్న ఆక్వా రైతులకు అమెరికా విధించిన 26 శాతం సుంకం కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటికే ఆక్వా రైతులు సమావేశాలు ఏర్పాటు చేసుకుని ఒక నిర్ణయానికి వచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకటి, రెండు రోజుల్లో స్పందించి తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే మూకుమ్మడిగా క్రాప్‌హాలిడే ప్రకటించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరిస్తున్నారు.

112 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

అగనంపూడి టోల్ ప్లాజా వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో 112 కిలోల గంజాయి పట్టుబడింది. దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సౌత్ సబ్ డివిజన్ ఎసిపి త్రినాథ్ ఈ వివరాలు వెల్లడించారు. అల్లూరి జిల్లాకు చెందిన కిముడు హనుమాన్, బూసరి పాల్ దినకర్‌లను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఈ కేసులో ఓ బాలిక ఉండటంతో అదుపులోకి తీసుకొని జువైనల్ హోంకు తరలించామన్నారు. నిందితుల నుంచి ఆటో, పల్సర్ బైక్‌తోపాటు నాలుగు గోనెసంచుల్లో 50 ప్యాకెట్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. పోలీసుల విచారణలో జి.మాడుగులకు చెందిన అఖిల్ అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసినట్లు నిందితులు వెల్లడించారని ఎసిపి తెలిపారు.

పునరుత్పాదక విద్యుత్‌కు పెద్దపీట

- మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పునరుత్పాదక విద్యుత్ రంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రాజెక్టుల నిర్మాణానికి సింగిల్ విండో విధానంలో త్వరితగతిన అనుమతులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అమరావతిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి గొట్టిపాటితో ఇంటర్నేషనల్ హైడ్రో అసోసియేషన్ (ఐహెచ్‌ఎ) ప్రతినిధులు మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల (పిఎస్‌పి) నిర్మాణం, నిర్వహణ అమలుపై ఐహెచ్‌ఎ ప్రతినిధులతో చర్చించారు. రాష్ట్రంలో యాగంటి, రాజుపాలెం, గండికోట, అరవేటిపల్లి, దిన్నెపల్లి ప్రాంతాల్లో సుమారు 5 వేల మెగావాట్లతో ఏర్పాటు చేయబోయే పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను తెలిపారు. పునరుత్పాదక విద్యుత్ రంగంలో దేశంలోనే ప్రథమ స్థానంలో రాష్ట్రాన్ని నిలిపేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగానే పిఎస్‌పిల ఏర్పాటుకు పూర్తి స్థాయి ప్రోత్సాహం అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 50కు పైగా దేశాల్లో పిఎస్‌పిల ఏర్పాటు, నిర్వహణకు సంబంధించి ఐహెచ్‌ఎ ఎంతో కీలకంగా వ్యవహరిస్తోందని ఆ సంస్థ ప్రతినిధులు మంత్రికి వివరించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయబోయే పిఎస్‌పిలకు పూర్తి స్థాయి సహాయ సహకారాలు అందిస్తామని వారు తెలిపారు.

జూన్ నాటికి హంద్రీనీవా కాలువ వెడల్పు

- మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/కలెక్టరేట్

జూన్ పది నాటికి హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ వెడల్పు పనులు పూర్తి చేయాలని హంద్రీనీవా ప్రాజెక్ట్ ఇంజనీర్లను, ఏజెన్సీలను, అధికారులను మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. మంగళవారం కర్నూలు జిల్లా పత్తికొండ సమీపంలో 119 కిలోమీటర్ల నుంచి 114 కిలోమీటరు వరకు హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ వెడల్పు పనులను మంత్రి పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ..

2014 -19లో నారా చంద్రబాబు నాయుడు రూ. ఐదు వేల కోట్లు హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ ప్రాజెక్ట్‌కు నిధులు కేటాయించారన్నారు. 2019లో ప్రభుత్వం మారడంతో వైసిపి ప్రభుత్వం కనీసం రూ.500 కోట్లు కూడా ఖర్చు పెట్టలేదన్నారు. ఈసారి బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాజెక్టుకు రూ.3,240 కోట్లు కేటాయించామని చెప్పారు. అంతకుముందు జిల్లా అభివృద్ధి సమీక్షా మండలి సమావేశాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ... కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి కృషి చేస్తామని, జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కర్నూలు జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. డ్రోన్ హబ్‌గా కర్నూలు జిల్లాను తీసుకున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసేందుకు, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ చేయకుండా నిలుపుదల చేసేందుకు, రైల్వే జోన్ తీసుకువచ్చేందుకు ముందుకు వెళుతున్నామన్నారు.

మంత్రిని అడ్డుకున్న టిడిపి నాయకులు

కర్నూలులోని స్టేట్ గెస్ట్ హౌస్ వద్ద నిమ్మల రామానాయుడును ఆదోని టిడిపి నాయకులు అడ్డుకున్నారు. ఆదోని నియోజకవర్గంలో బిజెపి ఎమ్మెల్యే పార్థసారథి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, తెలుగుదేశం నాయకులను, కార్యకర్తలను పట్టించుకోవడం లేదని ఆదోని టిడిపి నాయకులు మంత్రికి ఫిర్యాదు చేశారు. ఆదోని నుంచి వచ్చిన తెలుగుదేశం కార్యకర్తలు గెస్ట్ హౌస్ బయట ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి డౌన్ డౌన్, దమ్ముంటే రాజీనామా చేసి గెలవాలని నిరసన వ్యక్తం చేశారు.

ప్రమాదం చిన్నదే అనుకున్నా..

- కుమారుని ప్రమాదంపై స్పందించిన పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగపూర్‌లోని పాఠశాలలో జరిగిన అగ్ని ప్రమాదంలో తన చిన్న కుమారుడు మార్క్ శంకర్‌కు గాయాలైన ఘటనపై డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ స్పందించారు. హైదరాబాద్‌లో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. స్కూల్ పిల్లలు సింగపూర్ సమ్మర్ క్యాంప్‌నకు వెళ్లగా.. అక్కడ జరిగిన అగ్ని ప్రమాదంలో తన కుమారుడికి గాయాలైనట్లు తెలిపారు. "అరకు పర్యటనలో ఉండగా మార్క్ శంకర్‌కు గాయాలైనట్లు ఉదయం 8.30 గంటలకు ఫోన్ వచ్చింది. సమ్మర్ క్యాంప్‌లో అగ్ని ప్రమాదం జరిగి.. నా కుమారుడి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. ఊపిరితిత్తుల్లోకి పొగ చేరింది. ఈ ప్రమాదంలో ఓ చిన్నారి మృతి చెందడం బాధించింది. సుమారు 30 మంది చిన్నారులు సమ్మర్ క్యాంప్‌లో ఉన్నప్పుడు ఈ ఘటన జరిగింది. ప్రమాదం చిన్నదే అనుకున్నా.. తర్వాత దాని తీవ్రత తెలిసింది. నా పెద్ద కుమారుడు అకీరా పుట్టిన రోజునాడే.. రెండో కుమారుడికి ఇలా జరగడం బాధాకరం. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్యం నిలకడగా ఉందంటున్నారు. పొగపీల్చడం వల్ల దీర్ఘకాలంలో ఆరోగ్యంపై ప్రభావం ఉండొచ్చని చెబుతున్నారు. మా అబ్బాయి వయసు ఏడేళ్లు. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడే భవనం నిర్మిస్తున్న కార్మికులు స్పందించి కాపాడారు. ఈ ఘటన గురించి తెలిసి నా భార్య షాక్‌లో ఉన్నారు. మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఎంతో మంది మంచి మనస్సుతో ఆశీస్సులు అందించడంతో క్రమంగా కోలుకుంటున్నాడు. ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. ప్రమాద విషయం తెలుసుకొని ప్రధాని మోడీ, ఎపి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి లోకేష్, మాజీ సిఎం వైఎస్ జగన్, తెలుగు రాష్ట్రాలకు చెందిన రాజకీయ, సినీ ప్రముఖులు ఫోన్ చేసి మార్క్ ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేసి ధైర్యం చెప్పారు. వారందరికీ కృతజ్ఞతలు" అని పవన్ కల్యాణ్ తెలిపారు.

గ్యాస్ సిలిండర్ ధరపెంపు ఉపసంహరించుకోవాలి : ఐద్వా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి ప్రకటన విడుదల చేశారు. గృహ అవసరాలకు వినియోగించే, ఉజ్వల పథకం లబ్ధిదారులకు ఇచ్చే సిలిండర్లపై రూ.50 పెంచడం దారుణమన్నారు. కార్పొరేట్ కంపెనీల రక్షణకు ప్రజలపై ధరల భారాన్ని మోపడం ప్రభుత్వ ప్రజా వ్యతిరేక స్వభావానికి నిదర్శనమన్నారు. ఇప్పటికే దేశంలో ప్రజలు కొనుగోలు శక్తి పడిపోతుందని, ఈ దశలో నిత్యావసర వస్తువైన గ్యాస్ సిలిండర్ ధర పెంచడం ప్రజల నెత్తిన బండ వేయడమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉచిత గ్యాస్ పథకంపైన భారం పడుతుందని తెలిపారు. ఈ పెంపు పేద, మధ్యతరగతి మహిళలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఎపి ఇసెట్‌కు 33,454 దరఖాస్తులు

ప్రజాశక్తి - అనంతపురం

ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి తరపున అనంతపురం జెఎన్‌టియు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎపి ఇసెట్-2025 పరీక్షకు ఏప్రిల్ ఏడవ తేదీ నాటికి మొత్తం 33,454 దరఖాస్తులు అందినట్లు ఎపి ఇసెట్ చైర్మన్ హెచ్.సుదర్శనరావు, కన్వీనర్ బి.దుర్గాప్రసాద్ మంగళవారం తెలిపారు. దరఖాస్తులకు సంబంధించి అగ్రికల్చర్ ఇంజనీరింగ్ విభాగానికి 143, బిఎస్‌సి మాథమాటిక్స్‌కు 41, సిరామిక్ టెక్నాలజీకు మూడు, కెమికల్ ఇంజనీరింగ్ 290, సివిల్ ఇంజనీరింగ్ 2,874, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి 10,639, ఇఇఇ 5,492, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ 9,024, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ 54, మెకానికల్ ఇంజనీరింగ్ 4,424, మెటాలిజికల్ ఇంజనీరింగ్ 97, మైనింగ్ ఇంజనీరింగ్ 66, ఫార్మసీ విభాగానికి 307 కలిపి మొత్తం 33,454 దరఖాస్తులు అందాయని కన్వీనర్ తెలిపారు. రూ.1000 అపరాధ రుసుంతో ఏప్రిల్ 12 వరకు, రూ.రెండువేల అపరాధ రుసుం 17 వరకు, రూ.నాలుగు వేల అపరాధ రుసుంతో 24 వరకు, రూ.పదివేల అపరాధ రుసుంతో ఏప్రిల్ 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చైర్మన్ తెలిపారు.

వృద్ధిలేని గ్రామీణాభివృద్ధి

- జిడిపిలో ఒక శాతం కన్నా తక్కువే
- చైనాతో పోల్చి చూపిస్తున్న నీతి ఆయోగ్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

దేశంలో గ్రామీణాభివృద్ధి రంగం అభివృద్ధి నామమాత్రంగానే కనిపిస్తోంది. పొరుగునవున్న చైనాతో పోల్చిచూస్తే ఈ రంగంలో వృద్ధి సమర్థవంతంగా లేదన్న భావాన్ని స్వయంగా నీతి ఆయోగే వ్యక్తం చేయడం గమనార్హం. గ్రామీణాభివృద్ధికి చేస్తున్న వ్యయం కూడా చైనా కన్నా అతి తక్కువగా ఉందని, రానున్న పదేళ్ల కాలంలో ఈ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నీతి ఆయోగ్ అభిప్రాయపడడం విశేషం.

తాజాగా గ్రామీణాభివృద్ధిపై నీతి ఆయోగ్ ఒక నివేదికను విడుదల చేసింది. ఇందులో ఇరు దేశాల మధ్య ఉన్న వృద్ధి అంతరాలను, తీసుకోవాల్సిన చర్యలను కూడా వివరించడం గమనార్హం. అభివృద్ధికి అవకాశం ఉన్న ప్రాంతాల్లో నిధులను ఖర్చు చేయకపోవడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని గుర్తించారు. 2024లో మొత్తం సమగ్ర వృద్ధిలో గ్రామీణాభివృద్ధి వాటా కేవలం 0.7 శాతంగా ఉన్నట్లు తేలింది.

ఇదే చైనాలో 2.68 శాతం జిఎస్‌డిపిలో వృద్ధి వాటా ఉండడం గమనార్హం. ఇక మొత్తం వ్యయంలో చైనాతో పోల్చి చూస్తే భారత్‌లో చాలా తక్కువగా వ్యయం చేసినట్లు నీతి ఆయోగ్ గుర్తించింది. గతేడాది చైనాలో 496 బిలియన్ డాలర్లు గ్రామీణావృద్ధికి వ్యయం చేయగా, మన దేశంలో కేవలం 100 బిలియన్ డాలర్లు ఖర్చు చేసినట్లు గుర్తించారు. అంటే దాదాపు ఐదు రెట్లు అధికంగా చైనాలో ఖర్చు చేశారు.

పదేళ్ల లక్ష్యంతో ముందుకు

భారత్‌లో గ్రామీణాభివృద్ధి రంగంలో మరింత వేగంగా అడుగులు వేసేందుకు పదేళ్ల కాలపరిమితితో ముందుకు సాగాలని నీతి ఆయోగ్ సూచించింది. గుర్తించిన కీలక రంగాల్లో నిధులను ఖర్చు చేయాల్సిన అవసరాన్ని గుర్తించింది. కోవిడ్‌కు ముందు ఉన్న ఆర్థిక వనరులను ఇప్పుడు కూడా గుర్తించి సాగాలని, చైనా తరహాలోనే అధ్యయనానికి, అమలుకు మధ్య అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది.

ప్రజాశక్తి
www.prajasakti.com

విశాఖ విద్యార్థుల బాధ్యత పవన్‌దే

- వైసిపి విద్యార్థి విభాగం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖలో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పర్యటన సందర్భంగా జెఇఇ పరీక్షకు హాజరుకాలేకపోయిన 23 మంది విద్యార్థుల బాధ్యత ఆయనదేనని వైసిపి విద్యార్థి విభాగం వర్కింగ్ పెసిడెంట్ రవిచంద్ర పేర్కొన్నారు. ఈ ఘటనపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించాలని, పరీక్షకు హాజరుకాలేకపోయిన విద్యార్థుల గురించి కేంద్రంతో మాట్లాడి న్యాయం చేయాలని కోరారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అడవితల్లి బాట కార్యక్రమం కోసం అరకు వెళ్లేందుకు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ విశాఖ వచ్చిన సందర్భంగా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారని, రహదారులపైకి కార్యకర్తలు అధిక సంఖ్యలో చేరుకోవడంతో పవన్ కాన్వాయ్ అనుకున్న సమయానికి ముందుకు సాగలేదన్నారు. దీంతో నగరంలో తీవ్రమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడి జెఇఇ మెయిన్స్ పరీక్ష రాసేందుకు వెళ్లే 23 మంది విద్యార్థులు పరీక్షా కేంద్రానికి సమయానికి హాజరుకాలేకపోయారని తెలిపారు. దీంతో వీరిని పరీక్షలకు అనుమతించలేదన్నారు.

వటపత్రశాయి అలంకారంలో కోదండరాముడు

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

వైఎస్‌ఆర్ జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారికి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం ఉదయం వటపత్రశాయిగా అలంకరించారు. ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా సాగింది. యాత్రికులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని సందర్శించారు. వాహనసేవలో ఆలయ డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు, అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు.

'ఫలక్‌నుమా'కు తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - పలాస

సికింద్రాబాద్ నుంచి హౌరా వెళ్లే ఫలక్‌నుమా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12704) రైలుకు పెను ప్రమాదం తప్పింది. శ్రీకాకుళం జిల్లా పలాస రైల్వేస్టేషన్ నుంచి ఫలక్‌నుమా రైలు మంగళవారం ఉదయం ఇచ్ఛాపురం వైపు బయలుదేరింది. పలాస మండలం సుమ్మాదేవి రైల్వేస్టేషన్ దాటి లెవల్ క్రాసింగ్ గేటు 362 వద్దకు వెళ్లేసరికి ఎ-1 ఎసి కోచ్ వద్ద రెండు బోగీలను కలిపే బఫర్ విరిగిపోయింది. దీంతో రైలు ఇంజిన్ నుంచి ఎనిమిది బోగీలు కొద్దిదూరం వెళ్లిపోగా, ఆ వెనుక ఉన్న 15 బోగీలు రైలు పట్టాలపై నిలిచిపోయాయి. బోగీలు వేరైనట్లు గుర్తించిన గార్డు మధుకుమార్.. లోకో పైలట్ ఆర్ ఖాన్‌ను అప్రమత్తం చేశారు. ఆయన రైలును నిలిపి, రైల్వే అధికారులకు విషయాన్ని తెలియజేశారు. అక్కడకు చేరుకున్న రైల్వే అధికారులు, సిబ్బంది రెండు బోగీలను కలిపే బఫర్ విరిగిపోయినట్లు గుర్తించారు. ఎనిమిది బోగీలతో ఉన్న రైలును మందస రైల్వేస్టేషన్‌కు తరలించారు. మిగిలిన 15 బోగీలను మరో ఇంజిన్ సహాయంతో మందస రైల్వేస్టేషన్‌కు తరలించి పాడైన బోగీని తొలగించి మిగిలిన బోగీలతో హౌరాకు పంపించారు. ఈ ఘటనతో మూడు గంటల పాటు రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

బాలికను గర్భవతి చేసిన వంచకుడు

- యువకునిపై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి-చౌడేపల్లి (చిత్తూరు జిల్లా)

బాలికను నమ్మించి గర్భవతిని చేసిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు చౌడేపల్లి ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం ఆమినిగుంట పంచాయతీ నూనెముద్దలపల్లి గ్రామానికి చెందిన బాలికను ప్రేమిస్తున్నానంటూ అదే గ్రామానికి చెందిన నాగేంద్ర వెంటపడేవాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికను గర్భవతిని చేశాడు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాలిక తల్లిదండ్రులను కులం పేరుతో దూషించిన నిందితుడి తల్లిదండ్రులపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదైనట్లు తెలిపారు.

ఇక ఆరు ఎయిర్ బ్యాగ్‌లతో మారుతి గ్రాండ్ విటార

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి తన గ్రాండ్ విటారను ఆరు ఎయిర్ బ్యాగ్‌లతో అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించింది. మరిన్ని భద్రత ఫీచర్లు, పరికరాలతో విడుదల చేసినట్లు ఆ సంస్థ మంగళవారం వెల్లడించింది. దీని ఎక్స్‌షోరూం ప్రారంభ ధరను రూ.11.42 లక్షలుగా నిర్ణయించింది.

ముడి చమురు తగ్గింపు లాభాన్ని కాజేస్తున్న కేంద్రం

- వినియోగదారులకు అందకుండా సుంకాలు
- నాలుగేళ్ల కనిష్టానికి పతనమైనా ప్రజలకు తప్పని వాతలు

ముంబయి : అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు అమాంతం పడిపోయాయి. గతేడాది 2024 నుంచి తగ్గుముఖం పట్టిన చమురు ధరలు ఇటీవల మరింత దిగివచ్చాయి. 2025 ప్రారంభంలో బ్యారెల్ 70 డాలర్ల దిగువకు పడిపోయింది. తాజాగా వాణిజ్య యుద్ధం ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో సోమవారం బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర 64 డాలర్లకు క్షీణించింది. అటు టెక్సాస్ క్రూడ్ ధర 60 డాలర్లకు దిగొచ్చింది. ఇది నాలుగేళ్ల కనిష్ట స్థాయి కావడం విశేషం. వాణిజ్య యుద్ధం ఇతర పరిణామాలతో రష్యా ఉరల్స్ ఆయిల్ ధర ఏకంగా 50 డాలర్లకు క్షీణించింది. అయితే ఈ తగ్గింపు కారణంగా రిటైల్ మార్కెట్‌లో పెట్రోలు, డీజిలు ధరలు తగ్గుతాయని ఆశించిన వినియోగదారులను కేంద్ర ప్రభుత్వం నిలువునా వంచనకు గురిచేస్తోంది. ఎక్సైజ్ డ్యూటీలు అదనంగా పెంచేసి తగ్గింపు లాభాలు ప్రజలకు చేరనీయకుండా దొడ్డిదారిన దోచుకుంటోందన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో ప్రజలపై ఎప్పటిలానే ధరాభారం పెరిగిపోతోంది.

డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధం ఒత్తిడి, అమెరికాలో పెరుగుతున్న మాంద్యం భయాలు, ప్రపంచ మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడం ఇవన్నీ చమురు ధరలు పడిపోవడానికి ప్రధాన కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఒపెక్ దేశాలు ఉత్పత్తి అంచనాలకు కోత పెట్టాయి. ఇది బలహీనమైన ప్రపంచ వినియోగాన్ని ప్రతిబింబిస్తుంది. మరోవైపు చైనా వంటి మార్కెట్లలో ఎలక్ట్రిక్ వాహనాల వాడకం పెరగడం క్రూడ్ ధరలు మరింత తగ్గేలా చేశాయి. వారంలో రెండుసార్లు చమురు ధరల అంచనాలను తగ్గించిన బ్రోకరేజ్ సంస్థ గోల్డ్‌మన్ సాచ్స్ మంగళవారం మరింత కోత పెట్టింది. బ్యారెల్ ధర 40 డాలర్లకు పడిపోయినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదని విశ్లేషించింది.

ఖజానాపైనే కేంద్రం దృష్టి

గ్లోబల్ మార్కెట్‌లో చమురు ధరలు అమాంతం తగ్గుతుంటే దేశీయంగా మోడీ సర్కార్ ఎప్పటిలాగే తన ఖజానాను నింపుకునే పనిలో ఉంది. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటర్‌కు రూ.2 చొప్పున పెంచుతూ సోమవారం నిర్ణయం తీసుకుంది. ఈ మొత్తాన్ని ఇంధన కంపెనీలు భరించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. తాజా పెంపు తర్వాత లీటర్ పెట్రోల్‌పై రూ.13, డీజిల్‌పై రూ.10 ఎక్సైజ్ సుంకం అమల్లోకి రానుంది. 2014 నుంచి 2016 మధ్య మోడీ సర్కార్ ఇంధనాలపై 9 సార్లు ఎక్సైజ్ సుంకాన్ని పెంచింది. దీంతో ఆ సమయంలో కేంద్రానికి రూ.99,000 కోట్ల ఆదాయం సమకూరింది. అంటే ఆ మొత్తం ప్రజలపై భారం పడింది. ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గినప్పుడల్లా ఆ ప్రతిఫలాలను ప్రజలకు అందకుండా బిజెపి సర్కార్ ఎక్సైజ్ సుంకాన్ని బాదుతోందనే విమర్శలు ఉన్నాయి.

20 శాతం తగ్గినా..

2024 నుంచి ముడి చమురు ధరలు 20 శాతానికి పైగా పడిపోయినప్పటికీ ఇంధన ధరల్లో మాత్రం ఎలాంటి మార్పులు రాలేదు. ముడి చమురు అవసరాల్లో 87 శాతానికి పైగా దిగుమతి చేసుకుంటున్న భారత్.. గ్లోబల్ చమురు ధరల్లో తగ్గుదలకు అనుగుణంగా ఇంధన ధరలను సైతం తగ్గించాలి. కానీ అందుకు భిన్నంగా ఎక్సైజ్ సుంకాన్ని పెంచడం గమనార్హం. భారత్‌లో పెట్రోల్, డీజిల్‌పై బేస్ ధర, ఎక్సైజ్ సుంకం, విలువ ఆధారిత పన్ను (వ్యాట్), డీలర్ కమిషన్లను కలుపుకుని ఇంధన ధరలను నిర్ణయిస్తారు. ఇంధనం రిటైల్ ధరలో పన్నులే సుమారు 50-60 శాతం వాటాను కలిగి ఉండటంతో ప్రజలను ఎలా ముక్కు పిండి వసూళ్లు చేస్తున్నారో స్పష్టం అవుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.107.66గా, డీజిల్ ధర రూ.95.82గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గినప్పటికీ అధిక పన్నులతో వినియోగదారులకు పెద్దగా ఫలితం లేకుండా పోతుందని స్పష్టం అవుతోంది

మద్యం షాపులను తొలగించండి

- ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మండపేట టౌన్‌లో నివాస ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటును చేయకూడదని, అంబాజీపేట మండలం మాచవరం గ్రామంలో నివాస ప్రాంతంలో ఏర్పాటుచేసిన మద్యం షాపును తొలగించాలని ఐద్వా రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ అంశంపై ఎక్సైజ్‌శాఖ కమిషనర్‌కు ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి వినతిపత్రాన్ని మంగళవారం మెయిల్ చేశారు. మండపేట టౌన్‌లో మూడు వార్డుల ప్రజలు సుమారు 18 వేల మంది నివాసం ఉంటున్న ఈ ప్రాంతంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న మద్యం షాపునకు వ్యతిరేకంగా స్థానికులు, ఐద్వా మహిళలు దీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. స్థానిక అధికారులకు, వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని మహిళల ఆందోళనను పట్టించుకోలేదన్నారు. అంబాజీపేట మండలం మాచవరం పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో నివాస ప్రాంతాలకు సమీపంలో ఉన్న మద్యం షాపును తొలగించాలని అక్కడి మహిళలు మూడు రోజులుగా ఆందోళనలు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళల నుంచి అభ్యంతరాలున్న ప్రదేశాల్లో మద్యం షాపులను ఏర్పాటు చేయకూడదని, ఇప్పటికే ఏర్పాటు చేసిన వాటిని వెంటనే తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు.

మార్కెట్లకు ఉపశమనం

ముంబయి : భారీ నష్టాల నుంచి మార్కెట్లకు ఉపశమనం లభించింది. ట్రంప్ టారిఫ్ భయాలతో ఇటీవల వరుస నష్టాలను చవి చూస్తోన్న దలాల్ స్ట్రీట్ మంగళవారం లాభాలను నమోదు చేసింది. ఆర్‌బిఐ వడ్డీ రేట్లను తగ్గించొచ్చనే అంచనాలకు తోడు భారీగా తగ్గిన షేర్ల విలువల నేపథ్యంలో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపారు. ఈ నేపథ్యంలోనే బిఎస్‌ఇ సెన్సెక్స్ 1089 పాయింట్లు పెరిగి 74,227కు చేరింది. సెన్సెక్స్ ఓ దశలో 1600 పాయింట్లకు పైగా ర్యాలీ చేసింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 374 పాయింట్ల లాభంతో 22,536 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో పవర్ గ్రిడ్ మినహా మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి.

కర్నూలు III పీఎస్ ఆర్ఈ ట్రాన్స్ మిషన్ లిమిటెడ్
(పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ యొక్క 100% పూర్తిగా యాజమాన్యంలోని అనుబంధ సంస్థ)
B-9, కుతుబ్ ఇన్స్టిట్యూషనల్ ఏరియా, కట్వారియా సారాయ్, న్యూఢిల్లీ -110016

నోటీసు
(విద్యుత్ చట్టం, 2003 లోని సెక్షన్ 164 లోని సబ్ సెక్షన్ (2) కింద)

1. కర్నూలు III పీఎస్ ఆర్ఈ ట్రాన్స్ మిషన్ లిమిటెడ్, న్యూఢిల్లీ-110016, కుతాబ్ ఇనిస్టిట్యూషనల్ ఏరియా, కట్వారీయా సారాయ్లో రిజిస్టర్డ్ కార్యాలయాన్ని కలిగి ఉంది, ఇది కేంద్ర విద్యుత్ నియంత్రణ కమిషన్, న్యూఢిల్లీ ముందు విద్యుత్ చట్టం, 2003లోని సెక్షన్ 164లోని సబ్-సెక్షన్ (1) కింద ట్రాన్స్మిషన్ లైన్లు, సబ్-స్టేషన్లు మరియు ఇతర ఆస్తులకు సంబంధించి ట్రాన్స్మిషన్ లైసెన్స్ మంజూరు కోసం దరఖాస్తు చేసుకుంది, వీటి వివరాలు క్రింద ఇవ్వబడ్డాయి:-

వరుస నం.	లైన్ పేరు / సబ్ స్టేషన్ (గమనిక ప్రకారం స్థానం)	BPC/సామర్థ్యం యొక్క సర్వే నివేదిక ప్రకారం లైన్ పొడవు	సంవత్సరానికి ట్రాన్స్మిషన్ ఛార్జీలు (INR) మిలియన్లు	COD షెడ్యూల్ చేయండి	వ్యాఖ్యలు
ప్యాకేజీ A					
1.	కర్నూలు-3 పీఎస్ లో 3x1500 MVA, 765/400 kV ఐసిటిలు మరియు దాని అనుబంధ పరికరాల ద్వారా పరివర్తన సామర్థ్యాన్నిపెంచడం	4500 MVA 480 MVAR (SLR)		24 months (27.03.2027)	
2.	కర్నూలు-3 పీఎస్ - చిలకలూరిపేట 765 కేవీ డీ/సీ లైన్, ఇరువైపులా 240 ఎంవీఆర్ స్విచ్చబుల్ లైన్ రియాక్టర్లు	304.78 km 480 MVAR (SLR) @ Chilakaluripeta			
ప్యాకేజీ B					
1.	2 సంఖ్యలు. మెసర్స్ అదానీ రెన్యూవబుల్ ఎనర్జీ ఫోర్టీ టూ లిమిటెడ్ యొక్క డెడికేటెడ్ ట్రాన్స్మిషన్ లైన్ను ముగించడం కోసం కర్నూలు-3 పీఎస్ వద్ద 400 కెవి లైన్ బేలు			30.06.2026	
2.	4 సంఖ్యలు. మెసర్స్ ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క డెడికేటెడ్ ట్రాన్స్ మిషన్ లైన్ల నిలిపివేత కొరకు కర్నూలు-III PS వద్ద 400 కెవి లైన్ బే.		6451.06	2 Nos. -24 months (27.03.2027); 2 Nos. -31.12.2027	
3.	2 సంఖ్యలు. మెసర్స్ అదానీ రెన్యూవబుల్ ఎనర్జీ ఫిఫ్టీ వన్ లిమిటెడ్ యొక్క డెడికేటెడ్ ట్రాన్స్మిషన్ లైన్ను ముగించడం కోసం కర్నూలు-3 పీఎస్ వద్ద 400 కెవి లైన్ బేలు.			31.12.2027	
ప్యాకేజీ C					
1.	కర్నూలు-3 పీఎస్ లో 1x1500 MVA 765/400 kV ICT (2వ) పెంపు	1500 MVA		24 months (27.03.2027)	

Note: (i) ప్యాకేజీ ఎ, బి & సి అంశాలకు సంబంధించిన స్థలాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నాయి.
(ii) పూర్తి పరిధి కొరకు దయచేసి సందర్శించండి https://www.powergrid.in/subsidiaries

2. కమిషన్ ముందు దాఖలు చేసిన పూర్తి దరఖాస్తు మరియు ఇతర పత్రాలు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వెబ్సైట్ https://www.powergrid.in/subsidiaries లో ఎవరైనా అందుబాటులో ఉన్నాయి. దరఖాస్తును C/o ED (TBCB), పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, సౌదామిని, ప్లాట్ నెం.2, సెక్టార్ -29, గుర్గావ్ 122001 లోని కంపెనీ కార్యాలయంలో, కర్నూలు III పీఎస్ ఆర్ఈ ట్రాన్స్ మిషన్ లిమిటెడ్ లోని ప్రాజెక్ట్ ఇన్చార్జ్ శ్రీ AC శంకరయ్య వద్ద లేదా కమిషన్ కార్యాలయంలో కమిషన్ పేర్కొన్న విధానం ప్రకారం తనిఖీ చేయవచ్చు.
3. అభ్యంతరాలు లేదా సూచనలు ఏవైనా ఉంటే, కార్యదర్శి, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్, 2వ అంతస్తు, టవర్ బి, వరల్డ్ ట్రేడ్ సెంటర్, నౌరోజీ నగర్, న్యూఢిల్లీ- 110029 వద్ద దాఖలు చేయాలి. వార్తాపత్రికలో నోటీసు ప్రచురించబడిన 15 రోజులలోపు అభ్యంతరం(లు)/సూచన(ల) కాపీని దరఖాస్తుదారునికి లేదా అతని అధీకృత ఏజెంట్కు పంపాలి.

స్థలం: న్యూఢిల్లీ
తేదీ: 09.04.2025

శ్రీ. ఎ.సి. శంకరయ్య,
ప్రాజెక్ట్ ఇన్చార్జ్,
కర్నూలు III పీఎస్ ఆర్ఈ ట్రాన్స్ మిషన్ లిమిటెడ్

ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం

ప్రజా సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి -గాజువాక (విశాఖపట్నం)

ప్రజా సమస్యలను పట్టించుకోకుండా టిడిపి కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం విమర్శించారు. జిఒలు 296, 388 ప్రకారం పట్టాలున్న వారికి రిజిస్ట్రేషన్ అవకాశం కల్పించాలని, జిఒ 30 ప్రకారం స్వతంత్రనగర్, కుంచుమాంబ కాలనీ, మింది, రామ్‌నగర్, అప్పన్నకాలనీల ప్రజలకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన గాజువాక తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ.. అర్హులందరికీ పట్టాలు మంజూరు చేస్తామని, జిఒ 296 ప్రకారం ఇచ్చిన పట్టాలన్నింటికీ రిజిస్ట్రేషన్ చేస్తామని టిడిపి కూటమి నాయకులు ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదన్నారు. స్వతంత్రనగర్, కుంచమాంబ కాలనీ, రామ్‌నగర్, అప్పన్నకాలనీ వాసులకు పట్టాలు మంజూరు చేయకుండా ఆ ప్రాంతాలు చెరువులని సాకులు చెబుతున్నారని, పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్లకు మాత్రం ప్లాన్ అప్రూవల్ ఇస్తున్నారని తెలిపారు. దశాబ్దాలుగా ఈ కాలనీల్లో నివాసముంటున్న వారికి తక్షణమే పట్టాలు ఇవ్వాలని, లేకుంటే ప్రజలందరినీ ఐక్యం చేసి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. పి4 సర్వే పేరుతో ప్రజలకు సబ్సిడీలను ఎత్తేయడానికి ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. ధర్నా అనంతరం తహశీల్దార్ శ్రీవల్లికి వినతిపత్రం అందజేశారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ.. 296, 388 జిఒలకు సంబంధించి జిల్లా అధికారులకు లేఖ రాశామని, మిగతా కాలనీలకు సంబంధించి ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని వివరించారు. మరోసారి ప్రభుత్వానికి లేఖ రాస్తామని తెలిపారు. ఈ ధర్నాలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలని ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు రూరల్

ఉపాధి హామీ పనులు చేసిన కార్మికులకు బకాయిలు చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరులోని చాటపర్రు గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న పని ప్రదేశాల్లో కార్మికులతో కలిసి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. ఉపాధి హామీ కార్మికులకు వేతనాలను సకాలంలో విడుదల చేయాలని కోరారు. గత ఆర్థిక సంవత్సరం వేతన బకాయిలు నేటికీ విడుదల చేయకపోవడం దారుణమన్నారు. నెలలు తరబడి వేతనాలు పెండింగులో పెట్టడం వల్ల కార్మికుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఉపాధి కార్మికులకు కూలి రూ.7లు పెంచి.. గ్యాస్ సిలిండర్ ధర మాత్రం రూ.50లకు పెంచడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులను వెంటనే విడుదల చేయాలని, కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిను వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని కోరారు. పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు, మజ్జిగ, పనిముట్లు కల్పించడంతోపాటు మేట్లకు పారితోషికం రూ.5 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, ఉపాధి కార్మికులు, మేట్లు పాల్గొన్నారు.

శ్రీ సిటీలో రెండో దశ భూ కేటాయింపు

- రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

శ్రీసిటీలో 2500 ఎకరాల్లో రెండో దశ భూ కేటాయింపులు చేసేందుకు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జెసి శుభం బన్సల్ చర్యలు తీసుకుంటున్నారని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. జర్నలిస్టులకు స్థలాల కేటాయింపు త్వరలో చేపడతామని చెప్పారు. భూ సమస్యలపై అధికారులతో జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడుతూ.. తిరుపతిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న శెట్టిపల్లి సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి చొరవతో రెవెన్యూ, మున్సిపల్ శాఖ మంత్రులు, సిసిఎల్ఎ, మున్సిపల్ శాఖ సెక్రటరీ, జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించి మోడల్ టౌన్‌షిప్‌గా రూపుదిద్దుకునేలా చర్యలు చేపడుతున్నామన్నారు. తిరుపతిలో ఒబెరాయ్ హోటల్ ఏర్పాటుకు ప్రత్యామ్నాయ భూమి కేటాయింపు చేస్తున్నామని, లులూ మాల్, హయత్ తదితర సంస్థలు త్వరలో తిరుపతిలో ఏర్పాటు కానున్నాయని తెలిపారు. తిరుపతి జిల్లాలో 34 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అందుబాటులోకి రానుందని చెప్పారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్, సాగరమాల పనులు త్వరలో పూర్తి అయ్యేలా చర్యలు వేగవంతం చేశామన్నారు. చంద్రగిరి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఏడాది జూన్‌లో 'భోగాపురం'

- ఇప్పటికే ఎయిర్‌పోర్టు పనులు 71శాతం పూర్తి : కె రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి-భోగాపురం (విజయనగరం జిల్లా)

ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం జిల్లా భోగాపురం ఎయిర్‌పోర్టును డిసెంబర్ 2026 నాటికి కావల్సి ఉందని, గత ఆరు నెలలుగా పనుల వేగాన్ని పెంచడంతో అనుకున్న దానికంటే ముందే పూర్తి చేసుకొని జూన్ 2026 నాటికే ఎయిర్‌పోర్టు ప్రారంభిస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మంత్రి రామ్మోహన్ మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా భోగాపురం ఎయిర్ పోర్టు పనులు 26 శాతం మాత్రమే జరిగాయన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారాక పనుల్లో వేగం పెరిగిందని, 71 శాతం పనులు ఇప్పటికే పూర్తయ్యాయని తెలిపారు. అన్ని రకాల అధునాతన సదుపాయాలతో ఈ విమానాశ్రయం నిర్మిస్తున్నామని తెలిపారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయం, కళలు ఉట్టిపడేలా విమానాశ్రయం లోపల ఇంటీరియర్ డిజైన్ చేస్తున్నట్లు చెప్పారు. విశాఖ ట్రాఫిక్‌ను ప్రధాన అంశంగా పరిగణలోకి తీసుకున్నామని, వైజాగ్ పోర్ట్ నుండి మూలపేట పోర్టు వరకు కనెక్టివిటీ కోసం కొత్త డిపిఆర్‌లను తయారు చేశామని తెలిపారు. దీనిపై సిఎం చంద్రబాబు నాయుడు సూచనలతో సంబంధిత కేంద్ర మంత్రితో చర్చిస్తున్నామని చెప్పారు. మంత్రి రామ్మోహన్ వెంట రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, మార్కుఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జిల్లా ఎస్‌పి వకుల్, ఆర్‌డిఒ కీర్తి, జిఎంఆర్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ ఐప్రభాకర్ రావు , సిఇఒ కన్వర్ బి సింగ్ కల్ర, మేనేజర్ రామరాజు, సిడిఒ ఎం.కోటేశ్వర రావు ఉన్నారు.

టాటా మోటార్స్ గ్లోబల్ అమ్మకాలు డీలా

- మార్చి త్రైమాసికంలో 3 శాతం పతనం

ముంబయి : ఆర్థిక వ్యవస్థల పనితీరుకు అద్దం పట్టే వాహన అమ్మకాలు ప్రతికూలతను ఎదుర్కొంటున్నాయి. దిగ్గజ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ గ్లోబల్ అమ్మకాలు పడిపోవడం కలవరానికి గురి చేస్తోన్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25) జనవరి నుంచి మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 3 శాతం తగ్గుదలతో మొత్తంగా 3,66,177 యూనిట్లను విక్రయించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ప్రపంచ వ్యాప్తంగా 3,77,432 యూనిట్ల అమ్మకాలు చేసింది. గడిచిన క్యూ4లో తన లగ్జరీ కార్ల తయారీ కంపెనీ జాగ్వర్ లాండ్ రోవర్ (జెఎల్‌ఆర్) విక్రయాలు స్వల్పంగా పెరిగినప్పటికీ.. స్థూల అమ్మకాలు ఆశాజనకంగా లేకపోవడం విశేషం. 2024 మార్చి త్రైమాసికంలో టాటా మోటార్స్ వాణిజ్య వాహన అమ్మకాలు కూడా 3 శాతం తగ్గి 1,07,765 యూనిట్లుగా చోటు చేసుకున్నాయి. ప్యాసింజర్ వాహన విక్రయాలు 6 శాతం క్షీణించి 1,46,999 యూనిట్లకు పరిమితం కాగా.. జెఎల్‌ఆర్ అమ్మకాలు మాత్రం 1 శాతం పెరిగి 1,11,413 యూనిట్లుగా నమోదయ్యాయి. బ్రిటన్‌లో తయారయ్యే తన జెఎల్‌ఆర్ కార్లను అమెరికాకు ఎగుమతి చేయడాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఇటీవల ఆ కంపెనీ తెలిపింది.. ట్రంప్ తమ దేశంలోకి దిగుమతయ్యే వాహనాలపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. 2024 మార్చి వరకు 12 నెలల కాలంలో జెఎల్‌ఆర్ మొత్తంగా 4.30 లక్షల కార్లను విక్రయించింది. ఇందులో నాలుగో వంతు అమెరికాలో అమ్మకాలు

సంపన్నులకు ఎలీట్ ప్లస్ సేవింగ్స్ ఖాతా

- బంధన్ బ్యాంక్ వెల్లడి

ముంబయి : సంపన్న ఇన్వెస్టర్ల కోసం కొత్తగా ఎలీట్ ప్లస్ సేవింగ్స్ అకౌంట్‌ను ప్రారంభించినట్లు బంధన్ బ్యాంక్ వెల్లడించింది. దీనిని ఆ బ్యాంక్ సిబిఒ రాజేందర్ కుమార్, సిఒఒ రతన్ కుమార్, సిఇఒ పార్థ ప్రతిమ్ సేన్ గుప్తా ఆవిష్కరించగా.. ప్రముఖ క్రికెటర్ సౌరవ్ గంగూలీ తొలి ఖాతాదారుడిగా చేరారు. ఈ ఎకౌంట్ ద్వారా ఖాతాదారులు మరింత మెరుగైన సేవలను పొందవచ్చని పేర్కొంది. సినిమా టికెట్లు, ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్, గోల్ఫ్ సెషన్స్, అపరిమిత ఉచిత లావాదేవీల్లాంటి ప్రత్యేక ప్రయోజనాలు అందుకోవచ్చని వెల్లడించింది. రూ. 15 లక్షల వరకు వ్యక్తిగత ప్రమాద బీమా, రూ. 3 లక్షల వరకు పర్చేజ్ ప్రొటెక్షన్‌తో కూడుకున్న మెరుగైన డెబిట్ ఇన్సూరెన్స్ కవరేజీ సహా ఎక్స్‌క్లూజివ్ వోచర్లు, మైల్‌స్టోన్ ఆఫర్లను పొందవచ్చని పార్థ ప్రతిమ్ పేర్కొన్నారు.

సంపద సృష్టిలో మహిళలకు సవాళ్లు

- ఎడెల్విస్ లైఫ్ సిడిఒ

ముంబయి : ప్రస్తుత తరములోని మహిళలు 50 శాతం మంది సంపద సృష్టిలో సవాళ్లను ఎదుర్కొంటున్నారని ఎడెల్విస్ లైఫ్ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ (సిడిఒ) అనూప్ సేథ్ పేర్కొన్నారు. ఆదాయాలను పెంచుకునే వివిధ ఆర్థిక సాధనాల గురించి అవగాహన లోపించిందని తమ అధ్యయనంలో తేలిందన్నారు. 35-54 ఏళ్ల మధ్య వయస్సున్న ప్రస్తుత శాండ్విచ్ జనరేషన్ పెరుగుతున్న పిల్లలకు ఆసర అందిస్తూ వృద్ధులవుతున్నారన్నారు. ఆర్థిక విద్యతోనే చాలామంది మహిళలు తమ సొంత ఆర్థిక భవిష్యత్తును క్రియాశీలకంగా నిర్వహించుకోగలరన్నారు. 61 శాతం మహిళలు ఆర్థిక భద్రత ఉన్నప్పటికీ తరచూ డబ్బు లేదని దిగులు పడుతూ ఉంటున్నారన్నారు. తమ పొదుపు, పెట్టుబడులు భవిష్యత్తు కొరకు సరిపోవని 64 శాతం మంది భావిస్తున్నారన్నారు.

లెక్సస్ అమ్మకాల్లో 19 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ప్రముఖ లగ్జరీ కార్ల కంపెనీ లెక్సస్ ఇండియా గడిచిన ఆర్థిక సంవత్సరం 2024-25 అమ్మకాల్లో 19 శాతం వృద్ధిని సాధించినట్లు వెల్లడించింది. ఇంతక్రితం ఏడాది విక్రయాల్లో 17 శాతం పెరుగుదల నమోదు చేసినట్లు పేర్కొంది. ఈ కంపెనీ ప్రధానంగా ఎన్‌ఎక్స్, ఎల్‌ఎం, ఆర్‌ఎక్స్ మోడళ్లను భారత్‌లోయ విక్రయిస్తోంది. దేశంలో లగ్జరీ ఆటోమోటివ్ రంగంలో లెక్సస్ ఇండియా బ్రాండ్‌కు పెరుగుతున్న ఆదరణకు తమ విక్రయాలే నిదర్శనమని ఆ కంపెనీ పేర్కొంది.

HDFC BANK
We understand your world

నమోదిత కార్యాలయం : హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోవర్ పారెల్ (పశ్చిమం), ముంబాయి-400013 మరియు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్, 1వ అంతస్తు, I-తింక్ టెక్నో క్యాంపస్, కంజూర్ మార్గ్ (తూర్పు), ముంబాయి-400042 వద్ద ఉన్న రిటైల్ పోర్ట్ పోలియో నిర్వహణగా దాని కార్యాలయం ఒకటి.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌కి తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించిన విక్రయ సమాచారం మరియు బహిరంగ నోటీసు.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ ("బ్యాంకు") యొక్క దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు బ్యాంకుకు తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించి, రుణం/ఓవర్‌డ్రాఫ్ట్ స్వభావంలో క్రెడిట్ సౌకర్యాలను పొందడం కోసం దీని ద్వారా తెలియజేయబడుతుంది.
అంగీకరించిన లోన్ నిబంధనల ప్రకారం బకాయిలను తిరిగి చెల్లించడంలో రుణగ్రహీతల నిరంతర డీఫాల్ట్ కారణంగా, దిగువ రుణ ఖాతాలు అపరాధ స్థితిలో ఉన్నాయని బ్యాంకు ఈ రుణగ్రహీతలకు అనేక నోటీసులు జారీ చేసింది, దిగువ పేర్కొన్న తేదీలో తుది విక్రయ నోటీసుతో సహా, బ్యాంక్ ప్లెడ్జ్‌ను చేయించిన మరియు దిగువ ఖాతాలలో మొత్తం బకాయిలను తిరిగి చెల్లించడానికి రుణగ్రహీతకు 7 రోజుల సమయం ఇచ్చింది. విఫలమైతే బ్యాంక్ ఈ విషయంలో తదుపరి నోటీసు జారీ చేయకుండా తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విక్రయించడానికి స్వేచ్ఛ ఉంటుంది. రుణగ్రహీతలు నిర్లక్ష్యానికి గురయ్యారు మరియు సరియైన చెల్లింపులు చేయడంలో విఫలమయ్యారు, కాబట్టి రుణ ఒప్పందం ప్రకారం బ్యాంకు తన హక్కులను వినియోగించుకోవడంలో ప్లెడ్జిగా రుణగ్రహీతల నుండి బ్యాంకుకు చెల్లించాల్సిన బకాయిలను రికవరీ చేయడానికి **16 ఏప్రిల్, 2025**న లేదా ఆ తర్వాత సెక్యూరిటీలను విక్రయించాలని/డిస్పోస్ చేయాలని నిర్ణయించింది. రుణగ్రహీతలు మార్జిన్ అవసరంలో మరింత లోపాన్ని సృష్టించడానికి స్టాక్ మార్కెట్‌లో అస్థిరత కారణంగా ఎప్పుడైనా తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విలువ మరింత పడిపోతే, ఈ విషయంలో తదుపరి నోటీసు లేకుండా బ్యాంకు తన అభీష్టానుసారం తాకట్టు పెట్టిన సెక్యూరిటీని క్యాలెండర్ రోజు ఒకటి (1) లోపు విక్రయిస్తుంది. రుణగ్రహీతలు ఏదైనా మిగిలిన బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడానికి, తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విక్రయించడం ద్వారా వచ్చిన మొత్తాన్ని సర్దుబాటు చేసిన తర్వాత బ్యాంకుకు బాధ్యత వహిస్తారు.

క్ర. సం.	లోన్ అకౌంట్ నెం.	రుణగ్రహీతల పేరు	06 ఏప్రిల్, 2025 నాటికి బకాయి మొత్తం	విక్రయ నోటీసు తేదీ
1	XXXX2331	సంజయ్ గుప్తా	4,14,235.44	07-04-2025
2	XXXX4562	విచారపు కళ్యాణ్	969.77	07-04-2025
3	XXXX6241	మారెళ్ల సౌజన్య	9,97,560.00	07-04-2025
4	XXXX7946	చిరంజీలాల్ అగర్వాల్	20,20,519.02	07-04-2025
5	XXXX8146	సుశీలాదేవి అగర్వాల్	54,909.65	07-04-2025
6	XXXX1981	జెట్టి కల్పన	2,59,075.21	07-04-2025
7	XXXX3008	గోర్లి ఎల్ అరుణ కుమార్	3,01,478.82	07-04-2025
8	XXXX3864	యమ్మనూరు గీతాంజలి	10,16,463.00	07-04-2025
9	XXXX2225	రాజ దండ	3,22,735.50	07-04-2025
10	XXXX8577	వీర రాఘవయ్య వసంతం	1,40,283.57	07-04-2025
11	XXXX7003	రమేష్ గుంటుపల్లి	20,10,049.95	07-04-2025
12	XXXX3445	కారంపుడి స్వర్ణ గౌరి	2,97,880.90	07-04-2025
13	XXXX2617	సూర్ల సత్యనారాయణ	4,17,372.00	07-04-2025
14	XXXX4752	రౌతు శ్యామల సుందరి	2,29,195.00	07-04-2025
15	XXXX2257	వెంకట్రావమ్మ గుంటుపల్లి	20,13,313.55	07-04-2025
16	XXXX0823	వట్టివెళ్ల రంగబాబు	9,88,927.18	07-04-2025
17	XXXX1122	సిహెచ్ ఎన్‌విబి సుధీర్	39,403.00	07-04-2025
18	XXXX7993	అలవాల బ్రంహారెడ్డి	82,040.00	07-04-2025
19	XXXX8216	నారాయణమ్మ కీర్తి ప్రియ	26,258.56	07-04-2025
20	XXXX2826	కోడె నాగర్‌పమ్మ	5,13,102.22	07-04-2025
21	XXXX5479	మల్లేడి కనకలక్ష్మి	9,84,995.17	07-04-2025
22	XXXX3943	శేఖర్ గుండల	2,51,802.52	07-04-2025
23	XXXX9621	ముదడ్ల కృష్ణ మూర్తి	70,714.00	07-04-2025
24	XXXX4901	తలారి ఈశ్వరరావు	5,97,535.60	07-04-2025
25	XXXX9490	పద్మనాభుని హరి	49,773.82	07-04-2025
26	XXXX4916	బుర్ర సత్యనారాయణ	9,85,273.00	07-04-2025
27	XXXX5710	జక్క స్వాతి	8,15,372.82	07-04-2025
28	XXXX2701	వెలువర్తి సత్యనారాయణ మూర్తి	3,04,358.06	07-04-2025
29	XXXX3155	గాజులపల్లి బ్రంహయ్య ఆచారి	41,658.82	07-04-2025

తేది : 09.04.2025
ప్రదేశం : ఆంధ్రప్రదేశ్

సం/-
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్

సంపాదకీయం

ఆగ్రహ జ్వాలలు

'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' పేరుతో ట్రంప్ చేస్తున్న విన్యాసాలు ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తున్నాయి. అగ్రరాజ్యం సహా పలు దేశాల్లో ఆగ్రహ జ్వాలలు ఎగసిపడుతున్నాయి. తన మిత్ర దేశాలు సహా ప్రపంచంలోని దాదాపు 60 దేశాలపై ట్రంప్ టారిఫ్‌ల మోత మోగించడం ప్రపంచ మార్కెట్లను కుదేలు చేసింది. బిఎస్‌ఇలో లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ సోమవారం ఒక్క రోజే రూ.14.09 లక్షల కోట్లు ఆవిరై మన దేశ చరిత్రలో మరో 'బ్లాక్ మండే'గా నిలిచిపోయింది. అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌లను ప్రకటించడం ద్వారా చైనా గట్టిగా ప్రతిఘటించడం, మిత్ర దేశాలు సహా చాలా దేశాలు అదే బాటలో వెళ్తుండటం ట్రంప్‌కు మింగుడుపడని వ్యవహారమే! సరైన పత్రాలు లేకుండా అమెరికాలో ఉంటున్న వలసదారులను అవమానకరంగా సంకెళ్లు వేసి, సైనిక విమానంలో పంపినా నోరుమెదపని మోడీ సర్కార్...ఇటీవల 26 శాతానికి పైగా వడ్డించిన టారిఫ్‌ల పైనా అదే లొంగుబాటు వైఖరి ప్రదర్శించడం దారుణం. ట్రంప్ తాజా ఆదేశాలతో 6.4 శాతానికి పైగా భారత్ ఎగుమతులు దెబ్బతింటాయి. మన రాష్ట్రంలోని ఆక్వా రంగం కుదేలవుతోంది. దేశం నుంచి అమెరికాకు 2022-23లో ఎగుమతైన 5.6 బిలియన్ డాలర్ల రొయ్యల్లో మన రాష్ట్రం నుంచి వెళ్లినవే 2.4 బిలియన్ డాలర్ల విలువైనవి. దాదాపు 40 శాతం వాటా మన రాష్ట్రానిదే. ఈ పరిణామాలతో 5.75 లక్షల ఎకరాల్లో రొయ్యలు సాగు చేస్తున్న రైతులు ఆందోళనలో ఉన్నారు. గోడౌన్లలో షిప్పింగ్‌కు సిద్ధంగా ఉంచిన రొయ్యల పరిస్థితేమిటంటూ ట్రేడర్లు భయపడుతున్నారు. తాజా టారిఫ్‌లతో ఆక్వారంగంలో 20 శాతం ఎగుమతులు, ఐరన్ అండ్ స్టీల్‌లో 18 శాతం, జెమ్స్, జ్యూయలరీ 15 శాతం, ఎలక్ట్రానిక్స్ 12 శాతం పడిపోతాయని అంచనా. అమెరికాకు ఎగుమతులు సాఫీగా సాగేలా చేయాల్సిన బాధ్యత, కుదరకుంటే డిమాండ్ తగ్గకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిలవడానికి ఆలంబన తెలుగుదేశం పార్టీ. రాష్ట్ర ప్రయోజనాల కోసం టారిఫ్ విషయంలో ట్రంప్ పోకడలను ప్రతిఘటించాలని కేంద్రంపైన, ప్రధాని మోడీపై ఒత్తిడి తీసుకురావడం ముఖ్యమంత్రి బాధ్యత. అధికార పంపిణీ కన్నా రాష్ట్ర ప్రయోజనం మిన్నగా భావించడం అవసరం.

మన దేశంలో దాదాపు 50 శాతం మంది ఇప్పటికీ ఆధారపడేది వ్యవసాయ రంగంపైనే. 'గ్రాండ్ ట్రేడ్ అగ్రిమెంట్' చేసుకోవడం ద్వారా తమ దేశం నుంచి వంటనూనెలు, పప్పు ధాన్యాలు, కోడిమాంసం, పాలు వంటి ఉత్పత్తులను భారత్‌లోకి అతి తక్కువ సుంకాలతో డంప్ చేసేందుకు అమెరికా ఆత్రంగా ఉంది. ఆ దేశంలోని బహుళ జాతి కంపెనీలను విచ్చల విడిగా అనుమతిస్తే ఆహార ధాన్యాల స్వయంసమృద్ధిని నాశనం చేసుకున్నట్టే. కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ యాపిల్ రైతులు ధర లేక కుదేలవుతున్నారు.

ట్రంప్ సొంత పార్టీ నేతలు, అనుకూల పెట్టుబడిదారులు సైతం ఆర్థిక అణు యుద్ధం అంటూ ఈ దుందుడుకు చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రపంచ దేశాలను దోచుకుని, యుద్ధాలు చేసి బతుకుతున్న అమెరికా..అధిక టారిఫ్‌లు విధించడం విడ్డూరం. ఈ విపరీత పోకడలు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలన్నింటిపై తీవ్ర ప్రభావం చూపుతాయని పలు సంస్థలు ఇప్పటికే అంచనా వేశాయి. టారిఫ్‌లు ప్రకటించాక 6 లక్షల కోట్ల డాలర్లు, ట్రంప్ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి 11 లక్షల కోట్ల డాలర్ల మేరకు స్టాక్ మార్కెట్లలో నష్టం వచ్చినా...తన వైద్యం ప్రభావం చూపడానికి సమయం పడుతుందంటూ అమెరికా అధ్యక్షుడు చెప్పుకోవడం సిగ్గుచేటు. తాజా నిర్ణయాల వల్ల అధిక ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుతుండటంతో అమెరికన్లు ఇప్పటికే పోరుబాటపట్టారు. 2020 బ్లాక్ లైవ్స్ మేటర్ నిరసనల తరువాత అంత కంటే పెద్దఎత్తున 50 రాష్ట్రాల్లోని 1400 ప్రదేశాల్లో 150కి పైగా గ్రూపుల ఆధ్వర్యాన సాధారణ ప్రజానీకం కదం తొక్కారు. మెడికల్ ఎయిడ్, సామాజిక భద్రతా పథకాలకు నిధుల కోత, అవినీతి తదితర అంశాలపై గళమెత్తారు. వీరికి మద్దతుగా లండన్, ప్యారిస్, బెర్లిన్ తదితర నగరాల్లోనూ జనం నిరసనలు హోరెత్తించారు. ట్రంప్‌నకు టారిఫ్‌లు విధించేందుకు పరిమితులు విధించాలంటూ ట్రంప్ సొంత పార్టీకి చెందిన సెనెటర్ డెమొక్రట్లతో కలిసి అక్కడి పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టడం మంచిదే! ట్రంప్ సర్కార్ నిర్ణయాలను ప్రతిఘటిస్తేనే భారత దేశ ప్రయోజనాలు మొత్తం ప్రపంచ వాణిజ్య సరళిని కాపాడుకోవడం సాధ్యం!

మహాత్ముని మాట



మతాన్ని రాజకీయాన్ని దేనికదిగా వేరువేరుగా వుంచాలి. మతాన్ని రాజకీయాల్లోకి, పబ్లిక్ లోకి తీసుకురాకూడదు. దాన్ని వ్యక్తి యొక్క ప్రైవేటు వ్యవహారంగానే చూడాలి.

- గాంధీజీ

mkgandhi

విశ్లేషణ

డీలిమిటేషన్‌తో దక్షిణ భారతానికి అన్యాయం

డీలిమిటేషన్ ప్రక్రియ గురించి దేశవ్యాప్త చర్చ ప్రారంభమైంది. ఇటీవల తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నిర్వహించిన సమావేశానికి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో సహా అనేక రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరై 2026లో జనాభా ప్రాతిపదికపై డీలిమిటేషన్ చేపడితే దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందని, దీనిని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికపై డీలిమిటేషన్ జరిగితే సమాఖ్య స్ఫూర్తి, సమ న్యాయం దెబ్బ తింటాయని, దక్షిణాది రాష్ట్రాలతో పాటు పంజాబ్, మహారాష్ట్ర, బెంగాల్ వంటి రాష్ట్రాలు కూడా రాజకీయంగా నష్టపోతాయని రాజ్యాంగ, రాజకీయ నిపుణులు పేర్కొంటున్నారు.

భారత్‌లో డీలిమిటేషన్ ప్రక్రియ

అమెరికాలో ఎగువసభ సెనెట్ సభ్యుల సంఖ్య 100, ప్రతినిధుల సభ సభ్యుల సంఖ్య 435గా ఉండి, జనాభా పెరిగినప్పటికీ ఇదే సభ్యుల సంఖ్య గత 100 సంవత్సరాలుగా కొనసాగుతున్నది. భారత రాజ్యాంగం ప్రకారం రాజ్యసభ సభ్యుల సంఖ్య 250. రాజ్యాంగం అమలులోకి వచ్చిన గత 75 ఏళ్లుగా రాజ్యసభలో ఇదే సంఖ్య కొనసాగుతున్నది. కాని లోక్‌సభలో డీలిమిటేషన్ ప్రతి పదేళ్లకు జనాభా లెక్కల తరువాత జరగాలని 81వ నిబంధన చెప్పింది. డీలిమిటేషన్ అంటే నియోజకవర్గాల సంఖ్యను పునర్విభజన ద్వారా పెంచడం. ఇప్పటికి నాలుగుసార్లు డీలిమిటేషన్ కమిషన్‌ను వేశారు. తొలి డీలిమిటేషన్ కమిషన్ 1952లో లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను 494 సీట్లకు, రెండవ డీలిమిటేషన్ కమిషన్ 1962లో లోక్‌సభ సీట్లను 522కు, మూడవ డీలిమిటేషన్ కమిషన్ 1972లో లోక్‌సభ సీట్లను 543కు పెంచింది. కానీ, వివిధ రాష్ట్రాల్లో జనాభా పెరుగుదలకు సంబంధించి ఏర్పడిన తారతమ్యాల వలన ఇందిరా గాంధీ ప్రభుత్వం 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 25 ఏళ్ల పాటు 543 స్థానాలే లోక్‌సభలో కొనసాగుతాయని చెప్పింది.

నాల్గవ డీలిమిటేషన్ కమిషన్‌ను 2001లో జస్టిస్ కులదీప్‌సింగ్ అధ్యక్షతన నియమించారు. అప్పటి ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి దక్షిణాది ముఖ్యమంత్రుల కోరిక మేరకు లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య పెంచకుండా 84వ రాజ్యాంగ సవరణ ద్వారా 2026 వరకూ లోక్‌సభలో 543 స్థానాలతో కొనసాగుతాయని తేల్చిచెప్పారు. కులదీప్‌సింగ్ కమిషన్ నియోజకవర్గాల సంఖ్య పెంచకుండా, నియోజకవర్గాల భౌగోళిక సరిహద్దులు మార్చటం, రిజర్వేషన్లు మార్చడానికి పరిమితమైంది. దేశంలో షెడ్యూల్ కులాల రిజర్వేషన్లు లోక్‌సభలో 84 స్థానాలకు, షెడ్యూల్ తెగల రిజర్వేషన్లు 47 స్థానాలకు పెంచింది. నియోజకవర్గాల పెంపుదల జోలికి పోలేదు.

దశాబ్దాల వారీగా జనాభా పెరుగుదల రేటు (శాతంలో)

రాష్ట్రం	1971-81	1981-91	1991-2001	2001-2011
1. కేరళ	19.24	14.32	9.43	4.91
2. తమిళనాడు	17.50	15.39	11.72	15.61
3. ఆంధ్రప్రదేశ్ (ఉమ్మడి రాష్ట్రం)	23.10	24.20	14.59	10.98
4. కర్ణాటక	26.75	21.12	17.51	15.60
5. బీహార్	24.16	23.38	28.62	25.04
6. మధ్యప్రదేశ్	27.16	27.24	24.26	20.35
7. రాజస్థాన్	32.97	28.44	28.41	21.31
8. ఉత్తరప్రదేశ్	25.39	25.61	25.85	20.23

'సీట్ల పెంపుదల జనాభా ప్రాతిపదికన కాకుండా ఒక్కో రాష్ట్రానికి ఇప్పుడున్న సీట్ల నిష్పత్తి ఆధారంగా ('ప్రో-రాటా' పద్ధతిలో) సీట్లు కేటాయించాలి. మొత్తం సీట్లు 848కి పెరుగుతాయని అనుకుంటే, ప్రస్తుతం తమిళనాడుకు గల 39 సీట్లు 'ప్రో-రాటా' ప్రకారం 60 సీట్లు అవుతాయి. అలాగే దక్షిణ భారతదేశానికి 23.7 శాతం అంటే 848లో 201 సీట్లు లభిస్తాయి. ఇది రాష్ట్రాల మధ్య సమ న్యాయానికి వీలు కల్పిస్తుంది. ఉత్తర, దక్షిణ భారతాల మధ్య సమతుల్యతకు మార్గం ఏర్పరుస్తుంది.'

ఉత్తర-దక్షిణ రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల రేటు

గత ఐదు దశాబ్దాల్లో ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల రేటు చాలా ఎక్కువగా ఉంది. ముఖ్యంగా 'బీమారు' రాష్ట్రాలుగా పేర్కొనబడే బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లో పేదరికం, నిరక్షరాస్యత, కుటుంబ నియంత్రణ విధానాలు సక్రమంగా అనుసరించకపోవడం మొదలైన కారణాల వల్ల జనాభా పెరుగుదల రేటు ఎక్కువగా ఉన్నది. అదే సమయంలో దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మొదలైన రాష్ట్రాల్లో పేదరికం తగ్గడం, విద్య, అక్షరాస్యత పెరగడం, కుటుంబ నియంత్రణ విధానాలు పాటించడం మొదలైన కారణాల వల్ల జనాభా పెరుగుదల రేటు గణనీయంగా తగ్గింది. మొత్తం జననాల రేటు 2011 జనాభా లెక్కల ప్రకారం బీహార్‌లో 3.4, ఉత్తరప్రదేశ్‌లో 2.7, రాజస్థాన్‌లో 2.4, మధ్యప్రదేశ్‌లో 2.3 ఉండగా, కేరళలో 1.6, తమిళనాడులో 1.7, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 1.8, పశ్చిమ బెంగాల్‌లో 1.8 ఉన్నది. దక్షిణాది రాష్ట్రాలు, బీమారు రాష్ట్రాల్లో గత నాలుగు దశాబ్దాలలో జనాభా పెరుగుదల రేటును పట్టిక ద్వారా గమనించవచ్చు.

పట్టికను పరిశీలిస్తే నాలుగు దశాబ్దాల కాలంలో జనాభా పెరుగుదల రేటులో దక్షిణాది రాష్ట్రాలకు, బీమారు రాష్ట్రాలకు ఎంత తేడా ఉన్నదో స్పష్టంగా అర్థమవుతున్నది. ఈ నేపథ్యంలో 2026లో డీలిమిటేషన్ ప్రక్రియ జనాభా ఆధారంగా చేపడితే రాజకీయంగా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుంది.

సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

సమాఖ్య స్ఫూర్తితో పని చేయవలసిన చోట, కొన్ని రాష్ట్రాలకు రాజకీయ ఆధిపత్యం లభించే విధంగా కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ చేపడితే దేశ సమగ్రత, దేశ సమైక్యతకు భంగం వాటిల్లవచ్చు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఒకే పన్ను, ఒకే ఎన్నిక, ఒకే భాష మొదలైన విధానాల కోసం దేశ సమైక్యతకు, దేశ సమాఖ్య విధానానికి భంగం వాటిల్లే అనేక చర్యలు చేపట్టింది. 2026లో జనాభా ఆధారంగా నియోజకవర్గాల పెంపుదల చేపడితే మొత్తం నియోజకవర్గాల సంఖ్య 543 నుంచి 848 వరకూ పెరగవచ్చని రాజ్యాంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. అలా పెరిగినప్పుడు ఉత్తర ప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాల సంఖ్య 80 నుంచి 128కి, బీహార్‌లో 40 నుంచి 70కి, రాజస్థాన్‌లో 25 నుంచి 44కి, మధ్యప్రదేశ్‌లో 29 నుంచి 47కి పెరిగే అవకాశం ఉన్నది. అదే సమయంలో దక్షిణాదిన కేరళలో 20 లోక్‌సభ స్థానాల నుంచి 19కి తగ్గుతాయి. మొత్తం దక్షిణాది రాష్ట్రాలలో సీట్ల సంఖ్య 129 నుంచి 144కు మాత్రమే పెరిగే అవకాశం ఉన్నది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 25 లోక్‌సభ స్థానాలు ఉండగా, మరో మూడు పెరిగి... కేవలం 28 స్థానాలు మాత్రమే అవుతాయి. మొత్తం భారతదేశ స్థూల జాతీయోత్పత్తిలో దక్షిణాది రాష్ట్రాల వాటా 36 శాతం ఉండగా, లోక్‌సభ సీట్లలో 23 శాతం మాత్రమే ఉండటం సరైన ప్రాతినిధ్యం కాదు. దీనిని సరిదిద్దాల్సిన అవసరముంది.

ఒక వ్యక్తి - ఒక ఓటు - ఒకే విలువకు విరుద్ధం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఒక వ్యక్తి - ఒకే ఓటు - ఒకే విలువ ఉండాలని రాజ్యాంగ పరిషత్‌లో వ్యాఖ్యానించారు. భారత రాజ్యాంగం ప్రకారం సార్వత్రిక నియోజకవర్గ ఓటుహక్కు ఈ సూత్రంపై ఆధారపడి ఓటు హక్కు కల్పించింది. 2026లో డీలిమిటేషన్ ప్రస్తుత రాష్ట్రాల జనాభా ఆధారంగా చేస్తే ఉత్తరాది రాష్ట్రాలకు దక్షిణాది రాష్ట్రాల కన్నా ఎక్కువ ప్రాతినిధ్యం లభిస్తుంది. డీలిమిటేషన్ ప్రభావం 'ఒక వ్యక్తి-ఒకే ఓటు-ఒకే విలువ'పై స్పష్టంగా ఉంటుంది. ఉత్తర భారత జనాభా పెరిగిందంటే దాని అర్థం అక్కడి పౌరుల ఓటు విలువ దక్షిణాదికన్నా తక్కువగా ఉంటుంది. నియోజక వర్గాలను పునర్విభజన చేయకుండా యథాతథంగా కొనసాగిస్తే ఉత్తర భారత దేశ లోక్‌సభ సభ్యులు ఎక్కువ మంది ఓటర్లకు ప్రాతినిధ్యం వహించవలసి ఉంటుంది. ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో ఒక లోక్‌సభ సభ్యుడు 25 నుండి 30 లక్షల మంది ఓటర్లకు ప్రాతినిధ్యం వహిస్తే, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలలో 15 నుండి 18 లక్షల మందికి ప్రాతినిధ్యం వహిస్తారు. ఇది సరైన పద్ధతి కాదు.

పరిష్కార మార్గం

మారిన పరిస్థితులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజనకు అందరికీ ఆమోదయోగ్యమైన సూత్రాన్ని కనుగొనాలి. అలా చేయకపోతే రాష్ట్రాల ప్రయోజనాలకు విఘాతం ఏర్పడుతుంది. కొంతమంది నిపుణులు మరోసారి లోక్‌సభ స్థానాలు 543కే పరిమితమయ్యే విధంగా మరో రాజ్యాంగ సవరణ చేయాలని భావిస్తున్నారు. అంటే ప్రస్తుత లోక్‌సభలో ఉన్న స్థానాలు 543 యథాతథంగా కొనసాగించాలని వారు భావిస్తున్నారు. కాని ఇది ఓటర్లకు, ప్రజలకు నష్టం కలిగించే అంశం. ఒక లోక్‌సభ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య 5 నుండి 7.5 లక్షల మధ్య ఉండాలని రాజ్యాంగం భావించింది. ఇప్పటికే ఎక్కువ నియోజక వర్గాలలో ఓటర్ల సంఖ్య 20 లక్షలు దాటింది. ఇది ఓటర్ల ప్రయోజనాలను దెబ్బ తీయటమే.

ఇక రెండవ మార్గం సీట్ల పెంపుదల జనాభా ప్రాతిపదికన కాకుండా ఒక్కో రాష్ట్రానికి ఇప్పుడున్న సీట్ల నిష్పత్తి ఆధారంగా ('ప్రో-రాటా' పద్ధతిలో) సీట్లు కేటాయించాలి. మొత్తం సీట్లు 848కి పెరుగుతాయని అనుకుంటే, ప్రస్తుతం తమిళనాడుకు గల 39 సీట్లు 'ప్రో-రాటా' ప్రకారం 60 సీట్లు అవుతాయి. అలాగే దక్షిణ భారతదేశానికి 23.7 శాతం అంటే 848లో 201 సీట్లు లభిస్తాయి. ఇది రాష్ట్రాల మధ్య సమ న్యాయానికి వీలు కల్పిస్తుంది. ఉత్తర, దక్షిణ భారతాల మధ్య సమతుల్యతకు మార్గం ఏర్పరుస్తుంది.

ఎ.పి లో అఖిలపక్ష సమావేశం

డీలిమిటేషన్ 2026 జనాభా ప్రాతిపదికన జరిగితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కూడా నష్టపోతాయి. ఆంధ్రప్రదేశ్‌లో 25 స్థానాలు 28కి, తెలంగాణలో 17 స్థానాలు 20కి మాత్రమే పెరుగుతాయి. రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న కూటమి పార్టీలైన తెలుగుదేశం, జనసేన లు డీలిమిటేషన్‌పై స్టాలిన్ నిర్వహించిన సమావేశానికి హాజరుకాలేదు. ఇంతవరకు ఈ పార్టీల అభిప్రాయాలు కూడా వెల్లడించలేదు.

ప్రధాన ప్రతిపక్ష పార్టీ వైసిపి నాయకుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఒక ఉత్తరం రాయడం మినహా డీలిమిటేషన్ గురించి స్పష్టమైన వైఖరి వెల్లడించలేదు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు డీలిమిటేషన్ గురించి అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి అన్ని పార్టీల అభిప్రాయాలు తెలుసుకోవాలి. ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని నిర్వహించి డీలిమిటేషన్ గురించి చర్చించి రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బ తినకుండా తీర్మానం చేయాలి. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి కూటమి ప్రభుత్వంపై, రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం కూటమి ప్రభుత్వంపై డీలిమిటేషన్ గురించి ప్రజాభిప్రాయాన్ని పెంపొందించడం ద్వారా ఒత్తిడి తేవలసిన అవసరమున్నది.

- కె.యస్. లక్ష్మణరావు,
శాసన మండలి మాజీ సభ్యులు

- డా॥ కె. వసుంధర,
సామాజిక విశ్లేషకులు

సమస్య

ట్రంప్ సుంకాలతో 'ఆక్వా' కుదేలు

'అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా చేద్దాం, అమెరికా ఫస్ట్' నినాదాలతో అమెరికా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ తన దూకుడు స్వభావంతో వాణిజ్య యుద్ధానికి తెర లేపాడు. ఏప్రిల్ రెండవ తేదీన వాణిజ్య లోటును తగ్గించడం, దేశీయ తయారీని ప్రోత్సహించే లక్ష్యంతో వ్యాపార సంబంధ దేశాలపై ప్రతీకార సుంకాలను విధించాడు. పెంచిన సుంకాలు ఏప్రిల్6 నుండే అమలవుతాయని అమెరికా స్పష్టం చేసింది. ఈ సుంకాల వల్ల 60 పైగా దేశాలు ప్రభావితం అవుతున్నాయి. భారత్‌పై 27 శాతం, చైనాపై 34 శాతం, తైవాన్‌పై 32 శాతం, జపాన్‌పై 24 శాతం, యూరోపియన్ యూనియన్‌పై 32 శాతం, ఇతర దేశాలపై 10 శాతం సుంకాలు విధించారు. భారత్‌కు అమెరికా అతి పెద్ద వాణిజ్య భాగస్వామి. 2024 ఆర్థిక సంవత్సరంలో అమెరికాకు ఎగుమతుల విలువ 77.5 బిలియన్ డాలర్లు. భారత్ నుండి ఎగుమతి అయ్యే ప్రధాన వస్తువులు ఎలక్ట్రానిక్స్, రత్నాలు, ఆభరణాలు, ఫార్మా ఉత్పత్తులు, యంత్రాలు, పెట్రోలియం ఉత్పత్తులు. అయితే ఈ సుంకాల ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై గణనీయంగా పడనుంది. ముఖ్యంగా మన రాష్ట్రానికి సంబంధించిన సీ ఫుడ్స్, ఆక్వా రంగాలను తీవ్రంగా నష్టపరచనున్నాయి.

వై.రాము

ఎగుమతిలో అగ్రస్థానం

రొయ్యల ఉత్పత్తిలో భారతదేశం అగ్ర స్థానంలో ఉంది. 2022-23 సంవత్సరంలో భారత్ నుండి 63.969 కోట్ల విలువ కలిగిన 1.73 మిలియన్ టన్నుల మత్స్య ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. అమెరికా మత్స్య ఉత్పత్తులకు పెద్ద మార్కెట్. మొత్తం 5.6 బిలియన్ డాలర్ల విలువైన రొయ్యలు ఎగుమతి అయితే అందులో 2.4 బిలియన్ డాలర్ల విలువైన రొయ్యలు అమెరికాకు ఎగుమతి అయ్యాయి. దాదాపు 40 శాతం మార్కెట్ వాటా భారత్‌దే. మన దేశం నుండి విదేశాలకు ఎగుమతి అవుతున్న మాంస ఉత్పత్తుల్లో రొయ్యలు మూడవ స్థానంలో ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం నుండి నెల్లూరు జిల్లా వరకు ఆక్వా కల్చర్ అభివృద్ధి ఉంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుండి అత్యధికంగా ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఈ జిల్లాలో దాదాపు 1.20 లక్షల ఎకరాలు, రాష్ట్ర వ్యాప్తంగా 5.75 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతుంది. పశ్చిమ గోదావరి నుండే 3.5 లక్షల టన్నుల రొయ్యలు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. మొత్తం 18 వేల కోట్ల వ్యాపారం జరుగుతుంది. ఇందులో విదేశీ ఎగుమతుల వాటానే అధికం. కోవిడ్-19 కారణంగా ఎగుమతులు నిలిచిపోయి పరిశ్రమ నష్టాల్లో కూరుకుపోయింది. దీనికి తోడు వైరస్‌ల బెడద, ధరలు పతనం కావడం, రైతులకు సాగు పెట్టుబడి పెరిగి పోవడంతో ఆక్వా పరిశ్రమ ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. ఇటువంటి సమయంలో ట్రంప్ 27 శాతం సుంకాలు విధించడంతో పరిస్థితులు మరింత దిగజారిపోతున్నాయి.

ఆక్వా రంగంపై సుంకాల ప్రభావం

అమెరికా సుంకాలు విధించగానే 100 కౌంట్ రొయ్య ధర 240 నుండి 200 రూపాయలకు పడిపోయింది. కంపెనీలు కొనడానికి ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు అమెరికా ఏప్రిల్-6వ తేదీ నుండే సుంకాల పెంపు అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకున్న వాటి పరిస్థితి ఏంటి? ఆరవ తేదీ తరువాత అమెరికా రీచ్ అయ్యే ప్రతి సరుకుపై పెరిగిన సుంకాలు అమలు చేస్తామని అమెరికా అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ టారిఫ్ అమలైతే లక్ష రూపాయలు విలువ చేసే రొయ్యలు అమెరికాకు ఎగుమతి చేస్తే 26 వేల రూపాయల పన్ను కట్టాలి. అంతేకాకుండా రవాణా, ప్యాకింగ్, ఇతర ఖర్చులు కలిపి దాదాపు 50 శాతం పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే భారత్ ఎగుమతులపై యాంటీ డంపింగ్ డ్యూటీలు (ఎ.డి.డి)-3.88 శాతం, కౌంటర్ వైలింగ్ డ్యూటీలు (సి.వి.డి)-5.77 శాతం సుంకాలను వసూలు చేస్తున్నారు. కొత్తగా ప్రకటించిన టారిఫ్‌తో కలుపుకుంటే 35 శాతం వరకు ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 1 లక్ష టన్నుల రొయ్యలు ఎగుమతికి సిద్ధంగా ఉన్నాయి. ఇవి కోల్డ్ స్టోరేజ్‌లో ఉన్నాయి. అమెరికాకు 20-40 కౌంట్ ఉన్న రొయ్యలనే ఎగుమతి చేస్తారు. ఎగుమతిదారులు 30 కౌంట్ రొయ్యలను 480 రూపాయలకు కొని కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉంచారు. కొత్త టారిఫ్ ప్రకారం ఎగుమతి చేస్తే మరో 80 రూపాయలు అదనంగా ఖర్చు అవుతుంది. అంటే టన్నుకు రూ.8.50 లక్షలు నష్టం వస్తోంది. ఉన్న సరుకును ఎగుమతి చేయలేరు. కోల్డ్ స్టోరేజ్ ఖర్చులు భరించలేరు. మరోవైపు వడ్డీల భారం ఉండనే ఉంది.

ఈ సుంకాల విధింపు వల్ల ఎగుమతిదారులే కాకుండా... రొయ్యల రైతులు, కార్మికులకు తీవ్ర నష్టం జరగనుంది. ఒడిదుడుకుల ప్రభావం మొట్టమొదట పడేది రైతులు, కార్మికుల పైనే. కౌలుకు తీసుకుని సాగు చేసే రైతుల పరిస్థితి మరింత దారుణం. సాగుతో పాటు దీనికి అనుబంధంగా ఉన్న ఫీడ్ కంపెనీలు, టెస్టింగ్ ల్యాబులు, మెడిసిన్ కంపెనీలు, ప్యాకింగ్ యూనిట్లు, ఇందులో పని చేసే కార్మికులపై వీటి ప్రభావం తీవ్రంగా పడుతుంది.

ఉపాధికి గండి

ఈ సుంకాల విధింపు వల్ల ఎగుమతిదారులే కాకుండా... రొయ్యల రైతులు, కార్మికులకు తీవ్ర నష్టం జరగనుంది. ఒడిదుడుకుల ప్రభావం మొట్టమొదట పడేది రైతులు, కార్మికుల పైనే. కౌలుకు తీసుకుని సాగు చేసే రైతుల పరిస్థితి మరింత దారుణం. సాగుతో పాటు దీనికి అనుబంధంగా ఉన్న ఫీడ్ కంపెనీలు, టెస్టింగ్ ల్యాబులు, మెడిసిన్ కంపెనీలు, ప్యాకింగ్ యూనిట్లు, ఇందులో పని చేసే కార్మికులపై వీటి ప్రభావం తీవ్రంగా పడుతుంది.

రాష్ట్రంలో 450 పైగా రొయ్యల హేచరీలు, 50 పైగా ఫీడ్ మిల్లులు, 2 లక్షల పైగా రొయ్యల చెరువులు, 250 ప్రాసెసింగ్ ప్లాంట్లు, 6 వేలకు పైగా పడవలు, నౌకల ద్వారా కూడా వేలాది మందికి ఉపాధి కల్గుతుంది. 1.5 లక్షల మంది రైతులున్నారు. ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షల మందికి ఆక్వా పరిశ్రమ ఉపాధి చూపుతుంది. పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిపోతే వీరంతా ఉపాధిని కోల్పోతారు.

ట్రంప్ భారత పర్యటన సందర్భంలోనే భారత్‌పై సుంకాలు విధిస్తానని ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం కాలేదు. అమెరికాతో సత్సంబంధాలు ఉన్నా సంప్రదింపులు జరపలేదు. ట్రంప్ నా స్నేహితుడు, హౌడీ-మోడీ అని ప్రచారం చేసిన ప్రధాని ఇప్పుడు స్పందించటంలేదు. అక్రమ వలసదారుల పేరు చెప్పి భారతీయుల కాళ్లకు గొలుసులు కట్టి బానిసల్లా ఇండియాకు పంపినా నోరు మెదపలేదు. సుంకాలు విధించి ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తున్నా కిమ్మనడం లేదు మన ప్రధాని.

దీంతో రూ.18 వేల కోట్ల టర్నోవర్ కలిగిన ఆక్వా పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిపోతుంది. లక్షల మంది రైతులు, కార్మికులు, ఎగుమతిదారులు నష్టపోతున్నారు. కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం సిక్స్, ఫోర్ అంటూ పథకాల ప్రచారంలో మునిగిపోయింది. ఈక్వెడార్ నుండి ఎగుమతిలో గట్టి పోటీ ఎదురవుతుంది. ఇదే అలసత్వం ప్రభుత్వాలు ప్రదర్శిస్తే, ఇండియన్ మార్కెట్ అంతా ఈక్వెడార్, ఇండోనేషియా వంటి దేశాలకు షిఫ్ట్ అయిపోతుంది. ఆక్వా రంగం నిలదొక్కుకోవాలంటే ఎగుమతులను ప్రోత్సహించే చర్యలు తీసుకోవాలి. దేశీయ మార్కెట్‌ను అభివృద్ధి చేసే విధంగా, అమెరికాపై ఆధార పడకుండా ప్రత్యామ్నాయ మార్కెట్లను ఏర్పాటు చేసుకోవడానికి దీర్ఘకాల వ్యూహాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉంది. తక్షణ ఉపశమనంగా రైతుల రుణాలను రీషెడ్యూల్ చేయాలి. ఎగుమతిదారులకు, కార్మికులకు ఆర్థికంగా అండగా నిలవాలి. ఎ.పి ఆర్థిక వ్యవస్థలో ఆక్వా రంగం కీలకమైంది. కనుక దీన్ని కాపాడాల్సిన అవసరం ప్రభుత్వానికి ఎంతైనా ఉంది.

/వ్యాసకర్త డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు/

జనవాక్యం

ఆర్‌టిఐ కార్యాలయంలో కనీస వసతులు ఏవీ!

మంగళగిరి లోని సమాచార హక్కు చట్టం కమిషన్ కార్యాలయానికి ప్రతిరోజూ అటు శ్రీకాకుళం నుండి ఇటు అనంతపురం వరకు వందలాది మంది సహ కార్యకర్తలు వస్తుంటారు. ఈ కార్యాలయంలో కార్యకర్తలకు మూత్రశాల కూడా లేదు. అడిగితే ఏదో ఒక రూం లోకి వెళ్ళండి అని సమాధానం వస్తుంది. అక్కడ మహిళా ఉద్యోగులు కూడా వుంటారు. కొంచం ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఒక రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి వస్తే కనీసావసరాల వసతి కూడా లేకపోవటం అత్యంత విచారకరం. గతంలో ఇదే విషయమై ముఖ్య కమిషనర్‌తో చెప్పటం జరిగింది. ఇంటి యజమానితో చెప్తాను అన్నారు. రెండు సంవత్సరాలు గడిచినా ఫలితం లేదు. మరి అద్దె మాత్రం లక్షల రూపాయలు చెల్లిస్తుంటారు. అన్ని వసతులూ ఉన్న కార్యాలయాలు అమరావతిలో ఉన్నాయి కదా! తక్షణమే ఇలాంటి అద్దె భవనాలను అమరావతికి మారిస్తే బాగుంటుంది. తరువాత రాష్ట్ర వ్యాప్తంగా తమ బాధ్యతలను సరిగా నిర్వర్తించని అధికారులపై, కమిషనర్లు ఇంతవరకు ఎంతమందికి జరిమానా విధించారో లేక శాఖాపరమైన చర్యలకు ఆదేశించారో తెలియదు. పని జరగక కార్యకర్తలకు నిరాశ ఏర్పడుతుంది. కనీసం కొత్త ప్రభుత్వం అయినా ఈ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుని, కొత్త కమిషనర్లను నియమించి సహ చట్టాన్ని పునరుజ్జీవింపచేయాలి.

- నార్నె వెంకట సుబ్బయ్య

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps @gmail.com

16న తెలుగు నాటక రంగ దినోత్సవం

- మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకుని ఈ నెల 16న విజయవాడలో తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సాంస్కృతిక, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తుమ్మలపల్లి వారి క్షేత్రయ్యలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కందుకూరి పురస్కారాల ఎంపికకు కమిటీని నియమించినట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నాటక, సినీ రచయిత, పరిషత్ నిర్వాహకులు బుర్రా సాయి మాధవ్ అధ్యక్షతన 11 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. రాష్ట్ర స్థాయిలో 3 కందుకూరి ప్రతిష్టాత్మక రంగస్థల పురస్కారాలు, ఒక్కో జిల్లాకు 5 చొప్పున మొత్తం 26 జిల్లాలకు 130 జిల్లా స్థాయి కందుకూరి విశిష్ట పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు. ఎంపిక కమిటీలో సభ్యులుగా గుమ్మడి గోపాలకృష్ణ, ఈద ర హరిబాబు, పాటిబండ్ల ఆనందరావు, చిట్టాల వెంకటరావు, కెలివేల్ స్వామి, పి బాలాజీ నాయక్, దాసరి చలపతి, జి పద్మజ, బుర్రా వెంకట రామారావు, మెండు కస్తూరిరావు ఎపి రాష్ట్ర చలనచిత్ర, టివి, నాటక రంగ అభివృద్ధి సంస్థ ఎండి హిమాన్షు శుక్లా ఉన్నారని వివరించారు. నాటక రంగంలో విశేష కృషి చేసిన వారికి రాష్ట్ర స్థాయిలో కందుకూరి ప్రతిష్టాత్మక రంగస్థల పురస్కారంతోపాటు రూ.లక్ష నగదు, జిల్లా స్థాయి వారికి కందుకూరి విశిష్ట పురస్కారంతోపాటు రూ.10 వేలు నగదు అందించనున్నట్లు తెలిపారు.

బ్రహ్మకుమారీస్ చీఫ్

దాది రతన్ మోహిని కన్నుమూత

దాది రతన్

న్యూఢిల్లీ : బ్రహ్మకుమారీస్ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ దాది రతన్ మోహిని మంగళవారం కన్నుమూశారు. గత నెల 25వ తేదీన ఆమె వంద పుట్టిన రోజు నిర్వహించుకున్నారు. బ్రహ్మకుమారి సంస్థ చీఫ్‌గా పనిచేసిన దాది రతన్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం సాయంత్రం ఆమె ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించింది. రాజస్థాన్‌లోని మౌంట్ అబూలో ఉన్న శాంతివనంలోని ట్రామా సెంటర్‌కు డయాలసిస్ కోసం ఆమెను తరలించారు. సోమవారం ఆమె పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. దీంతో ఆమెను అహ్మదాబాద్‌లోని జైడస్ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం తెల్లవారుజామున 1.20 నిమిషాలకు ఆమె తుది శ్వాస విడిచారు. అబూ రోడ్డులో ఉన్న బ్రహ్మకుమారి ప్రధాన కార్యాలయంలోని శాంతివనానికి ఆమె పార్థివదేహాన్ని తీసుకెళ్లనున్నారు. వందేళ్ల మైలురాయి దాటిన రెండో బ్రహ్మకుమారిగా రతన్ మోహిని రికార్డు నెలకొల్పారు. సింధ్‌లోని హైదరాబాద్‌లో 1925, మార్చి 25వ తేదీన దాది రతన్ మోహిని జన్మించారు. ఆమె అసలు పేరు లక్ష్మి. ఉన్నతమైన కుటుంబంలో ఆమె జన్మించారు. హైదరాబాద్, కరాచీ నుంచి ఆమె అంతర్జాతీయ స్థాయిలో బ్రహ్మకుమారి ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టారు. 1954లో జపాన్‌లో జరిగిన వరల్డ్ పీస్ కాన్ఫరెన్స్‌లో బ్రహ్మకుమారిల తరపున ఆమె పాల్గొన్నారు. హాంగ్‌కాంగ్, సింగపూర్, మలేషియాతోపాటు ఆసియా దేశాల్లోనూ ఆమె పర్యటించారు. అంతకుముందు దాది జానకి 1916, జనవరి ఒకటో తేదీన జన్మించి, 2020, మార్చి 27వ తేదీన మరణించారు.

నేడు, రేపు మంత్రి దుర్గేష్ ముంబయి పర్యటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆతిథ్య రంగంలో పెట్టుబడులే లక్ష్యంగా ఈ నెల 9, 10వ తేదీల్లో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి కందుల దుర్గేష్ ముంబయిలో పర్యటించనున్నారు. ముంబయి పోవై లేక్‌లో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకూ జరగనున్న దక్షిణాసియా హోటల్ ఇన్వెస్ట్‌మెంట్ కాన్ఫరెన్స్ వర్క్‌షాప్‌లో మంత్రి పాల్గొంటారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా రాష్ట్రంలో అతిథ్య రంగంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించి పెట్టుబడిదారులను రాష్ట్రానికి ఆహ్వానించనున్నారు. ఈ వర్క్‌షాప్‌కు మంత్రి దుర్గేష్‌తో పాటు పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, టూరిజం ఎమ్‌డి అమ్రపాలి హాజరుకానున్నారు. వర్క్‌షాప్‌కు హాజరయ్యే దేశ, విదేశాల్లోని ప్రఖ్యాత హోటల్ గ్రూప్స్ యాజమాన్యంతో రాష్ట్రంలో నూతన పర్యాటక పాలసీ, పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా తదితర అంశాలను వివరించి పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరనున్నారు.

జైపూర్ బాంబు పేలుళ్ల కేసులో నలుగురికి జీవిత ఖైదు

జైపూర్ : జైపూర్‌లో 2008 - వరుస బాంబు పేలుళ్ల కేసులో దోషులుగా నిర్ధారించబడిన నలుగురికి స్థానిక ప్రత్యేక కోర్టు మంగళవారం జీవిత ఖైదు విధించింది. ఈ కేసులో సర్వర్ అజ్మి, షహబజ్, సైపుర్ రెహ్మాన్, మహమ్మద్ సైఫ్‌లను ఐపిసిలోని వివిధ సెక్షన్లు, ఉపా, పేలుడు పదార్థాల చట్టం కింద ఈ నెల 4న జైపూర్‌లోని ప్రత్యేక కోర్టు దోషులుగా నిర్ధారించిన సంగతి తెలిసిందే. మంగళవారం శిక్ష ఖరారు చేసింది. 2008 మే 13న జైపూర్‌లో వివిధ ప్రాంతాల్లో వరసగా ఎనిమిది బాంబు పేలుళ్లు సంభవించాయి.

పులివెందులలో టిడిపి గ్రూపు తగాదాలు బహిర్గతం

- మంత్రి సవిత సాక్షిగా ఎమ్మెల్సీపై దాడికి యత్నం

ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్సీ ఘర్షణకు దిగిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

పులివెందుల టిడిపిలో గ్రూపు రాజకీయాలు బహిర్గతమయ్యాయి. రెండు గ్రూపుల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. కడప జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత సమక్షంలో మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి గ్రూపునకు చెందినవారు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డిపై దాడికి యత్నించారు. స్థానిక శ్రీకర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం టిడిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మంత్రి హాజయ్యారు. అక్కడకు వస్తున్న ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డిని వేముల టిడిపి ఇన్‌ఛార్జ్ పార్థసారథిరెడ్డి గ్రూపునకు చెందిన వారు అడ్డుకున్నారు.

వైసిపికి అనుకూలంగా రామ్‌గోపాల్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని, టిడిపి నాయకులు చేస్తున్న పనులకు అడ్డు తగులుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనింగ్, ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటి ఉద్యోగాలు, క్యాంటిన్ విషయంలో రామ్‌గోపాల్‌రెడ్డి జోక్యం చేసుకుంటున్నారని వారు విమర్శించారు. మంత్రి సవిత, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. పది రోజుల కిందట వేముల మండలంలో కాంట్రాక్ట్ విషయంలో పార్థసారధి రెడ్డి, ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డి గ్రూపులకు మధ్య ఘర్షణ జరిగింది. అప్పట్లో డిఎస్‌పి మురళీ నాయక్ జోక్యంతో ఇరు గ్రూపులవారు శాంతించారు.

కాంతిరాణాను వేధించడం లేదు : సిఐడి

ప్రజాశక్తి-అమరావతి

ప్రాథమిక హామీ : శ్రీ ఆలపాటి శ్రీనివాసరావు గారి పేరిట ఆంధ్రప్రదేశ్, ఎన్‌టిఆర్ జిల్లా, నిడమానూరు - 521104, ఆర్.ఎస్.నెం. 119/2బి, సమీప డి.నెం. 1-17, నిడమానూరు గ్రామం వద్ద మొత్తం 238.1 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఆస్తి నందు నిర్మించిన హర్షిత ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ నందు అవిభక్త మరియు పేర్కొనబడని మరియు విడదీయలేని ఆస్తి 26.45 చ॥గ॥లు లేదా 22.11 చ॥మీటర్ల విస్తీర్ణంలోని ఆస్తితో పాటు అందలి నిర్మించిన అపార్ట్‌మెంట్ నందు ప్లింత్ ఏరియా 870.0 చ॥అ॥లు మరియు కామన్ ఏరియా 50.0 చ॥అ॥లు మరియు కార్ పార్కింగ్ ఏరియా 100 చ॥అ॥లు విస్తీర్ణంతో రెండవ అంతస్తులోని ఫ్లాట్ నెం. ఎస్.ఎఫ్-2కి చెందిన డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ మరియు దానికి చెందిన అన్ని కామన్ సౌలభ్య హక్కులు మరియు సౌకర్యాలతో సహా. అపార్ట్‌మెంట్‌కి హద్దులు : తూర్పు : 20.0 అ॥ వెడల్పు పంచాయితీ బజారు, ...
...
తేదీ : 03-04-2025 సం/- అధీకృత ఆఫీసర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మౌనమేల.?

● ట్రంప్ వాణిజ్య యుద్ధంపై పెదవి విప్పని మోడీ సర్కార్ ● అమెరికాకు విధేయతేనంటున్న ఆర్థికవేత్తలు

న్యూఢిల్లీ : వాణిజ్య భాగస్వాములపై ట్రంప్ ప్రారంభించిన సుంకాల యుద్ధం విషయంలో చైనా, కెనడా, మెక్సికో లాంటి దేశాలు అమెరికా అధ్యక్షుడి దూకుడుకు తగ్గేదిలేదంటున్నారు. ప్రధాని మోడీతో సహా ప్రధాన స్రవంతి మీడియా మౌనం వహిస్తోంది. విధానపరమైన చర్చలూ జరగడం లేదు. అమెరికా విధించిన ప్రతీకార సుంకాల కారణంగా మన దేశం అనేక సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉన్నప్పటికీ వాటిపై పెద్దగా ఎవరూ చర్చించడం లేదు. అదే సమయంలో చైనా స్పందన చాలా తీవ్రంగా ఉంటోంది. అమెరికా ఉత్పత్తులపై సుంకాలు విధించడం, ఎగుమతులపై నియంత్రణలు, ప్రపంచ వాణిజ్య సంస్థకు ఫిర్యాదులు, తన భూభాగంలో అమెరికా సంస్థలను లక్ష్యంగా చేసుకొని దర్యాప్తులు వంటి చర్యలకు దిగుతోంది. దారికి రాకుంటే మరిన్ని సుంకాలు విధిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలు చేస్తున్నప్పటికీ బేఖాతరు చేస్తోంది. మన దేశం అనుసరిస్తున్న మెతక వైఖరి దాని సైద్ధాంతిక, సంస్థాగత, భౌగోళిక, రాజకీయ పరిమితులకు అద్దం పడుతోందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

ట్రంప్ సుంకాల యుద్ధానికి భారత్ ఇప్పటివరకూ స్పందించింది లేదు. అమెరికా అధ్యక్షుడితో ఇటీవల ప్రధాని మోడీ జరిపిన సమావేశం భారత్ విధేయతను ప్రతిబింబించింది. అమెరికా ప్రభుత్వం మన పౌరులను బలవంతంగా దేశం నుంచి బహిష్కరిస్తున్నా, సంకెళ్లు వేసి కళ్లకు గంతలు కట్టి అమానవీయంగా సైనిక విమానాలలో పంపుతున్నా కిమ్మనడం లేదు. పైగా వారి పట్ల అమానుషంగా వ్యవహరించలేదంటూ కితాబు ఇచ్చింది. ఈ అవమానాలపై ప్రభుత్వ మౌనాన్ని ఎత్తిచూపుతూ తమిళ పత్రిక వ్యంగ్య కార్టూన్ ప్రచురించినప్పుడు క్రూరమైన సమాచార సాంకేతిక చట్టం కింద సెన్సార్ విధించింది. అమెరికా వంటి నిరంకుశ ఆధిపత్య శక్తుల నుంచి అవమానాలు ఎదురైనప్పుడు భారత సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడంలో మన అసమర్ధతను ఇలాంటి ఉదంతాలు బయటపెడతాయి.

భారత ప్రభుత్వ నిష్క్రియాపరత్వానికి ప్రధానంగా రెండు కారణాలు కన్పిస్తున్నాయి. మన పాలక వర్గాలు, వాటి రాజకీయ యంత్రాంగం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు విధేయులుగా వ్యవహరిస్తున్నాయి. సమకాలీన రాజకీయ వ్యవస్థను సరిగా అర్ధం చేసుకోవడంలో మన వైఫల్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. అమెరికా సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని సవాలు చేయడంలో మన పాలక పార్టీలు ఘోరంగా విఫలమవుతున్నాయి. ట్రంప్ విధించిన సుంకాలు మనకు మేలు చేస్తాయని కూడా కొందరు వాదించడం విడ్డూరం. సుంకాలను తగ్గించడం మెరుగైన ఫలితాలను ఇస్తే ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థ అమెరికా వాటిని పెంచాలని ఎందుకు అనుకుంటుంది?

కిమ్మనని భారత్

ప్రపంచ ఆదాయంలో అమెరికా ఆర్థిక వ్యవస్థతో పోలిస్తే మన వాటా తక్కువే. అయినప్పటికీ ప్రపంచ వాణిజ్యంలో భారత ఎగుమతి దిగుమతుల వాటా తక్కువేమీ కాదు. కాబట్టి భారత్ తన ఎగుమతి దిగుమతుల ధరలను పాక్షికంగా నిర్ణయించుకోవచ్చు. ట్రంప్ మొదలెట్టిన వాణిజ్య యుద్ధానికి బలమైన ప్రతిస్పందనను సిద్ధం చేయడానికి బ్రిక్స్ వంటి వేదికలను భారత్ ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉంది. చైనా పేరు చెప్పి అమెరికాకు తలొగ్గుతూ దానికి దూరంగా ఉంటే నష్టపోయేది మనదేశమే. మన దేశం యొక్క బేరసారాల సామర్థ్యాన్ని బలహీనపరుస్తాయి.

అమెరికా మార్కెట్‌పై ఆధారపడే వైఖరినా..?

నిర్దిష్ట ఎగుమతుల కోసం అమెరికా మార్కెట్‌పై ఆధారపడే వైఖరిని భారత్ విడనాడాల్సి ఉంటుంది. భౌగోళికంగా భారత్ అనుసరించే ఎగుమతి వ్యూహం ప్రపంచ మార్కెట్లలో మన బేరసారాల శక్తిని పెంచుతుంది. దీనితో పాటు అమెరికా, చైనా నుండి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించేందుకు మన ప్రభుత్వం ప్రయత్నించాల్సి ఉంటుంది. వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి అమెరికా డిమాండ్లకు లొంగిపోతే రైతులు, వ్యవసాయ కార్మికులు మరింత పేదరికంలోకి వెళ్లిపోతారు.

చెత్త రహిత కేరళ

● అడుగులు వేస్తున్న ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం
● నేటి నుంచి 4 రోజులపాటు సదస్సు

ప్రజాశక్తి-తిరువనంతపురం ప్రతినిధి

కేరళను చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు ఆ రాష్ట్ర వామపక్ష ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తిరువనంతపురాన్ని ఇప్పటికే చెత్త రహిత నగరంగా చేస్తోంది. రాష్ట్రం మొత్తాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు వెళ్తోంది. నవ కేరళం యాక్షన్ ప్లాన్-2లో భాగంగా, 'వ్యర్థ రహిత నవ కేరళం' ప్రజా ప్రస్థానం కింద రాష్ట్రం ఇప్పటికే చెత్త నిర్వహణలో ప్రశంసనీయమైన పురోగతిని సాధించింది. వేస్ట్ మేనేజ్‌మెంట్ రంగంలో కేరళ సాధించిన అద్భుతమైన విజయాలను గుర్తించి నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా వృత్తి (పరిశుభ్ర) 2025 - క్లీన్ కేరళ కాన్‌క్లేవ్ అంతర్జాతీయ శిఖరాగ్ర సదస్సు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ బుధవారం ప్రారంభించనున్నారు. ఈ సదస్సు కేరళ సుస్థిరాభివృద్ధిలో భాగంగా వినూత్న వ్యర్థాల నిర్వహణ పద్ధతులు, వాతావరణ స్థితిగతులు, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే లక్ష్యంగా నిర్వహిస్తోంది. స్టేక్ హోల్డర్లను ఈ పరివర్తన మిషన్‌లో భాగం చేస్తుంది. ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు కేరళ రాజధాని అయిన తిరువనంతపురంలోని కనకకున్ను ప్యాలెస్‌లో ఈ సమ్మేళనం జరగనుంది. రాష్ట్రంలో మొత్తం 1,034 స్థానిక సంస్థల్లో వ్యర్థ రహిత ప్రాంతాలుగా మార్చనుంది. ఈ కార్యక్రమాన్ని కేరళ ప్రభుత్వం, స్థానిక సంస్థల శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న సుచిత్వ మిషన్ సమన్వయం చేస్తోంది. హరిత కేరళ మిషన్, కేరళ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్, క్లీన్ కేరళ కంపెనీ లిమిటెడ్, కుటుంబశ్రీ, ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ మిషన్, కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్, అమృత్, స్మార్ట్ సిటీ తిరువనంతపురం, ఇంపాక్ట్ కేరళ, కేరళ వాటర్ అథారిటీ, కేరళ స్టేట్ పొల్యూషన్‌లో ప్రైవేట్ పార్ట్‌నర్‌తో సహా వివిధ ఏజెన్సీలు పాల్గొంటాయి. కేరళ వ్యర్థ పదార్థాల నిర్వహణ నమూనాలు, సాధించిన విజయాలను ఈ సదస్సులో ప్రదర్శిస్తారు. వినూత్న సాంకేతికతలు, ఆలోచనలు, జాతీయ, అంతర్జాతీయ ఉత్తమ అభ్యాసాలను అర్థం చేసుకునేలా వేదిక ఉంటుంది.

గ్యాస్ ధర పెంపుపై నిరసనలు

● సిపిఎం పిలుపు
● ప్రభుత్వ చర్యను ఖండించిన పొలిట్‌బ్యూరో

న్యూఢిల్లీ : వంట గ్యాస్ సిలిండర్ల ధరలను అమాంతం రూ.50 పెంచడాన్ని సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. పెట్రోల్, డీజిల్‌లపై ప్రత్యేక ఎక్సైజ్ సుంకాన్ని విధించడాన్ని కూడా నిరసించింది. సాధారణ, సబ్సిడీయేతర కేటగిరీలకు చెందిన రెండు రకాల సిలిండర్ల ధరను రూ.50 చొప్పున పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ప్రజలపై దాదాపు రూ.7వేల కోట్ల భారం పడుతోంది. పైగా, పెట్రోల్, డీజిల్‌లపై రూ.32వేల కోట్లు మేరకు ప్రత్యేక ఎక్సైజ్ సుంకాన్ని పెంచింది. ద్రవ్యోల్బణం కారణంగా ఇప్పటికే ప్రజల జీవితాలు భారంగా మారాయని, తాజాగా గ్యాస్ ధరల పెంపుతో ఇంకా తీవ్రమైన ప్రభావం పడనుందని పొలిట్‌బ్యూరో విమర్శించింది. అంతర్జాతీయంగా చమురు, గ్యాస్ ధరలు తగ్గిన నేపథ్యంలో ఆ ప్రయోజనాలను ప్రజలకు అందించడానికి బదులుగా ప్రభుత్వం అదనంగా భారాలు మోపుతోందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. సమాఖ్య సూత్రాలను ఉల్లంఘించి, ప్రత్యేక ఎక్సైజ్ సుంకం పేరుతో అన్ని రకాల ఆదాయాలను తానే సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని విమర్శించింది. ప్రభుత్వం తక్షణమే ఈ ధరలను ఉపసంహరించాలని సిపిఎం డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టాల్సిందిగా పార్టీ శాఖలన్నింటికీ పిలుపునిచ్చింది.

మరో స్కాలర్‌షిప్ పథకానికి మంగళం

● 'స్టడీ ఇన్ ఇండియా'కు కేంద్రం స్వస్తి
● ప్రతిభావంతులైన విదేశీ విద్యార్థులకు మొండిచేయి



న్యూఢిల్లీ : విదేశీ విద్యార్థులకు అందిస్తున్న ఉపకార వేతనాల పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. 'స్టడీ ఇన్ ఇండియా' (ఎస్ఐఐ) పేరుతో విద్యా శాఖ 2018లో ఈ పథకాన్ని ప్రారంభించింది. దీని కింద దేశంలో పేరొందిన పది ప్రముఖ సంస్థలలో ఉన్నత విద్యను అభ్యసించాలని అనుకునే విదేశీ విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే దేశంలోని విద్యార్థుల కోసం ఉద్దేశించిన ఇలాంటి అనేక పథకాలను ఇప్పటికే అటకెక్కించిన మోడీ ప్రభుత్వం తాజాగా ఎస్ఐఐకి కూడా మంగళం పాడింది. 2020-21 విద్యా సంవత్సరం నుండి మొదలైన ఈ పథకం కింద పరీక్ష నిర్వహించి అర్హులైన విద్యార్థులను ఎంపిక చేశారు. వీరు 2022-23 వరకూ ప్రభుత్వం నుండి ఉపకార వేతనాలు పొందారు. 2023-24లో కొత్తగా విద్యార్థులెవ్వరికీ స్కాలర్‌షిప్పులు ఇవ్వలేదు. 2022-23లో ప్రయోజనం పొందిన వారికి ఈ ఏడాది మార్చి వరకూ ఉపకార వేతనాలు అందాయి.

విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేసే ప్రభుత్వ రంగ సంస్థ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ ఇండియా (ఎడ్‌సిల్) డేటా ప్రకారం ఎస్ఐఐ పథకం కింద 2020-21లో 1,207 మంది, 2021-22లో 1,365 మంది స్కాలర్‌షిప్పులు పొందారు. 2022-23లో వారి సంఖ్య 1,048కి పడిపోయింది. విద్యా మంత్రిత్వ శాఖ తరఫున ఈ పథకాన్ని ఎడ్‌సిల్ అమలు చేస్తోంది. ఎస్ఐఐ పథకం కింద ఎంపిక చేసిన వందకు పైగా విద్యా సంస్థలు విదేశీ విద్యార్థుల కోసం అదనపు సీట్లు సృష్టించాయి. స్కాలర్‌షిప్పులు కోరే వారి కోసం 2020లో ఇండియన్ స్కాలస్టిక్ అసెస్‌మెంట్ టెస్ట్ నిర్వహించారు. నేపాల్, ఇథియోపియా, బంగ్లాదేశ్, భూటాన్, ఉగాండా, టాంజానియా, రువాండా, శ్రీలంక, కెన్యా, జాంబియా, ఇండోనేషియా, మారిషస్ దేశాలకు చెందిన ఐదు వేల మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. 2021లో ఈ పరీక్షకు 'ప్రగతి' అని పేరు పెట్టారు. 42 దేశాలకు చెందిన విద్యార్థులు పరీక్ష రాశారు. 2022లో 83 దేశాల నుండి విద్యార్థులు వచ్చి పరీక్షకు హాజరయ్యారు.

స్కాలర్‌షిప్పులకు ప్రాచుర్యం లభిస్తూ విదేశీ విద్యార్థులను ఆకర్షిస్తున్న సమయంలో ప్రభుత్వం ఈ పథకాన్ని నిలిపివేసిందని ఎడ్‌సిల్‌కు చెందిన మాజీ అధికారి ఒకరు చెప్పారు. 'విద్యార్థులను ఈ పథకం బాగా ఆకర్షించింది. ఇప్పుడు దీనిని నిలిపివేయడంతో విదేశీ విద్యార్థులు మన సంస్థలలో చదువుకునేందుకు పెద్దగా రాకపోవచ్చు' అని ఆయన అన్నారు. ఎస్ఐఐ స్కాలర్‌షిప్పుల కోసం అవసరమైన నిధులను వాణిజ్య మంత్రిత్వ శాఖకు చెందిన ఛాంపియన్ సర్వీస్ సెక్టార్ స్కీమ్ ద్వారా అందజేస్తున్నారు. 2022-23 నుండి అవి నిలిచిపోయాయి.

ఇటీవలి కాలంలో కేంద్ర ప్రభుత్వం అనేక ఉపకార వేతన పథకాలను ఆపేసింది. పాఠశాల విద్యార్థులకు ఉద్దేశించిన నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్, మైనారిటీ విద్యార్థులు పరిశోధనలు చేయడానికి ఉపకరించే మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్, నేషనల్ స్కీమ్ ఆఫ్ ఇన్‌సెంటివ్ టూ గరల్స్ ఫర్ సెకండరీ ఎడ్యుకేషన్, కిషోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన వంటి పథకాలకు కేంద్రం అడ్డుకట్ట వేసింది.

ప్రజాస్వామ్యానికి లభించిన విజయం

● సుప్రీం తీర్పును స్వాగతించిన పినరయి విజయన్

న్యూఢిల్లీ : తమిళనాడు గవర్నర్ చర్యని ఎండగడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేరళ సిఎం పినరయి విజయన్ స్వాగతించారు. తమిళనాడు గవర్నర్ బిల్లులను నిరవధిక నిలిపివేయడంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సమాఖ్య వ్యవస్థను, అసెంబ్లీ ప్రజాస్వామ్య హక్కులను సమర్థించిందని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రిమండలి సూచనల ప్రకారమే గవర్నర్ వ్యవహరించాలని అత్యున్నత న్యాయస్థానం ఇప్పటికే పలుసార్లు స్పష్టం చేసిందని, ఈనాడు ఇచ్చిన ఈ తీర్పు బిల్లులను ఆమోదించడానికి నిర్దిష్ట కాలపరిమితులను కూడా నిర్దేశించిందని అన్నారు. అసెంబ్లీ హక్కులను హరించే గవర్నర్ల వైఖరికి ఈ తీర్పు ఒక హెచ్చరికవంటిదని అన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి దక్కిన విజయంగా విజయన్ వ్యాఖ్యానించారు. బిల్లులను తమిళనాడు కేబినెట్ ఆమోదించినప్పటికీ గవర్నర్ ఆమోద ముద్ర వేయకుండా తొక్కిపట్టి వుంచడంతో రాష్ట్రంలో గత 23 నెలలుగా అనిశ్చిత పరిస్థితి నెలకొందని అన్నారు. గవర్నర్ల వైఖరిని వ్యతిరేకిస్తూ కేరళ ప్రభుత్వం న్యాయపోరాటం చేసిందని అన్నారు. ఇటువంటి అంశాల్లో కేరళ ప్రభుత్వం లేవనెత్తిన అంశాల ప్రాధాన్యతను, ఔచిత్యాన్ని ఈ తీర్పు నొక్కి చెప్పిందని అన్నారు. కేరళ మాజీ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ కూడా రాష్ట్రప్రభుత్వం ఆమోదించిన పలు బిల్లులను నిలిపివేసిన సంగతి తెలిసిందే.

అమల్లోకి వక్ఫ్ సవరణ చట్టం

న్యూఢిల్లీ : గత వారం పార్లమెంట్ ఆమోదించిన వక్ఫ్ (సవరణ) చట్టం మంగళవారం నుండి అమల్లోకి వచ్చింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. వక్ఫ్ (సవరణ) చట్టం, "2025లోని సెక్షన్ 1లో సబ్ సెక్షన్ (2) అందచేసిన అధికారాలను వినియోగించుకుని ఏప్రిల్ 8వ తేదీ నుండి ఈ చట్ట నిబంధనలు అమల్లోకి వస్తాయని కేంద్రప్రభుత్వం తెలియజేస్తోంది." అంటూ మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ పేర్కొంది. ఏప్రిల్ 3వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత లోక్‌సభలో, 4వ తేదీ రాజ్యసభలోనూ ఈ బిల్లు ఆమోదం పొందింది. ఏప్రిల్ 5వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రతిపాదిత చట్టానికి తన ఆమోద ముద్ర వేశారు. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ఈ బిల్లుకు మద్దతునివ్వగా, ప్రతిపక్ష ఇండియా బ్లాక్ దీన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ చట్టానికి వ్యతిరేకంగా ఇప్పటికే అనేక ముస్లిం సంస్థలు, ప్రతిపక్ష ఎంపీలు సుప్రీంను ఆశ్రయించారు. ఇది పూర్తి రాజ్యాంగ విరుద్ధమని ప్రతిపక్షం తీవ్రంగా విమర్శిస్తోంది. దీనివల్ల ముస్లిం హక్కులు ఉల్లంఘించబడతాయని పేర్కొంది.

ఖైదీల సమస్యలపై రాష్ట్రాలకు ఎన్‌హెచ్‌ఆర్‌సి నోటీసులు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఉన్న జైళ్లలో ఖైదీలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) అన్ని రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. మహిళా ఖైదీలు, వారి పిల్లలకు కూడా జైళ్లలో కనీస సౌకర్యాలు లేవని, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు లేకపోవడం, జైళ్లలో రద్దీ కూడా ఆందోళన కలిగిస్తోందని కమిషన్ తన నోటీసుల్లో పేర్కొంది. తమ ఆందోళనలపై నాలుగు వారాల్లోగా వివరణాత్మక నివేదికను సమర్పించాలని ఆదేశించింది. జైళ్లలో ఖైదీల సమస్యలను సుమోటాగా స్వీకరించిన ఎన్‌హెచ్‌ఆర్‌సి ప్రత్యేక పరిశీలకులను విచారణకు పంపింది. వారు ఇచ్చిన నివేదికలు ఆధారంగా ఈ నోటీసులు జారీ చేసింది. జైళ్లలో మహిళా ఖైదీల పరిస్థితి దారుణంగా ఉన్నట్లు నోటీసుల్లో కమిషన్ పేర్కొంది. వారి గౌరవం, భద్రతా హక్కుల ఉల్లంఘన, హింస పెరగడం, మానసిక క్షోభకు గురిచేసే సంఘటనలు పెరుగుతున్నాయని తెలిపింది. తగినన్ని మరుగుదొడ్లు లేవని, స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కూడా లేదని, గర్భిణులు, పాలిచ్చే తల్లులు పోషకాహారలోపంతో బాధపడుతున్నారని తెలిపింది. జైళ్లలో ఉంటున్న మహిళా ఖైదీల పిల్లలకు విద్యావకాశాలు, న్యాయ సహాయం, వృత్తి శిక్షణ, పునరావాసం వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం లేదని నోటీసుల్లో కమిషన్ ప్రస్తావించింది.

తుదికంటా పోరాడతాం !

అదనంగా 50శాతం టారిఫ్‌లు విధిస్తామన్న అమెరికా బెదిరింపులపై చైనా స్పష్టీకరణ

బీజింగ్ : ఇరు దేశాల ప్రయోజనాలను, అంతర్జాతీయ సమాజం ప్రయోజనాలను పట్టించుకోకుండా అమెరికా టారిఫ్ యుద్ధాన్ని లేదా వాణిజ్య యుద్ధాన్ని ప్రారంభించాలని పట్టుబడితే చైనా కూడా తుదివరకూ పోరాడుతుందని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ చెప్పారు. అమెరికా చర్యకు దీటుగా చైనా తీసుకుంటున్న ప్రతీకార చర్యలను తక్షణమే ఉపసంహరించుకోని పక్షంలో చైనాపై అదనంగా 50శాతం టారిఫ్‌లు విధిస్తామంటూ ట్రంప్ బెదిరించడంపై అడిగిన ప్రశ్నకు లిన్ మంగళవారం ఈ మేరకు స్పందించారు. అమెరికా ప్రారంభించిన ఈ టారిఫ్ చర్యలు అన్ని దేశాల చట్టబద్ధమైన హక్కులను, ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని, డబ్ల్యుటిఓ నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని, బహుళపక్ష వాణిజ్య వ్యవస్థకు విఘాతం కలిగిస్తున్నాయని, అంతర్జాతీయ ఆర్థిక సుస్థిరతను దెబ్బతీస్తున్నాయని లిన్ విమర్శించారు. ఈ వైఖరిని చైనా తీవ్రంగా ఖండిస్తోందని పునరుద్ఘాటించారు. సమస్యలను రెచ్చగొట్టాలని మేం అనుకోవడం లేదు, అలాగే సమస్యలు ఎదురైతే భయపడం కూడా అని స్పష్టం చేశారు. బెదిరింపులు, ఒత్తిళ్లు వంటివి చైనా దగ్గర పని చేయవన్నారు. చైనా సార్వభౌమాధికారం, భద్రత, అభివృద్ధి ప్రయోజనాలు దెబ్బతింటుంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు.

ఇయు చీఫ్‌కు చైనా ప్రధాని ఫోన్ కాల్

యురోపియన్ కమిషన్ అధ్యక్షుడు ఉర్సులా వాన్ డెర్ లేయన్‌తో మంగళవారం చైనా ప్రధాని లీ కియాంగ్ ఫోన్‌లో మాట్లాడారని సిసిటివి న్యూస్ తెలిపింది. ఈ ఏడాదితో చైనా - ఇయు దౌత్య సంబంధాలకు 50ఏళ్లు పూర్తయినట్లు లీ తెలిపారు. ఇయుతో రాజకీయ పరస్పర విశ్వాసాన్ని పెంచుకోవాలని చైనా భావిస్తోందన్నారు. ఆచరణాత్మక సహకారాన్ని విస్తరించుకోవాలని కోరుకంటున్నామన్నారు. చర్చలు, సంప్రదింపుల ద్వారా పరస్పర ఆందోళనలను పరిష్కరించుకోవాలన్నారు. లేయన్ కూడా స్పందిస్తూ, సుస్థిరతను కొనసాగించాలంటే ఇయు - చైనా సంబంధాలు చాలా కీలకమని వ్యాఖ్యానించారు. బహుళపక్ష వాణిజ్య వ్యవస్థను పరిరక్షించడానికి ఇయు, చైనా కట్టుబడి వున్నాయన్నారు.

చిన్నచిన్న కారణాలతో విదేశీ విద్యార్థుల వీసాల రద్దు

● ఆందోళనలో అమెరికా కాలేజీ యాజమాన్యాలు

వాషింగ్టన్ : హార్వర్డ్, టఫ్ట్స్, స్టాన్‌ఫోర్డ్ సహా ప్రధాన కాలేజీల్లో విదేశీ విద్యార్థులకు జారీ చేసే విద్యార్థి వీసాలను అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారులు రద్దు చేశారు. కారును వేగంగా నడపడంతో సహా పలు కారణాలతో ఇలా వీసాలు రద్దు చేయడం కాలేజీ క్యాంపస్ యాజమాన్యాల్లో ఆందోళనలను రేకెత్తిస్తోంది. ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ రికార్డులను అప్‌డేట్ చేసిన తర్వాత కళాశాలలు ఈ విషయాన్ని గుర్తించాయి. ఈ తాజా పరిణామం విద్యార్థులను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని యాజమాన్యాలు పేర్కొన్నాయి. ఈ పరిస్థితిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నామని అమెరికన్ ఇమ్మిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ ప్రభుత్వ సంబంధాల సీనియర్ డైరెక్టర్ షెవ్ దలాల్-ధేని తెలిపారు. గత నెలలో 300 లేదా అంతకంటే ఎక్కువ వీసాలు రద్దు చేయబడ్డాయని విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇలా వీసాల రద్దుతో పలువురు విద్యార్థులు బాధితులుగా మారుతున్నారు. టఫ్ట్స్ యూనివర్శిటీలో పిహెచ్‌డి చేస్తున్న టర్కీకి చెందిన రుమేసా ఓజ్‌టర్క్‌ను గత నెల వీధిలో నడుచుకుంటూ వెళుతుండగా ఫెడరల్ ఏజెంట్లు అదుపులోకి తీసుకున్నారు. పాలస్తీనా అనుకూల ప్రదర్శనలో పాల్గొన్న తర్వాత కొలంబియా యూనివర్శిటీకి చెందిన మహమూద్ ఖలీల్ వీసా రద్దయింది. ప్రస్తుతం రుమేసా, ఖలీల్ ఇమ్మిగ్రేషన్ జైలులో ఉన్నారు. డ్రైవింగ్ ఉల్లంఘనల పేరుతో కూడా వీసాలను రద్దు చేస్తున్నట్లు కొందరు విద్యార్థులు ఫెడరల్ కోర్టును ఆశ్రయించారు. ఇటీవల కాలిఫోర్నియాలో శాంతాక్రాజ్, స్టాన్‌ఫోర్డ్‌తో సహా పలు క్యాంపస్‌లకు చెందిన 12మందికి పైగా విద్యార్థుల వీసాలు రద్దయ్యాయని స్థానిక మీడియా సోమవారం ప్రకటించింది. తమ యూనివర్శిటీలో చదువుతున్న ఆరుగురు విద్యార్థుల వీసాలు రద్దయ్యాయని స్టాన్‌ఫోర్డ్ గతవారం వెల్లడించింది. ముగ్గురు విద్యార్థులు, ఇద్దరు గ్రాడ్యుయేట్ల వీసాలు రద్దయ్యాయని హార్వర్డ్ యూనివర్శిటీ ప్రకటించింది.

చరిత్ర సృష్టించిన 'హార్ట్ ల్యాంప్'

● బుకర్ ప్రైజ్ షార్ట్‌లిస్ట్‌కు ఎంపికైన తొలి కన్నడ పుస్తకం



న్యూఢిల్లీ : కన్నడ రచయిత్రి బాను ముస్తాక్ కథల సంకలనం హార్ట్ ల్యాంప్ కొత్త చరిత్ర సృష్టించింది. అంతర్జాతీయ బుకర్ ప్రైజ్ కోసం షార్ట్‌లిస్ట్‌కు ఎంపికైన తొలి కన్నడ భాష పుస్తకంగా రికార్డులెక్కింది. 1990 నుంచి 2023 మధ్య బాను రచించిన 12 చిన్న కథల సంకలనం హార్ట్ ల్యాంప్‌ను దీపా భస్తి ఇంగ్లీష్‌లోకి అనువదించారు. 2025 అంతర్జాతీయ బుకర్ ప్రైజ్ షార్ట్‌లిస్ట్‌ను మంగళవారం ప్రకటించారు. ఇందులో ఆరు పుస్తకాలకు స్థానం దక్కగా, వీటిల్లో హార్ట్‌ల్యాంప్ ఒకటి. ఈ షార్ట్‌లిస్ట్ గురించి బుకర్ ప్రైజ్ ఫౌండేషన్ మంగళవారం ఒక ప్రకటనద్వారా వెల్లడించింది. ఎంపికైన ఆరు పుస్తకాలు కూడా మానవ మనుగడ, స్వీయ సంరక్షణ గురించి పుస్తకాలని ప్రశంసించింది. విపత్తు, అణచివేత, నిర్లిప్తత, నిరాశావాదాన్ని ఎదుర్కొంటూనే అజేయమైన ప్రవృత్తి గురించి, మానవ స్ఫూర్తిని, మెరుగైన జీవితాన్ని గడపాలనే ప్రేరణను పంచుకునే పుస్తకాలని తెలిపింది. హార్ట్‌ల్యాంప్‌లోని కథలు గురించి చెబుతూ ఇవి ఇంగ్లీష్‌లో కొత్తగా ప్రచురించబడినప్పటికీ, ఇవి కొన్ని దశాబ్దాల నుంచి ఉన్నాయని తెలిపింది.

భారతీయ భాషల్లో ఇప్పటి వరకూ హిందీ పుస్తకం (2022లో తంబ్ ఆఫ్ సాండ్, రచన : గీతాంజలి శ్రీ) మాత్రమే బుకర్ ప్రైజ్‌ను గెలుచుకుంది. 2023లో పెరుమాళ్ మురుగన్ రచించిన తమిళ నవల ఫైర్ షార్ట్ లిస్ట్‌కు ఎంపికయింది.

మంగళవారం ప్రకటించిన బుకర్ ప్రైజ్ షార్ట్ లిస్ట్ జాబితా : ఆన్ ది కాలిక్యులేషన్ ఆఫ్ వాల్యూమ్ (పుస్తకం 1, డానిష్), స్మాల్ బోట్ (ఫ్రెంచ్), అండర్ ది ఐ ఆఫ్ ది బిగ్ బర్డ్ (జపాన్), ఫెరఫెక్షన్ (ఇటాలియన్), హార్ట్ ల్యాంప్ (కన్నడ), ఎ లెపర్డ్ -స్కిన్ హాట్ (ఫ్రెంచ్).

అణు కార్యక్రమంపై ఇరాన్‌తో ప్రత్యక్ష చర్చలు

● వెల్లడించిన ట్రంప్

వాషింగ్టన్ : అణు కార్యక్రమంపై అమెరికా, ఇరాన్ ప్రత్యక్ష చర్చలు ప్రారంభించనున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌తో నేరుగా చర్చలు జరపనున్నామని, వచ్చే శనివారం ప్రారంభమవుతాయని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్‌తో బేటీ కానున్నామని, ఏమి జరుగుతుందో వేచి చూద్దామని సోమవారం ఆయన వ్యాఖ్యానించారు. ఇరు దేశాలు అణు ఒప్పందం చేసుకోవడమే ఉత్తమమని అందరూ అంగీకరిస్తున్నట్లు తాను భావిస్తున్నానని అన్నారు. ఓవల్ కార్యాలయంలో ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూతో చర్చల సందర్భంగా మీడియాతో మాట్లాడారు.

అణు కార్యక్రమంపై ప్రత్యక్ష చర్చలు జరపాలని లేదా బాంబు దాడులు ఎదుర్కోవలసి ఉంటుందని ఇటీవల ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించిన సంగతి తెలిసిందే. అమెరికాతో ప్రత్యక్ష చర్చలన్నది అర్థం లేని విషయమని ఇరాన్ వ్యాఖ్యానించింది. పరోక్ష చర్చలకైతే తాము సిద్ధంగా ఉన్నామని తెలిపింది.

చట్టవిరుద్ధం, ఏకపక్షం!

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించింది. బిల్లులను అసెంబ్లీ తిరిగి ఆమోదించి, వెనక్కి పంపినప్పుడైనా గవర్నర్ వాటిని ఆమోదించాల్సిందని కోర్టు పేర్కొంది. రాష్ట్ర అసెంబ్లీ బిల్లును ఆమోదించి, తన వద్దకు పంపినప్పుడు గవర్నర్‌కు గల అవకాశాలు, మార్గాలు ఏమిటో రాజ్యాంగంలోని 200వ అధికరణ స్పష్టంగా పేర్కొంటోంది. గవర్నర్ ఆ బిల్లును ఆమోదించవచ్చు, నిలుపు చేయవచ్చు లేదా రాష్ట్రపతి పరిశీలన నిమిత్తం ఆ బిల్లును పంపడానికి అట్టిపెట్టుకోవచ్చు. కొన్ని నిబంధనలను పున:పరిశీలించేందుకు గవర్నర్ బిల్లును సభకు లేదా ఉభయ సభలకు పంపవచ్చు. ఒకవేళ అసెంబ్లీ గనక దాన్ని మళ్లీ ఆమోదించి వెనక్కి పంపితే ఇక గవర్నర్ దానికి ఆమోద ముద్ర వేయకుండా అట్టిపెట్టుకోరాదు. రాజ్యాంగంతో విభేదిస్తోందని భావించినా లేదా ప్రభుత్వ ఆదేశిక సూత్రాలకు విరుద్ధంగా వుందని భావించినా లేదా జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశమైనా అయితే రాష్ట్రపతి పరిశీలన నిమిత్తం బిల్లును పంపేందుకు గవర్నర్ అట్టిపెట్టుకోవచ్చు.

కాలపరిమితులను నిర్దేశించిన న్యాయస్థానం

గవర్నర్ తన ముందుగల అవకాశాలను ఉపయోగించుకోవడానికి కొన్ని కాలపరిమితులను కోర్టు నేడు నిర్దేశించింది. ఈ కాలపరిమితులను ఉల్లంఘించి నట్టైతే గవర్నర్ చర్యపై న్యాయ పరిశీలన చేపట్టాల్సి వస్తుందని స్పష్టం చేసింది. బిల్లును ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టడానికి, మంత్రిమండలి సలహాతో రాష్ట్రపతికి సమీక్ష కోసం పంపేందుకు ఒక నెల రోజులు గడువును కోర్టు ఇచ్చింది. మంత్రిమండలి సలహా, సూచనలు లేకుండా బిల్లును ఆపితే అప్పుడు గడువు మూడు మాసాలు వుంటుంది. రాష్ట్ర అసెంబ్లీ పున: పరిశీలించి గవర్నర్‌కు పంపిస్తే అప్పుడు నెల రోజుల్లోగానే దాన్ని ఆమోదించాల్సి వుంటుంది. రాజ్యాంగంలోని 200వ అధికరణ కింద గవర్నర్ తీసుకునే ఏ చర్య అయినా న్యాయ సమీక్షకు అనువైనదేనని కోర్టు స్పష్టం చేసింది. ఇది ఏ రకంగానూ గవర్నర్ల అధికారాలకు విఘాతం కలిగించడం లేదని కోర్టు స్పష్టం చేసింది. గవర్నర్ చర్యలన్నీ పార్లమెంట్ ప్రజాస్వామ్య సూత్రాలకు అనుగుణంగానే వుండాలని పేర్కొంది.

సమాఖ్య వ్యవస్థ కోసం పోరాటంలో అతిపెద్ద విజయం : స్టాలిన్

సుప్రీం తీర్పును తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె చీఫ్ ఎంకె స్టాలిన్ చారిత్రకమైనదిగా అభివర్ణించారు. ఈ అతిపెద్ద విజయం కేవలం తమిళనాడు రాష్ట్రానికి సంబంధించినది కాదని, మొత్తంగా భారతదేశంలోని రాష్ట్రాలన్నింటికీ వర్తిస్తుందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. రాష్ట్ర స్వయంప్రతిపత్తి కోసం, సమాఖ్య రాజకీయ వ్యవస్థ కోసం డిఎంకె పోరాటం సాగిస్తుందని, గెలుస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

తమిళనాడు ప్రభుత్వంతో ఆది నుంచీ ఘర్షణ పడుతున్న గవర్నర్ రవి

మాజీ ఐపిఎస్ అధికారి అయిన ఆర్.ఎన్.రవి సిబిఐలో కూడా పనిచేశారు. 2021లో తమిళనాడు గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుండి, స్టాలిన్ ప్రభుత్వంతో ఆయన ఘర్షణ పడుతూనే ఉన్నారు. గవర్నర్ బిజెపి ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని, బిల్లులను, నియామకాలను ఆపేస్తున్నారని డిఎంకె ప్రభుత్వం విమర్శిస్తూ వస్తోంది. అసెంబ్లీలో సాంప్రదాయానుసారం గవర్నర్ ప్రసంగించే సమయంలో కూడా ఘర్షణలు చోటు చేసుకున్నాయి. గతేడాది ప్రసంగం ప్రారంభంలో జాతీయ గీతం ఆలపించనందుకు నిరసనగా గవర్నర్ సభ నుండి వాకౌట్ చేశారు. అసెంబ్లీ సమావేశమైనప్పుడు రాష్ట్ర గీతాన్ని చివరిలో జాతీయ గీతాన్ని ఆలపించడం తమిళనాడు సాంప్రదాయంగా వస్తోంది. కానీ గవర్నర్ అందుకు అభ్యంతరం తెలిపారు. రెండుసార్లు జాతీయ గీతమే ఆలపించాలని పట్టుబట్టారు.

2023లో అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా సాంప్రదాయానుసారం ప్రసంగించడానికి గవర్నర్ రవి తిరస్కరించారు. ఆ ప్రసంగంలో అనేక తప్పుదారి పట్టించే, సత్యదూరమైన అంశాలు వున్నాయని ఆరోపించారు. అంతకుముందు ఏడాది ప్రసంగంలోని కొన్ని భాగాలు చదవడానికి తిరస్కరించారు. ఆ పేరాల్లో అంబేద్కర్, పెరియార్, అన్నాదురై, ద్రవిడ నమూనా వంటి పేర్లు వున్నందుకు చదవలేదు.

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

(మొదటిపేజీ తరువాయి)

నంద్యాల, మహానంది, పెద్దకురపాడుల్లోనూ వైసిపి నాయకులపై టిడిపి వారు దాడులు చేశారని చెప్పారు. మరికొంత మందిని తప్పుడు కేసు పెట్టి జైళ్లలో పెడుతున్నారన్నారు. పోసాని కృష్ణమురళీ, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నందిగామ సురేష్, వల్లభనేని వంశీ తదితర నాయకులను జైళ్లలో పెట్టారని వివరించారు. అధికార పార్టీకి అనుకూలంగా పోలీసులు ఇదే తీరున వ్యవహరిస్తే తాము అధికారంలోకి వచ్చాక వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

రోడ్డు మార్గంలో తిరుగు ప్రయాణం

బెంగళూరు నుంచి పాపిరెడ్డిపల్లి గ్రామం సమీపం వరకు హెలికాప్టర్‌లో జగన్ వచ్చారు. ఆ సమయంలో అక్కడికి పెద్ద ఎత్తున వైసిపి నాయకులు, కార్యకర్తలు చేరుకుని హెలికాప్టర్‌ను చుట్టుముట్టారు. ఈ సందర్భంగా అక్కడ కొంత గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో హెలికాప్టర్ విండ్‌షీల్డ్ విరిగిపోయింది. దీంతో ఆ హెలికాప్టర్‌లో విఐపిని తీసుకెళ్లలేమని పైలట్లు చెప్పడంతో జగన్ రోడ్డు మార్గంలో బెంగళూరుకు వెళ్లారు. భద్రతాపరమైన చర్యలు తీసుకోవడంలో పోలీసులు వైఫల్యం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని వైసిపి నాయకులు విమర్శించారు.

గ్యాస్ ధరపై ఆగ్రహ జ్వాలలు

(మొదటిపేజీ తరువాయి)

డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ పూర్తి బాధ్యత వహించి, ధరలు తగ్గించే దిశగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, కె శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం బండారుగూడెం గ్రామంలో నిరసన తెలిపారు. తిరుపతిలోని పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు తలపై గ్యాస్ బండను మోస్తూ 'ఈ భారాలు మేం మోయలేం' అంటూ వినూత్నంగా నిరసన తెలిపారు. నాయుడుపేటలో 'కట్టెల పొయ్యి' పెట్టి నిరసన ప్రదర్శన చేశారు. పుత్తూరు, శ్రీకాళహస్తి, రేణిగుంటలోనూ ధర్నాలు నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం కేశవరంలో కట్టెల పొయ్యిపై వంట చేసి నిరసన తెలిపారు. ఏలూరు, బాపట్ల జిల్లాల్లో ఆందోళనలు చేశారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తోటపల్లిగూడూరులో సిలిండర్లతో నిరసన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విశాఖ జిల్లా సీతమ్మధార తహశీల్దార్ కార్యాలయం, అనకాపల్లిలో ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద వద్ద గ్యాస్ బండలతో నిరసన ప్రదర్శన, కర్నూలు ఓల్డ్ సిటీ పూల బజార్ సెంటర్లో ధర్నా, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఆందోళనలు నిర్వహించారు. పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతపురంలోని టవర్‌క్లాక్ సర్కిల్ వద్ద సిలిండర్‌ను ఈడ్చుకుంటూ వస్తూ నిరసన తెలిపారు. అక్కడ బైఠాయించి ఆందోళన చేపట్టారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని సత్యనారాయణపురంలో ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు నిరసన తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లి, ఫిరంగిపురం, మంగళగిరిలో ఆందోళనలు చేశారు.

మీకోసం

కాకరకాయలను ముక్కలుగా కట్‌చేసి ఫ్రిజ్‌లో నిల్వ చేస్తే పండిపోకుండా ఉంటాయి.

జీవన సౌరభం

గమ్యం ఎంత ఎత్తులో ఉన్నా, దాన్ని చేరుకునే మార్గం కిందనుంచే మొదలవుతుంది.

మాకోసం మంచి పండ్లు

మామయ్య వచ్చాడు
మామిడి పండ్లు తెచ్చాడు
అత్తయ్య వచ్చింది
అరటి పండ్లు ఇచ్చింది
పెదనాన్న వచ్చాడు
పనసపండు తెచ్చాడు
పెద్దమ్మ వచ్చింది
జామ పండ్లు ఇచ్చింది
బాబాయి వచ్చాడు
బొప్పాయి పండు తెచ్చాడు
పిన్నమ్మ వచ్చింది
దానిమ్మలు ఇచ్చింది
అన్నయ్య వచ్చాడు
ఆపిల్ పండ్లు తెచ్చాడు
వదినమ్మ వచ్చింది
ద్రాక్షపండ్లు ఇచ్చింది
అక్కయ్య వచ్చింది
కమలాలు ఇచ్చింది
బావగారు వచ్చారు
బత్తాయిలు తెచ్చారు
తాతయ్య వచ్చాడు
తీపి సపోటాలు తెచ్చాడు
అమ్మమ్మ వచ్చింది
అల్లనేరేళ్ళు ఇచ్చింది
నానమ్మ వచ్చింది
నారింజలు ఇచ్చింది.

- జె.శ్యామల,
99896 01113.



చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన అంకెలను వరసగా కలుపుతూ వెళ్లండి. ఏ బొమ్మ వచ్చిందో చూడండి.

నేను గీసిన బొమ్మ

డి.భవ్య శ్రీ,
5వ తరగతి,
ఏ.బి.ఎస్ పబ్లిక్ స్కూల్, అగనంపూడి,
విశాఖపట్నం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పరుగుల రాణి

పుట్టుకతోనే దృష్టిలోపం.. ఆపై పేదరికం.. కూలిపనులు చేసుకునే అమ్మానాన్నకి ఆ బిడ్డని చదివించే స్థోమత లేదు. చుట్టూ ఇన్ని సమస్యలు వేధిస్తున్నా తను ఎప్పుడూ కుంగిపోలేదు. తన ప్రతిభ, బలం ఏమిటో తెలుసుకునేందుకు ప్రయత్నించింది. అమ్మానాన్నకు దూరంగా బడిబాట పట్టి, అక్కడే తన సత్తా నిరూపించుకుంది. ప్రపంచస్థాయిలో ప్రతిభ చాటుతోంది. మారుమూల మన్యం నుంచి పరుగుపందెంలో సత్తా చాటుతున్న ఆమె గుమ్మలక్ష్మీపురం మండలం గుల్లలంక గ్రామానికి చెందిన కిల్లక లలిత.

పార్వతీపురం లోవముఠా ప్రాంతమైన బీరుపాడు పంచాయతీ గుల్లలంక గిరిజన గ్రామంలో నిరుపేదలైన కిల్లక బోర్జ, చిట్టమ్మల కుమార్తె లలిత. నలుగురు సంతానంలో రెండోబిడ్డ. మిగిలిన పిల్లలు బాగానే ఉన్నా, లలితకి మాత్రం జన్యులోపం వల్ల చూపు సరిగ్గా కనిపించదు. మొదట్లో మసగ్గా కనిపించేది. తరువాత తరువాత పూర్తిగా చూపు కోల్పోయింది.

తను చూస్తున్న ప్రపంచం నెమ్మదినెమ్మదిగా కనుమరుగవుతుంటే లలిత ఎంతో దిగులుపడింది. ఒకపక్క చదువుకోవాలని బలంగా ఆశపడింది. కానీ ఆర్థికపరిస్థితులు ఆ కలని నెరవేర్చేలా లేవు. అప్పుడే దృష్టి లోపం ఉన్న చిన్నారుల కోసం విద్య నేర్పించే విశాఖ నేత్రాలయ స్కూలు వారు లలితని అక్కున చేర్చుకున్నారు. చదువులో చురుగ్గా ఉండే తను ఆటల పట్ల చూపిస్తున్న శ్రద్ధని కూడా గుర్తించారు. ఆ దిశగా తనని ప్రోత్సహించారు.

పరుగుపోటీల్లో ప్రతిభ సాధించేలా నైపుణ్య శిక్షణ ఇప్పించారు. దేశ, విదేశాల్లో రాణిస్తున్న లలిత, భవిష్యత్తులో అంతర్జాతీయ పారా క్రీడల్లో బంగారు పతకం సాధించాలని లక్ష్యం పెట్టుకుంది. విశాఖ నేత్రాలయ పాఠశాలలో ఇంటర్మీడియట్ వరకు చదివింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని నేత్రాలయ కళాశాలలో డిగ్రీ చదువుతోంది.

2018 నుండే లలిత, తన జైత్ర యాత్ర ప్రారంభించింది. ఇప్పటి వరకు అంతర్జాతీయ స్థాయిలో రెండు రజతాలు, ఒక కాంస్య పతకం సాధించింది. జాతీయస్థాయిలో నాలుగు స్వర్ణాలు, 11 రజతాలు, మూడు కాంస్య పతకాలు సొంతం చేసుకుంది.

2023లో హాంగ్‌జౌ, చైనాలో జరిగిన ఆసియా పారా గేమ్స్‌లో 100 మీటర్ల పరుగులో రజత పతకం, మొరాకోలో మర్రకెచ్‌లో జరిగిన 7వ ప్రపంచ పారా అథ్లెటిక్ గ్రాండ్ ప్రిక్స్‌లో వరుసగా 1500 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంలలో రెండింటిలోనూ 5వ స్థానాన్ని కైవసం చేసుకుంది. అదే ఏడాది బెంగళూరులో జరిగిన 5వ ఇండియన్ ఓపెన్ పారా అథ్లెటిక్స్ ఇంటర్నేషనల్ ఛాంపియన్ షిప్‌లో 1:10 నిమిషాల్లో 400 మీటర్లు, 6:18 నిమిషాల్లో 1500 మీటర్లు పరుగు పందెంలో విజయం సాధించి కాంస్య పతకం సాధించింది. 2025 మార్చి 11-13 వరకు న్యూఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్‌లో 400 మీటర్లలో బంగారు పతకం, 1500 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించింది.

**- టి.రవికుమార్,
ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం విలేకరి.**

పెరుగులో మేలు చేసే గుణాలు

ఎండాకాలం తరుచుగా ఛాతిలో, కడుపులో మంటపుడుతూ ఉంటుంది. అలాంటప్పుడు చాలామంది కూల్‌డ్రింక్స్ లేదా కూలింగ్ వాటర్ తాగుతారు. వీటికన్నా పెరుగుతో చేసిన లస్సీగానీ, పెరుగు గానీ తింటే సమస్య తగ్గుతుంది. పెరుగులో శరీరానికి మేలు చేసే గుణాలు చాలా ఉన్నాయని ఆహార నిపుణులు చెబుతున్నారు.

- ఏ ఆహారం తీసుకున్నా కడుపులో మంటగా ఉన్నప్పుడు రోజూ పరగడుపున ఒక కప్పు పెరుగు తింటే చాలా మంచిది.
- ప్రతిరోజూ పెరుగు తీసుకునే మహిళల్లో వెజైనల్ ఈస్ట్ ఇన్ఫెక్షన్లు వచ్చే చాన్స్ చాలా తక్కువని పరిశోధనలు చెబుతున్నాయి.
- పెరుగు శరీరంలో తేమ శాతం తగ్గిపోకుండా కాపాడుతుంది. అందుకే జీర్ణవ్యవస్థ పనితీరు బాగుంటుంది. పొట్టలో ఇన్ఫెక్షన్లు రాకుండా ఉంటాయి. హైబీపీ కూడా అదుపులోకి వస్తుంది.
- పని వల్ల బాగా ఒత్తిడికి గురైనవారు పెరుగు తీసుకుంటే అలసట తీరుతుంది. మంచి నిద్రలోకి వెళ్లి మెదడుపై ఒత్తిడి తగ్గుతుంది. కాబట్టి రోజువారీ ఆహారంలో తప్పనిసరిగా పెరుగు భాగం చేసుకోవాలి.
- పెరుగులో క్యాల్షియం అధికంగా ఉంటుంది. ఇది ఎముకలకు, దంతాలకు మేలు చేస్తుంది. పెరుగులో ఫాస్ఫరస్ కూడా ఉంటుంది. ఇది క్యాల్షియంతో కలవడం వల్ల ఎముకలు స్ట్రాంగ్‌గా ఉంటాయి. రోజూ పెరుగు తినడం వల్ల భవిష్యత్తులో కీళ్లనొప్పులు, ఆస్టియోపొరోసిస్ లాంటి సమస్యలు రాకుండా ఉంటాయి.

ఉసిరి ఆరోగ్య సిరి

సి విటమిన్ పుష్కలంగా ఉండే ఉసిరిని ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యపరంగా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి.

- మధుమేహ బాధితులు ఎండబెట్టిన ఉసిరి పండ్ల చూర్ణంలో పసుపు, తేనె వేసుకొని రోజూ తింటే మంచి ఫలితం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.
- రోగ నిరోధక శక్తి పెరగడానికి కూడా ఉసిరి ఎంతగానో తోడ్పడుతుంది.
- ఊపిరితిత్తులు, కాలేయం, జీర్ణమండలం మొదలైన వాటి సమస్యలకు తగ్గించడానికి దోహదపడుతుంది.
- కంటి బాధలు ఉన్నవారు ఒక స్పూన్ ఉసిరి రసం, అర టీ స్పూన్ తేనె కలిపి రోజూ తాగితే ఆ సమస్యలు తగ్గుముఖం పడతాయి.
- ఉసిరిలో ఉండే పీచుపదార్థం వల్ల పేగు కదలికలు మెరుగుపడి, జీర్ణవ్యవస్థ సక్రమంగా ఉంటుంది.
- ఎండిపోయిన ఉసిరికాయతో బెల్లం కలిసి తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది.
- ఆస్మా, బ్రాంకైటిస్ వ్యాధులు తగ్గుముఖం పడతాయి.
- ఉసిరికాయ జ్యూస్ రోజూ తాగడం వల్ల మూత్రనాళ సమస్యలు తగ్గుతాయి. మూత్ర విసర్జన సమయంలో వచ్చే మంటను పారదోలడంలో ఉసిరి ప్రధాన పాత్ర పోషిస్తుంది.
- నెలసరి సమస్యలు తగ్గించడానికి కూడా ఉసిరికాయ రసం ఎంతగానో తోడ్పడుతుంది.

అయితే ఉసిరిని తగుమాత్రమే తీసుకోవాలి. ఎక్కువగా తీసుకుంటే అనర్థాలు కూడా ఉన్నాయి. ఆహారంలో కొద్ది భాగంగానే తీసుకోవాలి తప్ప ఎక్కువగా తినకూడదు.

అల్లు, అట్లీ కాంబో అప్డేట్



అల్లు అర్జున్, అట్లీ కాంబోలో తెరకెక్కే చిత్రం అప్డేట్ వచ్చేసింది. మంగళవారం అర్జున్ పుట్టినరోజు సందర్భంగా నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ఈ సినిమా ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్ట్ వివరాలు పంచుకుంటూ ఓ వీడియో విడుదల చేసింది. ఈ ప్రాజెక్ట్ ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నట్లు వీడియోలో చూపించారు. అభిమానుల ఊహలకు అందని రీతిలో ఈ సినిమా ఉండనుందని తెలిపారు. ఇందులో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించనున్నారు. దీని కోసం అట్లీ, అల్లు అర్జున్ లాస్ ఏంజెల్స్‌లోని ప్రముఖ వీఎఫ్ఎక్స్ సంస్థను సంప్రదించారు. హాలీవుడ్ తరహాలో విజువల్స్ ఉండనున్నట్లు తెలిపారు. వీఎఫ్ఎక్స్ నిపుణులు మాట్లాడుతూ.. ఇప్పటివరకూ ఇలాంటి స్క్రిప్ట్ చూడలేదన్నారు. అల్లు అర్జున్‌కు స్క్రీన్ టెస్ట్ చేసిన విజువల్స్ కూడా ఇందులో చూపించారు.

'రాజాసాబ్' విడుదల వాయిదా

ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న సినిమా 'రాజాసాబ్'. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా మొదట్లో ఏప్రిల్ 10న విడుదల చేస్తామని నిర్మాతలు ప్రకటించారు. ఈమేరకు ప్రభాస్ అభిమానులు కూడా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఆయన పలు ప్రాంతాల్లో ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా చేసిన పోస్ట్‌లకు స్పందనగా ప్రభాస్ అభిమానులు 'రాజాసాబ్' సినిమా రిలీజ్ ఎప్పుడు? అంటూ పోస్ట్‌లు పెట్టారు. దీనికి ఆయన స్పందిస్తూ పోస్ట్ పెట్టారు. 'రిలీజ్ అనేది నా ఒక్కడి చేతుల్లో లేదు. ఎలాంటి అప్డేట్ అయినా పీపుల్స్ మీడియా నిర్మాణ సంస్థ ఇస్తుంది. కొంత టాకీ, పాటల షూటింగ్ ఇంకా పెండింగ్‌లో ఉంది. చాలా గ్రాఫిక్స్ సంస్థలు ఈ సినిమా కోసం పనిచేస్తున్నాయి. కొన్ని సంస్థలు ఇచ్చిన ఔట్‌పుట్ బాగుంది. చిత్రీకరణ పూర్తికాగానే పాటలు రిలీజ్‌స్తాం. మా కష్టాన్ని చూపించేందుకు మేము కూడా ఎదురుచూస్తున్నాం' అని చెప్పుకొచ్చాడు.

వరుసగా 9 సినిమాల్లో

నయనతార వరుసగా సినిమాలు చేస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఆమె వరుసగా 9 చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ లిస్ట్‌లో ఒకటి 'మన్నాంగట్టి సిన్స్ 1960' ఈ చిత్రానికి విక్కీ దర్శకత్వం వహిస్తున్నారు. రెండవది 'టాక్సిక్' ఇది కన్నడ చిత్రం.. యష్ నాయకుడిగా గీతూ మోహన్దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. ఇక మూడవది 'డియర్ స్టూడెంట్స్'.. ఇది మలయాళ చిత్రం. నాలుగోది 'రాకాయి' ఈ మూవీకి సెంథిల్ నలసామి దర్శకత్వం వహిస్తున్నారు. ఐదో చిత్రం 'మూక్కుత్తి అమ్మన్ 2' (అమ్మోరు2). ఆరో సినిమా మలయాళంలో మోహన్ లాల్, మమ్ముట్టితో కలిసి నటిస్తున్నారు. టైటిల్ ఇంకా ఫిక్స్ అవ్వలేదు. ఏడో చిత్రాన్ని దురై సెంథిల్ కుమార్ దర్శకత్వంలో నటిస్తున్నారు. ఎనిమిదో సినిమా రవి మోహన్‌కి జంటగా నటిస్తున్నారు. దీనికి కూడా టైటిల్ ఇంకా ఫిక్స్ చేయలేదు. ఇక తొమ్మిదో చిత్రం 'హాయ్'.

25న 'తుడరుమ్'

మోహన్ లాల్ నటిస్తున్న తాజా చిత్రం 'తుడరుమ్' రిలీజ్ డేట్‌ని ప్రకటించారు. ఏప్రిల్ 25న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. 'ఆపరేషన్ జావా', 'సౌదీ వెళ్లాక' ఫేం తరుణ్ మూర్తి ఈ సినిమాని తెరకెక్కించారు. 15 సంవత్సరాల తర్వాత ఒకప్పటి స్టార్ హీరోయిన్ శోభన, మోహన్ లాల్‌కి జంటగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో మోహన్‌లాల్ కార్ డ్రైవర్ రోల్ లో కన్పించబోతున్నారు.

'ఓదెల-2' ట్రైలర్ విడుదల

తమన్నా ప్రధాన పాత్రధారిగా వస్తోన్న 'ఓదెల-2' చిత్రం నుండి తాజాగా ట్రైలర్ విడుదలైంది. ట్రైలర్‌ను బట్టి చూస్తే, 'ఓదెల రైల్వే స్టేషన్' సినిమా చివరిలో వశిష్టను అతని భార్య హెబ్బా పటేల్ చంపేస్తుంది. ఆమె జైలు పాలైన తర్వాత అతను ఆత్మగా మారి, ఊరందరి మీద పగ, ప్రతీకారాలు పెంచుకొని వారందరినీ ఇబ్బంది పెట్టడం మొదలుపెడతాడు. హెబ్బా పటేల్ సోదరి తమన్నా ఊరికి ఇబ్బంది అని తెలిసి, ఆ ఇబ్బందిని దూరం చేయడానికి తిరిగి వస్తుంది. ఏప్రిల్ 17న థియేటర్లలో ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలకానుంది.

లక్నో గెలుపు

- భారీ ఛేదనలో పోరాడి ఓడిన కోల్‌కతా
- పూరన్ ధనా ధన్ ఇన్నింగ్స్
- రహానే కెప్టెన్సీ ఇన్నింగ్స్ వృథా

కోల్‌కతా: ఈడెన్ గార్డెన్స్‌లో చివరి బంతి వరకు ఉత్కంఠ భరితంగా జరిగిన ఐపిఎల్ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ విజయం సాధించింది. కోల్‌కతా నైట్‌రైడర్స్ 239పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో నిర్ణీత ఓవర్లు పూర్తయ్యే సరికి 234పరుగులు చేసి విజయానికి నాలుగు అడుగుల దూరంలో ఆగిపోయింది. కోల్‌కతా ఓపెనర్లు డికాక్ 15(9), సునీల్ నరైన్ 30 (13) ధాటిగా ఆరంభించినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ రహానె 61 (35 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), వెంకటేశ్ అయ్యర్ 45 (29 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) అద్భుతంగా ఆడారు. ఫోర్లు, సిక్స్‌లు కొడుతూ, వికెట్ల మధ్య పరుగులు తీస్తూ మ్యాచ్‌ను నెమ్మదిగా కోల్‌కతా వైపు తిప్పారు. ఒకానొక దశలో కోల్‌కతా విజయావకాశాలు మెరుగ్గా కనిపించాయి. అయితే, శార్దూల్ ఠాకూర్ వేసిన 13 ఓవర్ మొత్తం మ్యాచ్ స్వరూపాన్ని మార్చేసింది. మొదటి ఐదు బంతులు ఐదు వైడ్‌లు వేసి చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్న శార్దూల్ చివరి బంతికి రహానె వికెట్ తీయడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. ఆ తర్వాత రమణదీప్ సింగ్(1), రఘువంశీ(5), రస్సెల్(7) తక్కువ పరుగులకే పెవిలియన్‌కు చేరారు. రింకూ సింగ్ 38 (15 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), హర్షిత్ రాణా 10 (9 బంతుల్లో 2 ఫోర్లు) చివరిలో మెరుపులు మెరిపించిన ఫలితం లేకుండా పోయింది. లక్నో బౌలర్లలో ఆకాశ్‌దీప్, శార్దూల్ ఠాకూర్ చెరో రెండు వికెట్లు తీయగా, అవేశ్‌ఖాన్, దిగ్వేష్ సింగ్, రవి బిష్ణోయ్ తలో వికెట్ తీశారు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. ఓపెనర్ మిచెల్ మార్ష్ (81; 48 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఈ సీజన్‌లో నాలుగో అర్ధ శతకం నమోదు చేశాడు. ఇక నికోలస్ పూరన్ (87నాటౌట్; 36 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. మార్‌క్రమ్ (47; 28 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. హర్షిత్ బౌలింగ్‌లో పూరన్ వరుసగా రెండు సిక్సర్లు కొట్టి 21 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. రస్సెల్ వేసిన 18 ఓవర్‌లో పూరన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఈ ఓవర్‌లో అతను వరుసగా 4, 0, 4, 6, 4, 6 బాదేశాడు. చివరి రెండు ఓవర్లలో 21 పరుగులు వచ్చాయి. కోల్‌కతా బౌలర్లలో హర్షిత్ రాణాకు రెండు, ఆండ్రీ రస్సెల్ ఒక వికెట్ పడగొట్టారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ నికోలస్ పూరన్‌కు దక్కింది.

పూరన్(87; 36బంతుల్లో 7ఫోర్లు, 8సిక్సర్లు)

స్కోర్‌బోర్డు...

లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (బి)హర్షిత్ రాణా 47, మిచెల్ మార్ష్ (సి)రింకు సింగ్ (బి)రస్సెల్ 81, పూరన్ (నాటౌట్) 87, అబ్దుల్ సమద్ (బి)హర్షిత్ రాణా 6, డేవిడ్ మిల్లర్ (నాటౌట్) 4, అదనం 13. (20ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 238పరుగులు. **వికెట్ల పతనం:** 1/99, 2/170, 3/221 **బౌలింగ్:** వైభవ్ అరోరా 4-0-35-0, జాన్సన్ 3-0-46-0, వరుణ్ చక్రవర్తి 4-0-31-0, హర్షిత్ రాణా 4-0-51-2, నరైన్ 3-0-38-0, రస్సెల్ 2-0-32-1.

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: డికాక్ (ఎల్‌బి)ఆకాశ్ దీప్ 15, నరైన్ (సి)మార్‌క్రమ్ 30, రహానే (సి)పూరన్ (బి)శార్దూల్ 61, వెంకటేశ్ అయ్యర్ (సి)మార్‌క్రమ్ (బి)ఆకాశ్ దీప్ 45, రమన్‌దీప్ (సి)మార్‌క్రమ్ (బి)రవి బిష్ణోయ్ 1, రఘువంశీ (సి)పంత్ (బి)ఆవేశ్ ఖాన్ 5, రస్సెల్ (సి)డేవిడ్ మిల్లర్ (బి)శార్దూల్ 7, రింకు సింగ్ (నాటౌట్) 38, హర్షిత్ రాణా (నాటౌట్) 10, అదనం 22. (20ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 234పరుగులు. **వికెట్ల పతనం:** 1/37, 2/91, 3/162, 4/166, 5/173, 6/177, 7/185 **బౌలింగ్:** ఆకాశ్ దీప్ 4-0-55-2, శార్దూల్ 4-0-52-2, ఆవేశ్ ఖాన్ 4-0-45-1, దిగ్వేశ్ సింగ్ 4-0-33-1, రవి బిష్ణోయ్ 4-0-47-1.

ఐపిఎల్‌లో నేడు

గుజరాత్ టైటాన్స్ × రాజస్థాన్ రాయల్స్
వేదిక: అహ్మదాబాద్; రాత్రి 7.30గంలకు

ప్రియాన్ష్ సూపర్ సెంచరీ

39 బంతుల్లోనే శతకం ● చెన్నైపై పంజాబ్ గెలుపు

ఛండీగఢ్: ఐపిఎల్ సీజన్-18లో తొలి శతకం నమోదైంది. పంజాబ్ కింగ్స్ యువ ఆటగాడు ప్రియాన్ష్ ఆర్య చెన్నై సూపర్‌కింగ్స్‌పై కేవలం 42బంతుల్లో 7ఫోర్లు, 9సిక్సర్ల సాయంతో 103 పరుగులతో రాణించాడు. చివర్లో శశాంక్(52నాటౌట్), జాన్సెన్ (34నాటౌట్) కూడా రాణించడంతో పంజాబ్ జట్టు 219పరుగుల భారీ స్కోర్ చేసింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో చెన్నై జట్టు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 5వికెట్లు కోల్పోయి 201పరుగులే చేయగల్గింది. కాన్వే(69), దూబే(42), రచిన్ రవీంద్ర(36) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో చెన్నై జట్టు 5మ్యాచుల్లో ఒక గెలుపుతో పాటు వరుసగా నాల్గో ఓటమిని చవిచూసింది. మరోవైపు పంజాబ్ 18పరుగుల తేడాతో చెన్నైపై గెలిచి నాల్గో స్థానానికి ఎగబాకింది.

తొలుత పంజాబ్ బ్యాటర్లు నేహాల్ వధేరా(9), మాక్స్‌వెల్(0)ను అశ్విన్ పెవిలియన్‌కు పంపాడు. ఫామ్‌లో ఉన్న పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ రెండో వికెట్‌గా పెవిలియన్‌కు చేరాడు. 9 పరుగులు చేసిన శ్రేయస్ అయ్యర్.. ఖలీల్ అహ్మద్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డయ్యాడు. ముఖేష్ చౌదరి బౌలింగ్‌లో ప్రభుసిమ్రాన్ ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరాడు. ముల్లాన్‌పూర్ వేదికగా పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లు తలపడతున్నాయి. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఇరుజట్లు కూడా ఎటువంటి మార్పులు లేకుండా బరిలోకి దిగాయి. దీంతో నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి లక్నో జట్టు 6వికెట్ల నష్టానికి 219పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. చెన్నై బౌలర్లు ఖలీల్ అహ్మద్, అశ్విన్‌కు రెండేసి, నూర్ అహ్మద్, ముఖేశ్ చౌదరికి ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ప్రియాన్ష్‌కు దక్కింది.

ప్రియాన్ష్ అదరహో...

2025 ఐపిఎల్ సీజన్‌లో తొలి సెంచరీ కొట్టి ఆటగాడిగా ప్రియాన్ష్ ఆర్యా నిలిచాడు. 39 బంతుల్లోనే శతకం బాదిన ప్రియాన్ష్ ఆర్యాది ఐపిఎల్ చరిత్రలో 4వ ఫాస్టెస్ట్ సెంచరీ. అంతకుముందు క్రిస్ గేల్(30బంతులు), యూసుఫ్ పఠాన్(37), డేవిడ్ మిల్లర్(38) ప్రియాన్ష్ కంటే తక్కువ బంతుల్లోనే సెంచరీ కొట్టిన ఆటగాళ్లు. ఇక అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేయకుండానే సెంచరీ కొట్టిన ఆటగాళ్ల జాబితాలోనూ ప్రియాన్ష్ చోటు దక్కించుకున్నాడు.

ఐపిఎల్‌లో సెంచరీ కొట్టిన అన్‌క్యాప్‌డ్(అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేయకుండా) ఆటగాళ్లు..

- షాన్ మార్ష్ : రాజస్తాన్‌పై 2008
- మనీష్ పాండే : డెక్కన్ ఛార్జెస్ 2009
- పాల్ వాల్తాటి(పంజాబ్), చెన్నైపై 2009
- దేవదత్ పడిక్కల్ (బెంగళూరు), రాజస్తాన్‌పై 2021
- రజత్ పాటిదార్ (బెంగళూరు), లక్నోపై 2022
- యశస్వి జైస్వాల్ (రాజస్థాన్), ముంబయిపై 2022
- ప్రభ్‌సిమ్రాన్ సింగ్ : ఢిల్లీపై 2023
- ప్రియాంష్ ఆర్య (పంజాబ్), చెన్నైపై 2025

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68